మంగళవారం 20-2-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 330

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సేవ

విజయవాడకు చెందిన 50 ఏళ్ల **జోన్స్ మానికొండ** వెనుక ఏ ఆర్థిక అండాదండా లేదు. కాని ఆమె విజయవాడలో, కృష్ణాజిల్లాలో ఇంకా రాష్ట్రవ్యాప్తంగా మురికివాడల పిల్లల కోసం 60 ట్యూషన్ కేంద్రాలను వాలంటీర్లతో నడుపుతోంది. నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల వల్ల స్కూల్ పాఠాల పట్ల భయం ఏర్పడకుండా, స్కూల్ మానేయకుండా ఈ ఈవెనింగ్ ట్యూషన్స్ సాయపడుతున్నాయి. మొత్తం 6 వేల మంది పిల్లలు ఇప్పటికి జోన్స్ వల్ల మేలు పొందారు.



ట్యూషనమ్మ

మామూలు పిల్లల సాయంత్రాలు వేరు. తల్లి వారికి స్నానం చేయించి, తినడానికి ఏదైనా ఇచ్చి, కాసేపు ఆడుకోనిచ్చి, ఆ తర్వాత చదువుకు కూచోబెడుతుంది. చదివిస్తుంది. లేదంటే ట్యూషన్‌కు పంపుతుంది. మరి మురికివాడల్లోనో? ఆ పిల్లలు స్కూల్‌కు వెళ్లడమే కష్టం. ఇంటికొచ్చాక పాఠాలు చదివించాలంటే తల్లికి తీరిక ఉండదు. లేదా ఆమెకు చదువు రాదు. తండ్రికి అసలే పట్టదు. మరుసటి రోజు స్కూల్‌కు వెళితే హోమ్‌వర్క్ చేయలేదని టీచర్ తిడుతుందని భయం. దాని బదులు స్కూల్ ఎగ్గొట్టడమే నయం. ఇలా ఆ పిల్లలు డ్రాపవుట్స్‌గా మారితే? అందుకే జోన్స్ మానికొండ మురికివాడల్లో ట్యూషన్లు నడుపుతుంది. ఆదర్శ్ ఎడ్యుకేషన్ సెంటర్స్ పేరుతో ఆమె నడుపుతున్న ట్యూషన్లు ఆంధ్రప్రదేశ్‌లో పిల్లల చదువుకు మేలు చేస్తున్నాయి.



చదువే గౌరవం

విజయవాడలోనే పుట్టి పెరిగిన జోన్స్ మానికొండ ఏడుగురు సంతానంలో రెండవది. సోషియాలజీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశాక ఎం.ఈడీ. చేసి, సైకాలజీలో మరో పీజీ చేసింది. 'మా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు అందరం బాగా చదువుకున్నాం. చదువు మాత్రమే మనిషికి గౌరవం, ఉపాధి ఇవ్వగలదు. కాని నేటికీ చాలా పేదవాడల్లో పిల్లలకు చదువు అందడం లేదు. మురికివాడల్లోని పిల్లల కోసం ఏదైనా చేయాలని నిశ్చయించుకున్నాను. ప్రతి ఒక్కరూ చదువుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదనే కాదు సమాజం మీద కూడా ఉంది' అంటుందామె. సమాజ సేవ కోసం అవివాహితగా ఉండాలని నిర్ణయించుకుంది జోన్స్.

వెనుకబడ్డ సమూహాలు

మురికివాడల్లో ఎక్కువగా ఉంటున్నది వెనుకబడ్డ సమూహాలు అని గమనించి ఆ సమూహాల మీద దృష్టి పెట్టింది జోన్స్. యానాది, ఎరుకల, వడ్డెర, జంగం, సుగాలి, కోయ... ఇలా 19 సమూహాలను గుర్తించి వారి నివాస ప్రాంతాల్లో ట్యూషన్ సెంటర్లను నిర్వహిస్తోంది. మొత్తం కృష్ణాజిల్లాలో 22, విజయవాడలో 13, వైజాగ్‌లో 4, హైదరాబాద్‌లో 3 సెంటర్లు ఆమె ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. 48 టీచర్లు, 13 మంది వాలంటీర్లు మురికివాడల్లో ట్యూషన్లు చెబుతూ పిల్లలు స్కూళ్లకెళ్లి బాగా చదువుకునేలా సహాయం చేస్తున్నారు.

బంధుమిత్రుల సాయంతో

జోన్స్ నిర్వహిస్తున్న ఈవెనింగ్ ట్యూషన్లకు నెలకు దాదాపు 2 లక్షల ఖర్చు అవుతుంది. ఈ ఖర్చులో దాదాపు ఎక్కువ భాగం సౌత్ ఆఫ్రికాలోని ఒక సోదరుడు, సింగపూర్‌లో ఉన్న ఒక సోదరి ఇస్తారు. మరికొంత సాయం స్నేహితుల వల్ల... దాతల వల్ల అందుతుంది. 'కేవలం చదువు మాత్రమే కాదు... ఈ పిల్లలకు పౌష్టికాహారం, పరిశుభ్రమైన బట్టలు కూడా కావాలి. ఆ దిశగా కూడా నా సేవ కొనసాగాలని కోరుకుంటున్నాను. పేదరికం వల్ల పిల్లల్ని పనుల్లో పెట్టే తల్లిదండ్రులను ఒప్పించి ఆ పిల్లలను బడికి పంపేలా చూడటం మాకున్న అతిపెద్ద సవాలు' అంటుంది జోన్స్.

లెక్చరర్‌గా ఉద్యోగం మానేసి మరీ ఆమె చేస్తున్న ఈ సేవకు సమాజం నుంచి మరింత మద్దతు దొరుకుతుందని ఆశిద్దాం.

కొత్త దారి

కోనేటి కలువలు వచ్చేనమ్మా

అందమైన రంగవల్లులై... ఎండలన్ని పూలజల్లులై

'కొలనులో కలువలు' అనే మాట వినబడగానే కళ్లముందు భావుకతతో కూడిన అందమైన దృశ్యం ఆవిష్కారం అవుతుంది. కానీ 'కాంక్రీట్ జంగిల్స్‌లాంటి నగరాల్లో కొలను ఎక్కడా? కలువ ఎక్కడా?' అని నిట్టూర్చేవారి కోసం 'మీ ఇంటిలోనే కోనేటి కలువలు' కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చింది కేరళలోని త్రిసూర్‌కు చెంది విజి అభి.

'ఇంటర్నేషనల్ వాటర్‌లిల్లీ అండ్ వాటర్ గార్డెనింగ్ సొసైటీ' నుంచి నేర్చుకున్న పాఠాలతో తనదైన హైబ్రీడ్ వెరైటీని సృష్టించింది. మొక్కల అమ్మకాల ద్వారా నెలకు లక్ష రూపాయల వరకు ఆర్జిస్తోంది విజీ అభి...

కాలక్షేపంగా మొదలైన తోటపని కాస్తా విజీకి పాషన్‌గా మారింది. ఫుల్-టైమ్ గార్డెనర్ కావడానికి ముందు ఆమె అకౌంటెంట్‌గా పనిచేసింది. ఒక బిడ్డకు తల్లి అయిన తరువాత ఉద్యోగానికి రాజీనామా చేసిన విజీ తనకు అత్యంత ఇష్టమైన గార్డెనింగ్‌లోకి వచ్చింది.

'గార్డెనింగ్‌లో నా శైలిలో కొత్తదనాన్ని తేవాలనే కలలు కనేదాన్ని. అయితే ఎలా, ఏమిటి అనేదానిపై మాత్రం సరియైన మార్గనిర్దేశం లేదు' అంటూ తోటపనిలో తొలిరోజులను గుర్తు తెచ్చుకుంటుంది విజీ. బోగన్ విల్లాలు, ఆర్కిడ్లు, గులాబీల పెంపకంతో ఆమె గార్డెనింగ్ జర్నీ మొదలైంది. తన తోటలోని విత్తనాలను ఇరుగు పొరుగు వారికి పంచేది.

కొత్తరకం మొక్కలు కొనడానికి జనాలు ఆసక్తి చూపుతున్నారనే విషయం ఫేస్‌బుక్ ద్వారా విజీకి అర్థమైంది. తమకు ఉన్న పరిమిత స్థలంలోనే చాలామంది వాటర్ ప్లాంట్స్‌ను పెంచుతున్న విషయం తెలుసుకుంది. అలా వాటర్ ప్లాంట్స్‌పై తనలో ఆసక్తి మొదలైంది. 'మొక్కలను ఎలా కాపాడుకోవాలి' అనేదాని గురించి తొలి రోజుల్లో విజీకి పెద్దగా ఏమీ తెలియదు. దీంతో ఇంటర్‌నెట్‌లోకి వెళ్లి ప్లాంటర్స్, గార్డెనర్‌ల సోషల్ మీడియా గ్రూప్‌లలో చేరింది.

'ఫేస్‌బుక్ గ్రూప్స్ ద్వారా దేశ విదేశాల్లో ఉన్న ఎంతోమందితో పరిచయం అయింది. ఇంటర్నేషనల్ వాటర్‌లిల్లీ అండ్ వాటర్ గార్డెనింగ్ సొసైటీలో మెంబర్ అయ్యాను. వీడియో కాల్స్ ద్వారా నీటి మొక్కల పెంపకానికి సంబంధించి రకరకాల సలహాలు తీసుకునే అవకాశం దొరికింది' అంటుంది విజీ.

వాటర్ ఫ్లవర్స్ పెంచడం ప్రారంభించిన తొలి రోజుల్లో పొరపాటున హార్డ్ వాటర్ లిల్లీస్‌ను కొన్నది విజీ. కేరళ వాతావరణ పరిస్థితులు తట్టుకోలేక ఆ మొక్కలు చనిపోయాయి. దీంతో మళ్లీ మొదటి నుంచి ప్రయత్నం ప్రారంభించింది. వాటర్ లిల్లీలను ఎలా పెంచాలి అనేదానిలో ప్రావీణ్యం సంపాదించింది.

'ప్రావీణ్యం' దగ్గరే ఆగిపోకుండా ప్రయోగాలపై దృష్టి పెట్టింది. సొంత వెరైటీని సృష్టించాలి అనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. హైబ్రిడైజ్ చేసి 'నింఫాయశ్రీ' అనే సొంత వెరైటీని క్రియేట్ చేసింది. దీనికి మంచి గుర్తింపు లభించింది.



విజీ అభి

హ్యాపీ పాట్ హ్యాపీ ప్లాంట్

> స్థానిక వాతావరణ పరిస్థితుల ఆధారంగా సరైన రకం వాటర్ లిల్లీలను ఎంచుకోవడం చాలా ముఖ్యం. కేరళలో ఉష్ణమండల రకాలకు ప్రాధాన్యత ఇస్తారు. వాటర్ లిల్లీలకు రోజుకు కనీసం ఆరు గంటలు సూర్యరశ్మి అవసరం. పువ్వులు బాగా పెరగడానికి పెద్ద కుండీలను ఎంపిక చేసుకోవాలి. వాణిజ్య అవసరాల కోసం అయితే చిన్న కుండీలు అనువైనవి. చిన్న కుండీలలో ఆరు అంగుళాల వరకు, పెద్ద కుండీలలో పద్దెనిమిది అంగుళాల వరకు కలువలు వికసిస్తాయి. రసాయనిక ఎరువులకు దూరంగా ఉండాలి. వర్మీ కంపోస్ట్ అనేది లిల్లీలతో అద్భుతాలు చేయించగలదు. ఆవుపేడను కూడా ఉపయోగించవచ్చు. స్థానికంగా లభించే సహజ పదార్థాలకే ప్రాధాన్యత ఇవ్వాలి. సలహాల విషయంలో న్యూ గార్డెనర్స్ మొహమాటాలకు పోవద్దు. తొలిరోజుల్లో నేను ఎవరి సలహా తీసుకోక పోవడం వల్లే ఫెయిల్ అయ్యాను.
>
> – విజీ అభి

కట్ చేస్తే...

తన ఇంటి తోటలో విజీ 100 రకాల కలువలను పెంచుతోంది.

'వాటర్ లిల్లీ మొక్కలకు మార్కెట్‌లో మంచి ధర ఉన్న విషయం మొదట్లో నాకు తెలియదు. తెలిసిన తరువాత ఫేస్‌బుక్ వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంతోమందికి వాటర్ లిల్లీలను అమ్మడం ప్రారంభించాను' అంటుంది విజీ అభి.

బయోచార్... నల్ల బంగారం!

బయో అంటే జీవం, చార్ అంటే బొగ్గు. ఈ 'జీవవంతమైన బొగ్గు' పొడిని పంట పొలంలో వెద చల్లితే.. ఆ నేల తిరిగి జీవాన్ని సంతరించుకొని సారవంతం అవుతుంది. బయోచార్ కలిసిన భూమిలో బంగారు పంటలు పండుతాయి. ఒకటో, రెండో పంట కాలాల్లో ప్రభావాన్ని కోల్పోయే 'ఎరువు' లాంటిది కాదిది. నేలను ఎన్నో ఏళ్ల పాటు ఆరోగ్యవంతంగా ఉంచే అద్భుత సహజ వనరు ఇది.

పంట తీసుకున్నాక మిగిలే పత్తి కట్టె, కంది కట్టె వంటి వ్యర్థాలను ఆరుబయట కుప్పగా వేసి నిప్పు పెడితే కాసేపట్లో బూడిద మిగులుతుంది. అయితే, ఆ కట్టెను డ్రమ్ములో పెట్టి, పెద్దగా గాలి తగలకుండా ఓ పద్ధతి ప్రకారం కాల్చితే 'బయోచార్' అవుతుంది. కట్టె పరిమాణంలో 25-30% మేరకు బయోచార్ తయారవుతుంది. చిన్న, సన్నకారు రైతులు తమ పొలంలో పంట వ్యర్థాలతో పైసా ఖర్చు లేకుండా తయారు చేసుకొని వాడుకోగలిగినది బయోచార్. అనంతపురం వ్యవసాయ పరిశోధనా స్థానంలో శాస్త్రవేత్త డా. కే సి. నటరాజ, ప్రధాన శాస్త్రవేత్త డా. బి. సహదేవరెడ్డి బయోచార్ తయారు చేసి, వర్షాధార వ్యవసాయంలో ప్రయోగాత్మకంగా వాడి, సత్ఫలితాలు సాధించారు. వారి అనుభవాలతో కూడిన వ్యాసం 'సాక్షి సాగుబడి' పాఠకుల కోసం ప్రత్యేకం...

వ్యవసాయ రంగంలో 'బయోచార్' ఇటీవల కాలంలో ప్రాచుర్యంలోకి వస్తోంది. 'బయో' అంటే జీవం, చార్ అంటే 'బొగ్గు'. అంటే.. 'నేలకు జీవాన్నిచ్చే బొగ్గు' అని అర్థం. ఇది వట్టి బొగ్గు మాత్రమే కాదు. కర్బనంతో కూడిన సేంద్రియ పదార్థం కూడా. అలాగే, బయోచార్ అనేది ఒక పంట కాలంతో ప్రభావాన్ని కోల్పోయే ఎరువు కూడా కాదు. మరేమిటి? చాలా ఏళ్లపాటు నేలలో ఉంటూ మట్టి భౌతిక లక్షణాలను మెరుగు పరచడానికి, ఆరోగ్యవంతంగా ఉంచడానికి సూక్ష్మజీవులకు ఆవాసం కల్పించడానికి, తేమను పట్టి ఉంచి పోషకాలను అందించడానికి దోహదపడుతుంది.

మన దేశంలో ప్రతి సంవత్సరం పంట పొలాల నుంచి సుమారు 20 నుంచి 25 కోట్ల టన్నుల (మోళ్లు, గడ్డి, కట్టె వంటి) పంట అవశేషాలు రైతులకు అందుబాటులోకి వస్తున్నాయి. వీటిలో కొంత భాగాన్ని పశువులకు మేతగా వేస్తున్నారు. మరికొంత భాగాన్ని కంపోస్ట్ ఎరువు తయారీకి లేదా ఇతరత్రా పనులకు వినియోగిస్తుంటారు. పత్తి కట్టె లేదా కంది కట్టె వంటి చాలా గట్టి వ్యర్థాలతో 'బయోచార్' తయారు చేసి నేల ఆరోగ్యానికి సమర్థవంతంగా పునర్వినియోగించవచ్చు.

పత్తి / కంది కట్టెతో 'బయోచార్' తయారీ:

- బయోచార్ తయారీకి కావాల్సిన పదార్థాలు.. పంట కోసిన తర్వాత మిగిలిన వ్యర్థాలు. ఉదాహరణకు ఎండిన పత్తి కట్టె, కంది కట్టె, కంప చెట్లు, కాంగ్రెస్ కంప చెట్లు, ఆముదం కట్టె, మొక్కజొన్న గింజలు వొలిచిన తర్వాత మిగిలే కంకులు, వేరుశనగ పొట్టు, చెరకు పిప్పి, కొబ్బరి పొట్టు.. వంటి గట్టి వ్యర్థ పదార్థాలు
- 200 లీటర్ల ఇనుప డ్రమ్ము (వాడిన ఆయిల్ డ్రమ్)
- ఈ డ్రమ్ము కింద మంట పెట్టడానికి కొన్ని పంట వ్యర్థాలు లేదా కట్టెలు
- పంట కోసిన తరువాత మిగిలిన వ్యర్థాలను ముక్కలు చేసి ఇనుప డ్రమ్ములో నిండుగా పెట్టి, గాలి లోపలికి పెద్దగా వెళ్లకుండా మూత గట్టిగా పెట్టాలి. డ్రమ్ము కింద మంట రాజేసి (300 – 650 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో) కాల్చడం ద్వారా పారిశ్రామిక స్థాయిలో బయోచార్‌ను తయారు చేస్తారు
- అయితే, స్థానికంగా రైతు స్థాయిలో ఇనుప డ్రమ్ముల్లో (300 – 400 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో కాల్చుతూ) తక్కువ ఖర్చుతోనే 'బయోచార్'ను తయారు చేసుకోవచ్చు
- పంట అవశేషాలు తగు మాత్రంగా ఆక్సిజన్‌తో కాలితేనే నాణ్యమైన బయోచార్ తయారవుతుంది. పూర్తిగా కాలిపోతే బూడిది మిగులుతుంది. అలాకాకుండా, ఎక్కువ పరిమాణంలో నాణ్యమైన బయోచార్ వచ్చేలా తయారు చేసే విధంగా ప్రక్రియను నిర్వహించాలి
- 200 లీటర్ల ఇనుప డ్రమ్‌లో ఎక్కడా ఖాళీ లేకుండా పంట అవశేషాలను చక్కగా పేర్చాలి. ఇలా పేర్చినప్పుడు ఒక్కో పంట అవశేషాలను ఒక్కొక్క మోతాదులో నింపగలుగుతాం. ఉదాహరణకు, ఎండిన పత్తి కట్టె 15 నుంచి 20 కేజీలు, కంది కట్టె 18 నుంచి 25 కేజీలు, ఆముదం కట్టె 12 నుంచి 15 కేజీలు నింపవచ్చు. దానికి అనుగుణంగానే బయోచార్ ఒకటి రెండు కేజీలు ఎక్కువ తక్కువగా ఉత్పత్తి అవుతుంది
- బెజ్జాల ద్వారా పరిమితంగా ఆక్సిజన్ సరఫరా అయ్యేలా ఏర్పాటు చేసిన డ్రమ్‌లో పంట అవశేషాలను కాల్చినప్పుడు, కట్టె బరువులో దాదాపు 25 నుంచి 30 శాతం బరువైన బయోచార్ తయారవుతుంది.





పంటల కోత తర్వాత మిగిలే మోళ్లు, కట్టెను అర్థవంతంగా పునర్వినియోగించుకునే పద్ధతి ఇది



సాగుబడి

శతభిష కార్తె: 20 నుంచి

డ్రమ్‌తో బయోచార్ తయారీ ఇలా..

1. పంట కోసిన తరువాత మిగిలిన వ్యర్థాలను ఒక చోట పెట్టుకోవాలి. తరువాత వాడిన ఒక ఇనుప డ్రమ్‌ను బయోచార్ తయారీ కోసం తీసుకోవాలి. చిత్రంలో ఉన్న మాదిరిగా వాడిన ఇనుప డ్రమ్ తీసుకొని దాని కింద భాగంలో వృత్తాకారంలో రంధ్రాలు చేసుకోవాలి. డ్రమ్ పై భాగంలోని మూతను అవసరమైనప్పుడు తీసి, పెట్టుకునే విధంగా వృత్తాకారంలో కత్తిరించుకోవాలి. డ్రమ్‌పై భాగంలో మూత బలంగా కూర్చోవడం కోసం నాలుగు ఇనుప కడ్డీలను బొమ్మలో చూపిన విధంగా వెల్డింగ్ ద్వారా అతికించుకోవాలి. 2. ఇలా సిద్ధం చేసుకున్న డ్రమ్‌లో బాగా ఎండిన పంట అవశేషాలను, 8 నుంచి 10 అంగుళాల (20 – 25 సెంటీమీటర్ల) పొడువుగా కత్తిరించి, డ్రమ్ కింది నుంచి పై వరకు ఖాళీ లేకుండా నింపాలి. 3. తరువాత, డ్రమ్ పై భాగంలోని నాలుగు ఇనుప కడ్డీల మీద మూత పెట్టి, లోపలికి ఎక్కువగా గాలి వెళ్ళకుండా, దానిపై బంక మట్టి పూయాలి. 4. ఈ విధంగా కాల్చడానికి సిద్ధం చేసిన డ్రమ్‌ను పొయ్యి మీద పెట్టాలి. అనంతరం పంట అవశేషాలతోనే పొయ్యి వెలిగించాలి. ఇలా వెలిగించిన పొయ్యి ద్వారా డ్రమ్‌లో ఉన్న పంట అవశేషాలను ఒకటి, రెండు బెజ్జాల ద్వారా ఆక్సిజన్ పరిమితంగా అందేలా చూస్తూ నిదానంగా కాల్చాలి. డ్రమ్ పై భాగంలోని బంక మట్టిలో నీలం రంగు వాయువు బయటికి వచ్చేంత వరకు 20 నుండి 25 నిమిషాల పాటు పొయ్యిని వెలిగించాలి. ఈ క్రమంలో డ్రమ్ ఉష్ణోగ్రత 300 నుండి 400 డిగ్రీ సెల్షియస్ వరకు ఉంటుంది. ఈ దశలో పొయ్యిలో మంట ఆర్పేసి, డ్రమ్‌ను పొయ్యి మీద నుంచి దింపి పక్కనే ఉన్న చదునైన నేల మీద పెట్టాలి. 5. డ్రమ్ చుట్టూ ఉన్న కింద భాగానికి డ్రమ్‌లో ఉష్ణోగ్రతలు బయటికి వెళ్ళకుండా బంక మట్టిని మెత్తాలి. ఈ దశలో తక్కువ ఆక్సిజన్ సరఫరా ఉన్న డ్రమ్ లోని పంట అవశేషాలు 'డైరెక్ట్ అప్ డ్రాఫ్ట్' సూత్రం ప్రకారం బయోచార్ తయారవుతుంది. డ్రమ్‌ను దాదాపు 2 గంటల సేపు అలాగే వదిలేసి నెమ్మదిగా చల్లబరచాలి. 5. చల్లబడిన తర్వాత డ్రమ్ పై మూత తీసి, పూర్తిగా తయారైన బయోచార్‌ను బయటికి తీసుకోవాలి. కట్టెకు బాగా ఆక్సిజన్ తగిలితే పూర్తిగా కాలిపోయి బూడిద అవుతుంది. తగుమాత్రంగా ఆక్సిజన్ అందకపోతే పెద్దగా కాలకుండా మిగిలిపోతుంది. ఈ రెంటికి మధ్యస్థంగా ఉండేదే బయోచార్. ఈ నల్ల బంగారాన్ని పొడిగా చేసి పెట్టుకోవాలి. 6. బయోచార్‌ను పంట విత్తుకునే ముందు చివరి దుక్కిలో చల్లుకోవాలి.

బయోచార్ వాడితే తొలి ఏడాదే 15-20% పెరిగిన దిగుబడి



అనంతపురం వ్యవసాయ పరిశోధనా స్థానంలోని భూముల్లో బయోచార్ వాడటం వల్ల మొదటి పంటలోనే మంచి ఫలితం కనిపించింది. వర్షాధార వేరుశనగలో 15-20%, నీటిపారుదల కింద వేరుశనగలో 20% దిగుబడి పెరిగింది. బయోచార్‌ను రెండేళ్లుగా నాలుగు పంట కాలాల్లో వేసినందున మట్టికి నీటిని పట్టి ఉండే శక్తి పెరిగింది. ఏటా హెక్టారుకు 7 టన్నుల పైమట్టి కొట్టుకుపోతూ ఉంటుంది. బయోచార్ వల్ల ఇది 99% తగ్గింది. పోషకాలు కొట్టుకుపోవటం 90% తగ్గింది. ముఖ్యంగా, మట్టిలో సేంద్రియ కర్బనం 0.2% నుంచి 0.4%కు పెరటం విశేషమని డాక్టర్ నటరాజ 'సాక్షి సాగుబడి'కి తెలిపారు.

నిర్వహణ: పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్

ఎకరానికి ఎంత వేయాలి?

బయోచార్‌కు ఇంతవరకు ఒక నిర్దిష్టమైన మోతాదు అనేది లేదు. పంట అవశేషాల పరిమాణం ఒక్కో పంటకు ఒక్కో విధంగా ఉంటుంది. అందువల్ల, ఆ పొలంలో ఏ పంట సాగు చేశామో ఆ పంట కోసిన తర్వాత మిగిలిన కట్టె వంటి వ్యర్థాలతో డ్రమ్ పద్ధతిలో బయోచార్‌ను తయారు చేసుకొని, ఎంత బయోచార్ వస్తే అంత బయోచార్‌ను ఆఖరి దుక్కిలో భూమిలో కలిపివేసుకోవచ్చు.మరోవిధంగా చెప్పాలంటే... ఎర్ర నేలలో ఎక్కువ మొత్తంలో నల్ల నేలలో తక్కువ మొత్తంలో బయోచార్ వేసుకోవచ్చు. ఎర్ర నేలలో ఎకరాకు 1 నుంచి 1.5 టన్ను బయోచార్ ను ఆఖరి దుక్కిలో వేసుకొని కలియదున్నాలి. అదే, నల్లరేగడి నేలలో ఎకరానికి 0.5 నుండి 1 టన్ను దుక్కిలో కలపడం ఉత్తమం. ఇలా, ప్రతి సంవత్సరం రైతు తన పొలం లోనే, పంట కోసిన తర్వాత మిగిలిన వ్యర్థాలతో తక్కువ ఖర్చుతో బయోచార్ తయారు చేసి భూమిలో వేసుకోవచ్చు. ఇలా వ్యవసాయ వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగిస్తూ, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

(బయోచార్‌పై సందేహాలుంటే సంప్రదించాల్సిన నంబర్లు: డా. నటరాజ: 76598 04499 డా. సహదేవరెడ్డి: 99896 25222)

దేశీ విత్తన పరిరక్షణకు వర్కింగ్ గ్రూప్

వేలాది ఏళ్ల నుంచి మన వ్యవసాయక సమాజం కృషి ఫలితమైన సుసంపన్న దేశీ విత్తన సంపదను ఏటేటా సాగు చేస్తూ నిలబెట్టుకోవటం ఒక్కటే ఆ అపురూప వంగడాలను పరిరక్షించుకోవడానికి మన ముందున్న ఉత్తమ మార్గం. దేశీయ వ్యవసాయ జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించటం ద్వారా అన్ని రకాల పంటలకు సంబంధించి సంప్రదాయ వంగడాల సాగును పునరుద్ధరించే లక్ష్యంతో స్వచ్ఛంద సంస్థలు దేశవ్యాప్త కార్యాచరణకు కంకణం కట్టుకున్నాయి. రీవైటలైజింగ్ రెయిన్‌ఫెడ్ అగ్రికల్చర్ (ఆర్.ఆర్.ఎ.) నెట్‌వర్క్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా దేశీ వంగడాలను గుర్తించి, సేకరించి, ఎంపికచేసి, విత్తనోత్పత్తి చేపట్టి, విత్తన మార్పిడి/అమ్మకం ద్వారా ఆ అపురూప వంగడాలను రైతులకు, ఉత్పత్తులను వినియోగదారులకు తిరిగి విస్తృతంగా అందుబాటులోకి తేవడానికి ప్రత్యేక వర్కింగ్ గ్రూప్ ఏర్పాటైంది. ఈ మహా ప్రయత్నంలో భాగస్వాములు కావాలన్న ఆసక్తి గల రైతులు, వ్యక్తులు, సంస్థలు ఈ త్వరలో జరిగే 3 రోజుల కార్యశాలలో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ కార్యాచరణ ప్రణాళికపై మరింత అవగాహన కల్పించడానికి ఈ నెల 21న ఉ.11 గంటలకు ఆర్.ఆర్.ఎ. నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జూమ్ సమావేశం జరగనుంది. రిజిస్ట్రేషన్ ఇతర వివరాలకు.. 82007 14831, 82470 08755. seeds@rainfedindia.org

సేంద్రియ పంటల విలువ జోడింపుపై శిక్షణ

గుంటూరు జిల్లా కొర్నెపాడులో మార్చి 1,2,3 తేదీల్లో అన్ని రకాల పంటల సేంద్రియ సాగులో మెళకువలు, పంట దిగుబడులతో రైతు స్థాయిలోనే విలువ జోడింపు ద్వారా అధికాదాయం పొందే పద్ధతులపై శిక్షణ ఇవ్వనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు తెలిపారు. ఆసక్తి గల రైతులు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవడానికి సంప్రదించాల్సిన నంబర్లు.. 97053 83666, 95538 25532.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 330
మంగళవారం 20-2-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'


సరికొత్త శిఖరంపై నిఫ్టీ
ఐదో రోజూ లాభాల పరుగు.. సెన్సెక్స్ లాభం 282 పాయింట్లు -11లో


బుమ్రాకు విశ్రాంతి!
నాలుగో టెస్టుకు భారత పేసర్ దూరం.. పూర్తి ఫిట్‌గా కేఎల్ రాహుల్ -10లో


గ్రహశకలాలపై నీటి జాడలు
అంతరిక్ష పరిశోధన చరిత్రలోనే తొలిసారిగా గ్రహశకలాలపై నీటి అణువుల జాడలను శాస్త్రవేత్తలు గుర్తించారు.
- వివరాలు 6లో


రైతులకు అండగా ప్రభుత్వం
వ్యవసాయ రంగాన్ని నూతన మార్గంలోకి తీసుకెళ్లడానికి తమ ప్రభుత్వం రైతన్నలకు తోడ్పాటునందిస్తోందని ప్రధాని మోదీ చెప్పారు.
- వివరాలు 6లో


ప్రజల భాగస్వామ్యం లేనిదే..
పేద వర్గాలకు అన్యాయం జరుగుతున్నందు వల్లే దేశం పురోగతి సాధించట్లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు.
- వివరాలు 6లో


'ఎక్స్' మార్కు ఎందుకు వేశారు?
చండీగఢ్ మేయర్ ఎన్నికలో బ్యాలెట్ పత్రాలను పాడుచేశారన్న ఆరోపణల కేసులో రిటర్నింగ్ అధికారిపై సుప్రీం మండిపడింది.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

యూనిఫామ్ సర్వీసులకు వయోపరిమితి పెంపు



డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా వివిధ యూనిఫామ్ సర్వీసులకు గరిష్ట వయోపరిమితిని మరో రెండేళ్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని యూనిఫామ్ సర్వీసులకు సంబంధించి రాబోయే రిక్రూట్‌మెంట్లకు ఇది వర్తించనుంది.

- వివరాలు 2లో

రెన్యూ సిస్ పెట్టుబడులు రూ. 6 వేల కోట్లు



సోలార్ ఫొటో వోల్టాయిక్ మాడ్యూల్, ఫొటో వోల్టాయిక్ సెల్స్ తయారీలో అంతర్జాతీయంగా పేరొందిన దిగ్గజ సంస్థ 'రెన్యూసిస్' తెలంగాణలో రూ. 6 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు సోమవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

- వివరాలు 2లో

కోడ్ కూయక ముందే.. మోదీ టూరు!



పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగానే ఈ నెలాఖరులోగా లేదా మార్చి తొలి వారంలోగా 2–3 పర్యాయాలు మోదీ రాష్ట్రానికి వస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

- వివరాలు 3లో

'నిజాం షుగర్స్'పై సర్కార్ మల్లగుల్లాలు

- 23న నిజాం షుగర్స్‌కు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఫ్యాక్టరీ నడపలేమన్న ప్రైవేటు భాగస్వామి
- స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశం

2 లో

ఇదండీ సంగతి



గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్

563 ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రకటన


2022 ఏప్రిల్ 26న జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నిర్ణయం తీసుకున్నామన్న టీఎస్‌పీఎస్సీ

తాజా నోటిఫికేషన్ మేరకు ఈ ఏడాది మే లేదా జూన్ నెలలో మళ్లీ ప్రిలిమ్స్

సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మెయిన్స్

- పాత అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టీకరణ
- ఫీజు మాత్రం చెల్లించాల్సిన అవసరం లేదని వెల్లడి
- మహిళలకు హారిజాంటల్ పద్ధతిలో రిజర్వేషన్ల అమలు
- ఈనెల 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 563 గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) సోమవారం సాయంత్రం కొత్తగా నోటిఫికేషన్ జారీ చేసింది. 503 గ్రూప్–1 ఉద్యోగ నియామకాల కోసం 2022 ఏప్రిల్ 26న జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. తాజా నోటిఫికేషన్ మేరకు 18 శాఖల్లో 563 పోస్టులకు సంబంధించిన ప్రిలిమ్స్ రాత పరీక్ష కోసం ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కమిషన్ వెల్లడించింది. మార్చి 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. వాటిల్లో పొరపాట్లు సవరించుకునేందుకు మార్చి 23వ తేదీనుంచి 27వ తేదీ సాయంత్రం 5 వరకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారు. ప్రిలిమినరీ పరీక్షను ఈ ఏడాది మే లేదా జూన్ నెలలో నిర్వహించనున్నట్లు కమిషన్ తెలిపింది. మెయిన్ పరీక్షలను ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో నిర్వహించనున్నట్లు వివరించింది. పరీక్షలకు వారం రోజుల ముందు నుంచి పరీక్ష సమయం కంటే 4 గంటల ముందు వరకు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వివిధ కారణాలతో 2022లో విడుదల చేసిన గ్రూప్–1 నోటిఫికేషన్ రద్దు చేయగా... అప్పుడు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కూడా మళ్లీ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని, ఫీజు మాత్రం చెల్లించక్కర్లేదని టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది. ప్రిలిమినరీ పరీక్షను ఓఎంఆర్ (ఆప్టికల్ మార్కింగ్) లేదా సీబీఆర్‌టీ (కంప్యూటర్ బేస్డ్) పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపింది. పోస్టుల వారీగా అర్హతలు, పరీక్షల నిర్వహణ, మార్కులు, సిలబస్ తదితర పూర్తిస్థాయి వివరాలతో కూడిన నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

ప్రిలిమ్స్ మూడోసారి..!

రికార్డు స్థాయిలో గ్రూప్-1 ఉద్యోగ ఖాళీలు ఉండడంతో గతంలో నిరుద్యోగులు ఎన్నో ఆశలతో దరఖాస్తు చేసుకున్నారు. కానీ కఠోర దీక్షతో అభ్యర్థులు పడిన శ్రమ వృథా ప్రయాసే అయ్యిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నోటిఫికేషన్ వెలువడి దాదాపు రెండు సంవత్సరాలు కాగా.. అభ్యర్థులు ఇప్పటికే రెండుసార్లు ప్రిలిమినరీ పరీక్షలు రాయడం గమనార్హం. కాగా కొత్త నోటిఫికేషన్ జారీతో మూడోసారి ప్రిలిమ్స్ రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన పోస్టుల సంఖ్య

మహిళలకు హారిజాంటల్ (సమాంతర) పద్ధతి (ప్రత్యేకంగా ఎలాంటి రోస్టర్ పాయింట్ మార్కింగ్ లేకుండా)లో రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ నేపథ్యంలో మహిళలకు కేటగిరీల వారీగా పోస్టులను ప్రత్యేకంగా రిజర్వ్ చేయలేదు. కానీ మొత్తంగా 33 1/3 (33.3) శాతం ఉద్యోగాలను మాత్రం కేటాయించనుంది. ఈ క్రమంలో మల్టీజోన్ల వారీగా పోస్టులు, అదేవిధంగా

మిగతా 2వ పేజీలో ▶

హస్తినలో సీఎం రేవంత్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు కూడా..

సూర్జేవాలా కుమారుడి వివాహానికి హాజరు

నేడు కేంద్ర ఆర్థిక మంత్రి, నిర్మలా సీతారామన్‌తో భేటీ

మరో కేంద్రమంత్రి గడ్కరీ, పార్టీ నేతలనూ కలిసే చాన్స్

- లోక్‌సభ అభ్యర్థులు, నామినేటెడ్ పోస్టుల భర్తీపై నేడు అధిష్టానంతో భేటీ! కేబినెట్ విస్తరణపై కూడా చర్చ జరగొచ్చన్న వాదన
- హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఎన్నికల కోడ్‌లోపే కొత్త మంత్రుల ప్రమాణం!
- లేదంటే పార్లమెంటు ఎన్నికల తర్వాతే..
- రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో చర్చ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలు ఢిల్లీ వెళ్లారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం సాయంత్రం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హస్తిన చేరుకున్నారు. రేవంత్ తదితరులు ఏఐసీసీ కీలక నేత రణ్‌దీప్ సూర్జేవాలా కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కాగా, సీఎం మంగళవారం పార్టీ పెద్దలను కలిసే అవకాశమున్నట్టు టీపీసీసీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి వేణుగోపాల్ సహా వీలును బట్టి మరికొందరు పెద్దలతో వీరు సమావేశమవుతారని తెలుస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌ను కూడా కలిసి రాష్ట్రానికి

మిగతా 2వ పేజీలో ▶



మూసీ ప్రక్షాళనకు వడివడిగా అడుగులు

- నది పరీవాహక అభివృద్ధిపై సీఎం సమీక్ష
- త్వరగా పనులు చేపట్టాలన్న రేవంత్
- మొదటగా క్లీనింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం

2 లో

22న ఢిల్లీకి కేసీఆర్?



బీజేపీతో పొత్తు వార్తల నేపథ్యంలో దేశ రాజధాని పర్యటనపై ఆసక్తి

- లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో బీఆర్‌ఎస్ అధినేత బిజీబిజీ
- విపక్షాల అభ్యర్థులు ఖరారైన తర్వాతే పార్టీ జాబితా విడుదల చేయాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల 22న ఢిల్లీ పర్యటనకు వెళ్లే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా ఢిల్లీ పర్యటనకు వెళ్తున్న కేసీఆర్ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూలుపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో నెలకొన్న పరిస్థితులు, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్‌ఎస్ పొత్తు కుదుర్చుకుంటుందనే వార్తల నేపథ్యంలో కేసీఆర్ టూర్‌కు ప్రాధాన్యత ఏర్పడింది.

పొత్తు లేదని ఇరు పార్టీలూ చెబుతున్నా..

లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుకు అవకాశం లేదని అటు బీజేపీ, ఇటు బీఆర్‌ఎస్ పార్టీల నేతలు తెగేసి చెప్తున్నా.. ఆ వాదనలు, వార్తలు వస్తూనే ఉన్నాయి. కాగా కేసీఆర్ ఢిల్లీ పర్యటనలో పార్టీ ఎంపీలతో పాటు కొందరు కీలక నేతలు కూడా ఉంటారని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. అసెంబ్లీ ఎన్నికల తరహాలో కాకుండా లోక్‌సభ షెడ్యూలు విడుదల తర్వాతే పార్టీ అభ్యర్థులను ఖరారు చేసే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో ముందస్తుగా అభ్యర్థులను ప్రకటించడంతో జరిగిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని విపక్ష పార్టీల అభ్యర్థులు ఖరారైన తర్వాతే బీఆర్‌ఎస్ అభ్యర్థులతో కూడిన జాబితాను విడుదల చేయాలని

మిగతా 2వ పేజీలో ▶

మాది ఒంటరి పోరే

బీఆర్‌ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు: కిషన్‌రెడ్డి

బీఆర్‌ఎస్– బీజేపీ పొత్తు అని ఎవరైనా అంటే చెంపలు వాయించండి

నేటి నుంచి బీజేపీ విజయసంకల్పయాత్రలు

షెడ్యూల్ విడుదల చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు


చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జి.కిషన్‌రెడ్డి, ఈటల, కె.వి. రమణారెడ్డి

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు ప్రసక్తే ఉత్పన్నం కాదని, బీజేపీ ఒంటరిగానే పోటీచేస్తుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి తేల్చిచెప్పారు. తెలంగాణలోని 17 ఎంపీ సీట్లకు పోటీచేసి మెజారిటీ స్థానాల్లో గెలవాలనే లక్ష్యంతో ముందుకెళుతున్న బీజేపీ మునిగిపోయే నావ వంటి బీఆర్‌ఎస్‌తో కలిసే పరిస్థితి రాదని స్పష్టం చేశారు. గతంలో కూడా తామెప్పుడూ ఆ పార్టీతో పొత్తు పెట్టుకోలేదని గుర్తుచేశారు. ఈ ప్రచారాన్ని కొందరు దుర్మార్గులు పనిగట్టుకుని కుట్రపూరితంగా చేస్తున్నారని, మెడకాయ మీద తలకాయ లేనివాళ్లు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు విశ్వసించొద్దని ఆయన కోరారు. బీఆర్‌ఎస్–బీజేపీ మధ్య పొత్తు ఉందని ఎవరైనా మాట్లాడితే వారి రెండు చెంపలు గట్టిగా వాయించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ నెల 20 (మంగళవారం) నుంచి రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్ల పరిధిలో మొత్తం 5,500 కి.మీ మేర పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న 'విజయసంకల్పయాత్ర' పోస్టర్‌ను, యాత్ర షెడ్యూల్‌ను కిషన్‌రెడ్డి సోమవారం పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. అదేవిధంగా యాత్ర పాటను, స్టిక్కర్లు, కరపత్రాలను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు తొలి సమావేశంలోనే తెలంగాణ ఎంపీ అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

నోటిఫికేషన్ వచ్చేలోగానే యాత్రలు పూర్తి...

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోగానే ఈ యాత్రలను పూర్తిచేస్తామని తెలిపారు. 20వ తేదీ నుంచి నాలుగుయాత్రలు సమాంతరంగా

మిగతా 3వ పేజీలో ▶

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య రహస్య ఒప్పందం

- బీజేపీ సీనియర్ నేత డా.కె.లక్ష్మణ్ ఆరోపణ
- బీఆర్‌ఎస్ అవినీతిపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని నిలదీత

3 లో

అదే ప్రతిష్టంభన

ఐదేళ్లు కనీస మద్దతు ధర

కేంద్రం ప్రతిపాదన, రైతు సంఘాల తిరస్కరణ

పప్పు ధాన్యాలు, పత్తి, మొక్కజొన్నకు ఎంఎస్పీ

ఎంతైనా కొంటామన్న మంత్రులు, తిరస్కరించిన నేతలు

రేపటి నుంచి 'ఢిల్లీ చలో' కొనసాగుతుందని ప్రకటన


కేంద్రంతో చర్చల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న రైతు సంఘాల నేతలు

త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతులతో చర్చలు కొనసాగుతాయి. కనీస మద్దతు ధరపై భాగస్వామ్యపక్షాలతో చర్చలు జరపకుండా ఇప్పటికిప్పుడు చట్టం తీసుకురావడం సాధ్యం కాదు.
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

వివరాలు 6లో


ఈ ఇళ్లనే అధికారులు పట్టా చేశారు

'పట్టా'లు తప్పారు!

రెవెన్యూ అధికారుల కళ్లకు కనిపించని ఇళ్లు, సమాధులు, వ్యవసాయబావి..

కబ్జాలో ఒకరు.. పట్టాలో మరొకరు

న్యాయం చేయాలంటున్న బాధితులు

హుస్నాబాద్ రూరల్: తాతలు, తండ్రులు కట్టిన ఇళ్లు 12...చనిపోయిన వారి సమాధులు 18... ఒక వ్యవసాయ బావి, మిషన్ భగీరథ ద్వారా మంచినీరు సరఫరా చేసే పైప్‌లైన్. ఇవన్నీ కాకుండా 1984 నుంచి ఆ భూముల్లో కబ్జాలోనే ఉంటూ సాగు కూడా చేసుకుంటున్నారు. అయితే రెవెన్యూ అధికారులకు ఇవేమీ కనిపించలేదు. మోక (పొజిషన్) విచారణ జరపలేదు. కబ్జాలో ఎవరు ఉన్నారో తెలుసుకోలేదు. ధరణిలో కబ్జా కాలమ్ తొలగించడంతో పాత పట్టాదారుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి. దీనిని పసిగట్టిన కొందరు స్థానిక రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకొని, సాదాబైనామాలు సృష్టించి 2021లో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం


మిగతా 3వ పేజీలో ▶

టర్నింగులున్నాయి.. డ్రైవింగ్ జాగ్రత్త

రేపటి నుంచి మేడారానికి పోటెత్తనున్న భక్తజనం.. వరుస కట్టనున్న వాహనాలు

దారంతా మూలమలుపులు.. జాగ్రత్తలు పాటిస్తేనే సాఫీగా జాతరకు ప్రయాణం

మేడారానికి వెళ్లే రూట్ మ్యాప్ ఇలా..



వివరాలు 12లో

మేడారం మహాజాతర అంటే.. కోట్లాదిగా తరలివచ్చే భక్తజన ప్రవాహం.. తెలంగాణ పల్లెలన్నీ ఇప్పటికే సమ్మక్క–సారలమ్మ దర్శనానికి బారులుదీరాయి. ఏపీతోపాటు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు మేడారం మహాజాతర జరగనుంది. పల్లెలు, పట్టణాలు, నగరాల నుంచి మేడారం వైపు వాహనాలు పోటెత్తనున్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాల నుంచి ఇప్పటికే రోడ్లన్నీ వాహనాలతో కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశముంది. మూల ములుపులు, ఇరుకు వంతెనలు, కల్వర్టులు, గుంతలు పడిన రహదారుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి. మేడారం మహాజాతర వేళ ప్రయాణం సాఫీగా సాగాలి.

▼ సోమవారం సిరిసిల్లలో బస్సెక్కేందుకు ప్రయాణికుల అవస్థలు



ఖర్చులు వెల్లడిస్తాం

- గత ప్రభుత్వం 3 వేల బస్సులు నడిపితే.. మా ప్రభుత్వం 6 వేల బస్సులు నడుపుతోంది
- మేడారం వనదేవతల దర్శనం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క వెల్లడి

12 లో

ఆర్టీసీ బస్సులు హౌస్‌ఫుల్!

- మేడారం జాతరకు 4,479 బస్సుల కేటాయింపు
- ఇప్పటికే కొన్ని బస్సులు నిర్దిష్ట ప్రాంతాలకు తరలింపు.. సోమవారం బస్‌స్టేషన్లు, బస్సులు కిటకిట

12 లో

క్లుప్తంగా...

బ్రహ్మోత్సవాలకు రండి



శ్రీరామానుజాచార్య, 108 దివ్య దేశాల ద్వితీయ బ్రహ్మోత్సవాలకు శంషాబాద్ ప్రాంతంలోని శ్రీరామనగరం ముస్తాబైంది. మంగళవారం నుంచి మార్చి ఒకటో తేదీ వరకు జరగనున్న సమతాకుంభ్–2024 ఉత్సవాలకు రావాలంటూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. – శంషాబాద్‌రూరల్

పత్తి కొనుగోళ్లను కొనసాగించాలి

సీసీఐ సీఎండీని కోరిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్‌: రైతులకు ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో నిల్వ ఉన్న పత్తి కొనుగోళ్లు చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాటన్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా(సీసీఐ)ని కోరారు. పత్తి కొనుగోళ్ల నుంచి నుంచి సీసీఐ తప్పుకుంటే మార్కెట్‌లో ధరలు తగ్గే ప్రమాదం ఉందని, రైతులు తీవ్రంగా నష్టపోతారని తుమ్మల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీసీఐ సీఎండీని సోమ వారం ఓ ప్రకటనలో కోరారు. సీసీ ఐ, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఇప్పటివరకు 285 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 5.36 లక్షల రైతులకు రూ. 8,569.13 కోట్లతో 12.31 లక్షల మెట్రిక్‌ టన్నులు, ప్రైవేట్‌ ట్రేడర్స్‌ ద్వారా 4.97 లక్షల మెట్రిక్‌ టన్నుల పత్తిని సేకరించామని వివరించారు. ఇంకా కొన్ని జిల్లాల్లో పత్తి మూడోసారి ఏరివేత దశలో ఉండగా, ఇప్పటికే తీసిన పత్తి దాదాపు లక్షల క్వింటాళ్ల వరకు నిల్వ ఉంటుందని తుమ్మల తెలిపారు.

కోరం లేకున్నా గ్రామసభ తీర్మానం

జీవోపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్‌: షెడ్యూల్డ్‌ ఏరియాల్లో కోరం లేకున్నా గ్రామ సభ నిర్వహించి...తీర్మానాలు చేసేలా జీవో తెచ్చారన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, కమిషనర్, గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్‌తో పాటు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ, ఆలోగా కౌంటర్‌ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. కోరం లేకున్నా గ్రామసభ నిర్వహించి తీర్మానం పొందేలా 2019లో ప్రభుత్వం జీవో నంబర్‌ 54ను తీసుకొచ్చిందని..ఇది షెడ్యూల్డ్‌ ప్రాంతాల్లో తమ హక్కులను హరించి వేస్తుందని లంబాడి హక్కుల పోరాట సమితి నగర భేరీ ప్రధాన కార్యదర్శి భూక్యా దేవ నాయక్‌ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ అలోక్‌ అరాధే, జస్టిస్‌ అనిల్‌కుమార్‌ జూకంటి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

బీసీ, ఎస్టీలకు డిప్యూటీ సీఎంగా అవకాశం కల్పించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి దాసు సురేశ్‌ లేఖ



సాక్షి, హైదరాబాద్‌: త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో బీసీ, ఎస్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవులను కేటాయించాలని, త్వరలో జరగబోయే పార్లమెంట్‌ ఎన్నికల్లో 10 స్థానాలు ఇవ్వాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్‌ కోరారు. ఈ మేరకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. 58 ఏళ్ల ఉమ్మడి రాష్ట్రం, పదేళ్ల తెలంగాణ పాలనలో బీసీ, ఎస్టీలకు పదవి చేపట్టే అవకాశంరాలేదని పేర్కొన్నారు.

22న ఢిల్లీకి కేసీఆర్‌?

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్‌ భావిస్తున్నారు.

త్వరలో కీలక నేతలతో భేటీ..

విదేశీ పర్యటనలో ఉన్న బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీ రామారావు బుధవారం తిరిగి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు మరో వారం పది రోజుల్లో వెలువడుతుందనే ఊహాగానాల నేపథ్యంలో కేసీఆర్‌ ఢిల్లీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతను మరింత వేగవంతం చేసే అవకాశముంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్లమెంటు, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా బీఆర్‌ఎస్‌ పార్టీ సమీక్ష, సన్నద్ధత సమావేశాలను నిర్వహించింది. ఈ సమావేశాల్లో వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ ఆధారంగా ఎన్నికలకు సంబంధించి తదుపరి కార్యాచరణపై పార్టీ నేతలకు కేసీఆర్‌ దిశానిర్దేశం చేస్తారు. ఈ మేరకు త్వరలో తెలంగాణ భవన్‌లో పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్‌ సమావేశమవుతారు.

మూసీ ప్రక్షాళనకు వేగంగా అడుగులు

నదీపరీవాహక అభివృద్ధిపై సీఎం సమీక్ష
- వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ఆదేశించిన రేవంత్‌రెడ్డి
- మొదటగా క్లీనింగ్‌ ప్రక్రియ పూర్తి చేయాలని సూచన



మూసీ ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌కు వివరిస్తున్న ఆమ్రపాలి. చిత్రంలో దాన కిశోర్‌ తదితరులు

సాక్షి, హైదరాబాద్‌: మూసీనది ప్రక్షాళన, అభివృద్ధి ప్రాజెక్టుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. సోమవారం నానక్‌రాంగూడలోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ ప్రాజెక్టుపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూసీ అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. హెచ్‌ఎండీఏ కమిషనర్‌ దానకిశోర్, మూసీ రివర్‌ఫ్రంట్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ ఎండీ, హెచ్‌ఎండీఏ జాయింట్‌ కమిషనర్‌ ఆమ్రపాలి, హైదరాబాద్‌ మెట్రో రైల్‌ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు నగరంలోని 55 కిలోమీటర్ల మార్గంలో ఉన్న మూసీనదీ పరీవాహక ప్రాంతాలు సరిహద్దులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించారు. ప్రక్షాళనకు చేపట్టాల్సిన చర్యలపైనా చర్చించారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా తొలగించాల్సిన నిర్మాణాలపైన కూడా ఈ సందర్భంగా చర్చించినట్టు తెలిసింది. అనంతరం సీఎం మాట్లాడుతూ వీలైనంత త్వరగా మూసీ అభివృద్ధి ప్రాజెక్టు ప్రారంభించేందుకు కసరత్తు చేపట్టాలని అధికారులకు చెప్పారు. మొదట క్లీనింగ్‌ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. మూసీ అభివృద్ధికి ఇటీవల బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుతం ఆ పనులపై దృష్టి సారించింది. మూసీ నదిని మూడు ప్రధాన విభాగాలుగా విభజించి పనులు చేపట్టేందుకు అధికారులు ఇప్పటికే కార్యాచరణ చేపట్టారు.

అందంగా.. ఆహ్లాదంగా...

హైదరాబాద్‌ మహానగరానికి పడమటి నుంచి తూర్పు వరకు మెలికలు తిరుగుతూ వడ్డాణం అలంకరించినట్టుండే మూసీనది నిజాం కాలంలో పరవళ్లు తొక్కింది. నగరంలో 55 కిలోమీటర్ల పొడవుతో విస్తరించి ఉన్న మూసీనదికి పూర్వవైభవాన్ని తెచ్చేందుకు గతంలోనే మూసీ రివర్‌ఫ్రంట్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ ఏర్పాటు చేసినా పెద్దగా పురోగతి లేదు. ప్రసుత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించడంతో మళ్లీ ఆశలు చిగురించాయి. మూసీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తూర్పు–పడమర మధ్య మెట్రో మార్గం నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు లండన్‌లోని థేమ్స్‌ నదిలా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మూసీ అభివృద్ధికి ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థలు సైతం ముందుకొస్తున్నాయి. సింగపూర్‌కు చెందిన ఓ సంస్థ ప్రభుత్వంతో ఇటీవల సంప్రదింపులు జరిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మూసీకి రెండు వైపులా ఎమ్యూస్‌మెంట్‌ పార్కులు, వాటర్‌ ఫాల్స్, చిల్డ్రన్‌ వాటర్‌ స్పోర్ట్స్, స్ట్రీట్‌ వెండర్స్‌ బిజినెస్‌ ఏరియా, షాపింగ్‌ మాల్స్‌ ఇలా అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా అభివృద్ధి చేస్తారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లోని చారిత్రక కట్టడాలైన చార్మినార్, తారామతి బారదరీ, ఇతర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ఒక టూరిజం సర్క్యూట్‌ కూడా డిజైన్‌ చేస్తున్నారు. పీపీపీ పద్ధతిలో ఈ ప్రాజెక్టును ప్రైవేట్‌ సంస్థలకు అప్పగించనున్నారు.

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా మంజువాణి

ప్రస్తుత డైరెక్టర్‌ రాంచందర్‌ బదిలీ



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా డాక్టర్‌ జి.మంజువాణి నియమితులయ్యారు. ప్రస్తుతం డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్‌ ఎస్‌.రాంచందర్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం, ఆయన స్థానంలో మంజువాణిని నియమించింది. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌ సిన్హా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం మంజువాణి తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్‌ డైరెక్టర్‌గా కొనసాగుతారు. డాక్టర్‌ ఎస్‌.రాంచందర్‌ను తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ (టీఎల్‌ఎస్‌డీఏ) సీఈవోగా నియమించారు.

కాగ్‌ నివేదిక నేపథ్యంలో!

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెల పంపిణీలో జరిగిన కుంభకోణం కారణంగానే ఈ బదిలీలు జరిగాయనే చర్చ సాగుతోంది. గొర్రెల పంపిణీలో చాలా అవకతవకలు జరిగాయని, బైక్‌లపై కూడా గొర్రెలను తీసుకొచ్చారని ఇటీవల కాగ్‌ తన నివేదికలో వెల్లడించిన నేపథ్యంలో ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది.

గిరిజన బిడ్డ కావడమే నేరమా?: ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌

పశుసంవర్ధక శాఖలో జరిగిన బదిలీలపై రాష్ట్ర బహుజన సమాజ్‌పార్టీ అధ్యక్షుడు ఆర్‌.ఎస్‌. ప్రవీణ్‌కుమార్‌ స్పందించారు. నిజాయితీకి మారుపేరైన రాంచందర్‌ను ఆగమేఘాల మీద బదిలీ చేసి బలిపశువును చేశారని, ఆయన తెలంగాణ తండాలలో జన్మించిన గిరిజన బిడ్డ కావడమే నేరమా అని ఆయన ఎక్స్‌ వేదికగా ప్రశ్నించారు. 'గొర్రెల కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన మాజీ మంత్రులను, వారి ఓఎస్డీలను, అప్పటి డైరెక్టర్లను ముట్టుకునే దమ్ముందా మీకు? 'అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

పాతగుట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వస్తి వచనం పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి(పాతగుట్ట) ఆలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాలు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో విష్వక్సేన పూజ, స్వస్తివచనం, రక్షాబంధనం, పుణ్యాహవచనంతో ఉత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రధానాలయం, ఉప ఆలయాలు, తిరువీధిలోని కల్యాణ మండపం వద్ద పవిత్రమైన శుద్ధ జలంతో సంప్రోక్షణ చేశారు. సాయంత్రం అంకురార్పణ, మృత్సంగ్రహణం వేడుకను జరిపారు.

ఎమ్మెల్యే అడ్లూరికి త్రుటిలో తప్పిన ప్రమాదం

- ప్రభుత్వ విప్ ప్రయాణిస్తున్న కారు బోల్తా
- లారీని తప్పించే క్రమంలో ప్రమాదం
- స్వల్పగాయాలతో బయటపడిన వైనం
- ఇద్దరు గన్‌మెన్, డ్రైవర్‌కూ గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి: ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రయాణిస్తున్న కారు జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం అంబారిపేట వద్ద సోమవారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల ప్రాంతంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అడ్లూరి స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ వెళ్లిన ఆయన అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యంలో పాల్గొని రాత్రి 11గంటల ప్రాంతంలో తిరిగి ధర్మపురి బయల్దేరారు. కారులో ఆయనతోపాటు డ్రైవర్, ఇద్దరు గన్‌మెన్ ఉన్నారు. ఎండపల్లి మండలం అంబారిపేటకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో వీరి కారు పక్కనే ఉన్న చిన్న లోయలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. అప్పటికే కారు ఎయిర్‌బెలూన్ తెరుచుకోవడంతో లక్ష్మణ్‌కుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఎడమకాలు, భుజం, తలకు చిన్న చిన్న గాయాలయ్యాయి. గన్‌మెన్ సంతోష్, ప్రశాంత్, డ్రైవర్ సంతోష్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. నలుగురినీ వెంటనే ధర్మారంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు.. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న లక్ష్మణ్‌కుమార్‌ను ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. దేవుడి దయ, ప్రజల ఆశీర్వాదంతో స్వల్ప గాయాలతోనే తాను బయటపడ్డానని, తన కోసం ఎవరూ హైదరాబాద్‌కు రావద్దని ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కాగా, లారీ ఎల్‌ఈడీ లైట్ల ఫోకస్ కారణంగా కారు డ్రైవర్‌కు రోడ్డు సరిగ్గా కనిపించలేదని, లారీని తప్పించే క్రమంలో కారు లోయలోకి దూసుకెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రిమోట్ సెన్సింగ్‌తో

రైతు భరోసా!

రైతులకు పెట్టుబడి సాయంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రిమోట్ సెన్సింగ్ ఆధారంగా రాష్ట్రంలోని భూముల వివరాలు సేకరించడంతో పాటు రిమోట్ సెన్సింగ్ ఆధారంగానే 'రైతు భరోసా' కింద పెట్టుబడి సాయం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఆధ్వర్యంలో ఉపగ్రహ ఛాయాచిత్రాల ఆధారంగా సాగు, బీడు భూముల వివరాలను సేకరించనుంది. కొండలు, గుట్టలు, స్మశానాలు, రియల్ ఎస్టేట్ భూములు, రోడ్లు, చెరువులను గుర్తించనుంది అలా గుర్తించిన వాటిల్లో ఎంతమేరకు ప్రస్తుతం రైతుబంధు అందుతోందో నిర్ధారించనుంది. దీని ఆధారంగా అనర్హులను తొలగించి.. సాగయ్యే భూముల్లో అర్హులను ఖరారు చేసి రైతు భరోసా (రైతుబంధు) అమలు చేయనుంది. రిమోట్ సెన్సింగ్‌కు సంబంధించి ఢిల్లీలో సంబంధిత అధికారులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. రెండ్రోజులు అక్కడే ఉండి పథకం తీరు తెన్నులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశాలను వారికి వివరించారు.

గ్రూప్–1 కొత్త నోటిఫికేషన్

▶ మొదటి పేజీ తరువాయి

జనరల్ కేటగిరీతో పాటు కమ్యూనిటీ రిజర్వేషన్ల వారీగా ఉన్న పోస్టులను కమిషన్ వెల్లడించింది. తాజా నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య 60 పెరగడం గమనార్హం.

పరిస్థితులపై చర్చించి రద్దు నిర్ణయం

గ్రూప్–1 ఉద్యోగ నియామకాల విషయంలో నెలకొన్న పరిస్థితులపై టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూలంకషంగా చర్చించామని, 2022 ఏప్రిల్ 26న జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్ నికొలస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

అసలేం జరిగిందంటే..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా భారీ సంఖ్యలో గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి టీఎస్‌పీఎస్సీ 2022 ఏప్రిల్ 26న నోటిఫికేషన్ జారీ చేసింది. అవకతవకలకు తావు లేకుండా ఉద్యోగాల భర్తీ కోసం అప్పటి ప్రభుత్వం ఇంటర్వ్యూలను రద్దు చేసింది. 503 ఉద్యోగాల కోసం ఏకంగా 3,80,081 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2022 అక్టోబర్ 16న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలను నిర్వహించింది. అదే ఏడాది చివర్లో పెద్ద సంఖ్యలో అభ్యర్థులకు అవకాశం కల్పించే లక్ష్యంతో 1:50 నిష్పత్తిలో అర్హుల జాబితాను విడుదల చేసింది. 2023 ఏడాది ఆగస్టులో మెయిన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించడంతో అభ్యర్థులు కఠోర దీక్షతో సన్నద్ధతను ప్రారంభించారు. కానీ గతేడాది మార్చిలో పలు టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం వెలుగు చూసింది. గ్రూప్–1 ప్రశ్నపత్రాలు సైతం బయటకు వెళ్లాయని తేలడంతో ప్రిలిమినరీ పరీక్షను కమిషన్ రద్దు చేసింది. 2023 జూన్ 11న మరోమారు ప్రిలిమ్స్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అయితే రెండోసారి టీఎస్‌పీఎస్సీ ప్రిలిమ్స్ నిర్వహించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. పరీక్ష నిర్వహణలో లోపాలు జరిగాయని నిర్ధారిస్తూ హైకోర్టు పరీక్ష రద్దుకు ఆదేశించింది. దీనిపై టీఎస్‌పీఎస్సీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అ తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన చేపట్టడం, కొత్త కమిషన్‌ను ఏర్పాటు చేయడం, కొత్తగా మరో 60 గ్రూప్–1 ఖాళీలను గుర్తించడం లాంటి పరిణామాలు వరుసగా చోటు చేసుకున్నాయి. తాజాగా గ్రూప్–1 నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించడంతో గత కొంతకాలంగా నెలకొన్న గందరగోళానికి తెరపడింది. పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతించినట్లు కమిషన్ తెలిపింది. అయితే గత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ..ఏ కారణాలతో రద్దు చేసిందీ పూర్తిస్థాయిలో వివరించలేదు.

తాజా నోటిఫికేషన్‌లో పోస్టుల వివరాలు

పోస్టు కేటగిరీ	ఖాళీలు	వయోపరిమితి
డిప్యూటీ కలెక్టర్	45	18–46
డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కేటగిరీ-2)	115	21–35
కమర్షియల్ టాక్స్ ఆఫీసర్	48	18–46
రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్	04	21–46
డిస్ట్రిక్ట్ పంచాయత్ ఆఫీసర్	07	18–46
డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్	06	18–46
డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్(మెన్)	05	18–35
అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్	08	18–46
అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్	30	21–35
మున్సిపల్ కమిషనర్–గ్రేడ్–2	41	18–46
డిస్ట్రిక్ట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్	03	18–46
డిస్ట్రిక్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మరియు అసిస్టెంట్ డైరెక్టర్	05	18–46
డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్	02	18–46
డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్	05	18–46
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ట్రెజరర్ గ్రేడ్–2 (మెడికల్)	20	18–46
అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్/అసిస్టెంట్ లెక్చరర్	38	18–46
అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్	41	18–46
ఎంపీడీవో	140	18–46

రూ. 6 వేల కోట్ల పెట్టుబడి

రాష్ట్ర ప్రభుత్వంతో రెన్యూసిస్ సంస్థ ఒప్పందం



మంత్రి శ్రీధర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు అందజేస్తున్న రెన్యూసిస్ సంస్థ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్/మహేశ్వరం: సోలార్ ఫొటో వోల్టాయిక్ మాడ్యూల్, ఫొటో వోల్టాయిక్ సెల్స్ తయారీలో అంతర్జాతీయంగా పేరొందిన దిగ్గజ సంస్థ 'రెన్యూసిస్'తెలంగాణలో రూ.6 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వంతో రెన్యూసిస్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని ఫ్యాబ్‌సిటీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో రెన్యూసిస్‌తో జరిగిన ఒప్పందంపై పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ సంతకాలు చేశారు. ఇప్పటికే కర్ణాటక, మహారాష్ట్రలో తయారీ యూనిట్లు కలిగిన రెన్యూసిస్ తమ అతిపెద్ద తయారీ యూనిట్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు ముందుకు రావడంపై మంత్రి శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను తమ ప్రభుత్వం అందజేస్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా హైదరాబాద్ సోలార్ పరికరాల తయారీకి హబ్‌గా మారుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీని ప్రోత్సహిస్తుందన్నారు. సోలార్ పరికరాల ఉత్పత్తి రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తామని, అందుకు అనువుగా ఉండే సమగ్ర ఇంధన విధానాన్ని రూపొందిస్తున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు.

పరిశ్రమలకు ప్రోత్సాహం : రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని ఇస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని హార్డ్‌వేర్ పార్కు–2లో అపోలో మైక్రో సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ ఎలక్ట్రానిక్ పరికరాల కంపెనీ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడుల సేకరణకు అడుగులు వేస్తున్నామన్నారు. రాష్ట్రం ఏరో స్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారిందన్నారు. ఏరోస్పేస్ పరికరాల తయారీలో దేశంలోనే ముందు వరుసలో ఉన్నామని స్పష్టం చేశారు. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, అపోలో మైక్రో సిస్టమ్స్ కంపెనీ ఎండీ బద్దం కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో రెండేళ్ల వయోపరిమితి పెంపు

యూనిఫామ్ సర్వీసుల గరిష్ట వయోపరిమితిపై సర్కార్ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా వివిధ యూనిఫామ్ సర్వీసులకు గరిష్ట వయోపరిమితిని మరో రెండేళ్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని యూనిఫామ్ సర్వీసులకు సంబంధించి రాబోయే రిక్రూట్‌మెంట్లకు ఇది వర్తించనుంది. యూనిఫామ్ సర్వీసుల పరిధిలోకి వచ్చే వివిధ సర్వీసులు, కేటగిరీల పోస్టులు.. పోలీస్, అగ్నిమాపక, జైళ్లశాఖ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), ఎక్సైజ్, రవాణా, అటవీశాఖ ఉద్యోగాలకు ఐదేళ్ల గరిష్ట వయోపరిమితిని పెంచుతూ ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో నిరుద్యోగుల నుంచి పెద్దసంఖ్యలో ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందడంతో మరింత మంది నిరుద్యోగ యువతకు అర్హత కల్పించే ఉద్దేశంతో యూనిఫామ్ సర్వీసెస్‌కు కూడా గరిష్ట వయోపరిమితిని మరో రెండేళ్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లో ఈనెల 8న నోటిఫికేషన్‌ను పబ్లిష్ చేశారు. 8న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కూడా ఉత్తర్వులు జారీచేశారు. గతంలో జారీచేసిన ఉత్వర్వుల్లో యూనిఫామ్ సర్వీసులకు గరిష్ట వయోపరిమితిని పెంచకపోవడం గమనార్హం.

'నిజాం షుగర్స్'పై సర్కార్ మల్లగుల్లాలు

- 23న నిజాం షుగర్స్‌కు మంత్రి దుద్దిళ్ల
- ఫ్యాక్టరీ నడపలేమన్న ప్రైవేటు భాగస్వామి
- స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్ఎల్) పునరుద్ధరణ విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ ఫ్యాక్టరీ యూనిట్లను తిరిగి తెరిపించడంపై మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పటికే ఎన్‌డీఎస్ఎల్‌లో 51శాతం వాటా ఉన్న ప్రైవేటు భాగస్వామి.. తాము యూనిట్లను నడపలేమని తేల్చి చెప్పేసింది. మరోవైపు బ్యాంకర్లు కూడా తమకు రావాల్సిన రూ.370 కోట్ల మేర బకాయిల సంగతి తేల్చాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా ఏర్పాటైన కమిటీ ఈ నెల 4న తొలి సమావేశం నిర్వహించింది. ఈ భేటీలో ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోనప్పటికీ ఫ్యాక్టరీ స్థితిగతులపై పూర్తి నివేదిక ఇవ్వాల్సిందిగా శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. 1937లో నిజాం షుగర్స్ ఏర్పాటు మొదలుకుని, చంద్రబాబు హయాంలో ప్రైవేటు భాగస్వామికి 51శాతం వాటా అప్పగింత, ఆ తరువాత జరిగిన పరిణామాలపైనా నివేదిక ఇవ్వాలని ఆయన సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పాటైన హౌస్ కమిటీ తేల్చిన అంశాలను కూడా ఆ నివేదికలో పొందుపరచాలని ఆదేశించారు. 2015లో ఎన్‌డీఎస్ఎల్ పరిధిలోని 3 యూనిట్లతో పాటు డిస్టిలరీ కూడా మూతపడగా, అప్పటి నుంచి ఉత్పత్తి నిలిచిపోయింది.

23న మెట్‌పల్లికి శ్రీధర్‌బాబు..

ఎన్‌డీఎస్ఎల్‌లో అంతర్భాగమైన మెట్‌పల్లి యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ఈ నెల 23న సందర్శించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలుత ఈ నెల 20న బోధన్, మెట్‌పల్లి యూనిట్ల సందర్శనకు మంత్రి శ్రీధర్‌బాబు షెడ్యూలు ఖరారైనా చివరి నిమిషంలో వాయిదా పడింది. కాగా, ఈ నెలాఖరులోగా 'నిజాం షుగర్స్ పునరుద్ధరణ కమిటీ'రెండో సమావేశం జరిగే అవకాశముంది. పునరుద్ధరణ కమిటీ మలిసమావేశం నేపథ్యంలో నిజాం షుగర్స్‌కు ఉన్న ఆస్తుల విలువ, అప్పులు, మిషినరీ స్థితిగతులు, బ్యాంకర్లకు చెల్లించాల్సిన బకాయిలు.. వంటి అంశాలపై నివేదిక రూపకల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. వచ్చే నెల 12లోగా ఫ్యాక్టరీ పునరుద్ధరణపై సాధ్యాసాధ్యాలకు సంబంధించిన నివేదిక ఇవ్వాలని కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం గడువు నిర్దేశించింది. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే పునరుద్ధరణ కమిటీ రెండో భేటీలో తీసుకునే నిర్ణయాలపై ఆసక్తి నెలకొంది.

హస్తినలో సీఎం రేవంత్

▶ మొదటి పేజీ తరువాయి

అందించాల్సిన ఆర్థిక సాయంపై వినతిపత్రం ఇవ్వనున్నట్టు సమాచారం. మరో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

మూడు కీలకాంశాలపై చర్చ ఉంటుందా?

సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మరో మంత్రి ఢిల్లీ బయలుదేరడంతో రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి. ఈ ముగ్గురూ పార్టీ హైకమాండ్‌ను కలిసి మూడు కీలకాంశాలపై చర్చించే అవకాశముందని టీపీసీసీ వర్గాలంటున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల విషయంతో పాటు నామినేటెడ్ పోస్టుల గురించి హైకమాండ్‌తో చర్చించిన తర్వాత కొంత స్పష్టత వస్తుందని తెలుస్తోంది. ఈ రెండింటితో పాటు కీలకమైన కేబినెట్ విస్తరణ గురించి కూడా చర్చ జరుగుతుందని సమాచారం. అయితే, కేబినెట్ విస్తరణ లోక్‌సభ ఎన్నికల తర్వాత ఉంటుందా? ఇప్పుడే ఉంటుందా అన్న దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక సమీకరణల ప్రకారం ఎస్టీ (లంబాడా), బీసీ, మైనార్టీలకు కేబినెట్‌లో బెర్తులు దక్కాల్సి ఉంది. ఇప్పుడే కాకుండా లోక్‌సభ ఎన్నికల తర్వాత కేబినెట్ విస్తరణ చేపట్టడం ద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉండవనే అభిప్రాయాన్ని కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ మంత్రివర్గ విస్తరణ గురించి ఓ అభిప్రాయానికి వచ్చారని, ఒకవేళ హైకమాండ్‌తో దీనిపై చర్చ జరిగి, ఢిల్లీ పెద్దల నుంచి గ్రీన్‌సిగ్నల్ లభిస్తే త్వరలోనే మంత్రివర్గ ప్రమాణ స్వీకారం ఉంటుందని, లేదంటే పార్లమెంటు ఎన్నికల వరకు ఆగాల్సిందేనని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

కొత్తగా వచ్చిన వారికి అవకాశంపై చర్చ?

లోక్‌సభ అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఓ అభిప్రాయానికి వస్తున్నట్టు అర్థమవుతోంది. హైదరాబాద్ (మైనార్టీ), కరీంనగర్ మినహా 15 స్థానాల్లో పోటీకి ఎవరిని దింపాలన్న దానిపై జాబితా రెడీ అయిందని, దానిని ఇప్పటికే హైకమాండ్‌కు పంపారని, కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) భేటీ అనంతరం పార్టీ అభ్యర్థిత్వాలను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. బొంతు రామ్మోహన్ (సికింద్రాబాద్), నీలం మధు (మెదక్), పట్నం సునీతారెడ్డి (చేవెళ్ల), వెంకటేశ్ నేతకాని (పెద్దపల్లి), కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి (మల్కాజ్‌గిరి), తాటికొండ రాజయ్య (వరంగల్)కు లోక్‌సభ అభ్యర్థిత్వం విషయంలో స్పష్టత వచ్చిందనే చర్చ జరుగుతోంది. దీనికి తోడు నల్లగొండ, భువనగిరి, పెద్దపల్లి, ఖమ్మం స్థానాల్లో పార్టీ నేతల బంధువులు, కుటుంబ సభ్యులు టికెట్లు అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ అభ్యర్థిత్వాల విషయంలో అనుసరించనున్న మార్గదర్శకాలపై కూడా సీఎం, డిప్యూటీ సీఎం, శ్రీధర్‌బాబు చర్చించే అవకాశాలున్నట్టు సమాచారం.

నామినేటెడ్ 'నారాజ్'....

పార్టీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు పూర్తయినా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడం లేదనే అసంతృప్తి రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో కనిపిస్తోంది. అదిగో, ఇదిగో అంటూ ఊరిస్తున్నా ఈ పదవులను పంపిణీ చేయకపోవడంతో ఎప్పుడెప్పుడా అని కాంగ్రెస్ నేతలు చాలా మంది ఎదురుచూస్తున్నారు. తొలుత 9 కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను ప్రకటిస్తారనే చర్చ జరగ్గా, ఆ తర్వాత ఆ సంఖ్య 18కి చేరింది. పార్లమెంటు ఎన్నికలకు ముందే ఈ పదవుల పంపకాలుంటాయని ఓసారి, ఎన్నికల తర్వాతే ఉంటాయని మరోసారి చర్చలు జరుగుతున్నాయి. అయితే, అడపాదడపా కొందరికి నామినేటెడ్ పదవులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసే (పార్లమెంటు ఎన్నికలకు ముందే) అంశంపై కూడా ఈ పర్యటనలోనే రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యులు ఢిల్లీ పెద్దలతో చర్చిస్తారని టీపీసీసీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

క్లుప్తంగా...

మంత్రి కొండా సురేఖకు డెంగ్యూ



సాక్షి, హైదరాబాద్: అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్నారు. ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆమె జ్వరం బారినపడ్డారు. తన శాఖల పరిధిలోని కార్యక్రమాలను ఇంటి నుంచే పర్యవేక్షిస్తూ వస్తున్నారు. అయితే ఐదురోజులుగా మంత్రికి జ్వరం తగ్గకపోవడంతో వైద్యులు పలు పరీక్షలు చేసి డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటూ రోజువారీ కార్యక్రమాలను మంత్రి పర్యవేక్షిస్తున్నారు. మేడారం జాతర ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకుంటూ, అవసరమైన సూచనలు చేస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో మంత్రి కోలుకొని మేడారం జాతరలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

మున్షీకి క్షమాపణలు చెప్పాలి: మధుయాష్కీ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని ఉద్దేశించి బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఫైర్ అయ్యారు. 'మున్షీ బెంగాల్ టైగర్. తూటాలను ఎదుర్కొన్న నాయకురాలు. ఆమెపై అడ్డగోలుగా నోరు పారేసుకుంటే సహించం, ప్రభాకర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి' అని సోమవారం ఓ ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అత్యధిక ఎంపీ సీట్లు గెలుస్తుందన్న సర్వేలతో బీజేపీ నేతలు బెంబేలెత్తి చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

కొత్త డీఎంఈగా డాక్టర్ వాణి



సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యాసంచాలకులు(డీఎంఈ)గా డాక్టర్ ఎస్.వాణిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం అడిషనల్ డీఎంఈ హోదాలో సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఆమె పనిచేస్తున్నారు. డీఎంఈగా పనిచేస్తున్న డాక్టర్ త్రివేణిని ఆ బాధ్యతల నుంచి తప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతేడాది డిసెంబర్ 21న డీఎంఈ రమేశ్‌రెడ్డిని తప్పించారు. ఆయన స్థానంలో సీనియారిటీ లిస్టులో మొదటి స్థానంలో ఉన్న త్రివేణికి బాధ్యతలు అప్పగించగా, రెండు నెలలు కూడా గడవకముందే ఆమెను కూడా తప్పించడం గమనార్హం. అకస్మాత్తుగా మార్చడంపై వైద్య, ఆరోగ్యశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రజారోగ్య సంచాలకులు రవీందర్ నాయక్‌ను కూడా మార్చుతారని ప్రచారం సాగుతోంది.

మహిళా, ఎస్సీ మోర్చాల రాష్ట్ర కమిటీల నియామకం

సాక్షి, హైదరాబాద్: బీజేపీ మహిళా, ఎస్సీ మోర్చాల రాష్ట్ర కమిటీలను నియమించారు. మహిళా మోర్చా ఉపాధ్యక్షులుగా వి.సులోచన, డాక్టర్ మాలతి ఇప్పా, పి.వీణ, బి.విజయలక్ష్మీ, కె.సరిత, ప్రధానకార్యదర్శులుగా గుర్రాల నిర్మల, డాక్టర్ సమత, అర్కల సుధ, కార్యదర్శులుగా సాహు శ్రీలత, కల్లెం విజయ, కె.విజయలక్ష్మీ, ఎస్.గీతారెడ్డి, సంధ్య బాల్‌రాజ్, దశరథ లక్ష్మీ, ఆఫీస్ కార్యదర్శిగా మరిపి ప్రసన్నను మహిళామోర్చా అధ్యక్షురాలు డాక్టర్ ఎం.శిల్పారెడ్డి నియమించారు. ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులుగా జి.జగ్జీవన్, ఓం ప్రకాశ్, కంచన కృష్ణ, జి.అంబేడ్కర్, శివాజీ కాసిపేల, జలాల్ శివుడు, ప్రధానకార్యదర్శులుగా కుమ్మరి శంకర్, క్రాంతికిరణ్, ఎన్.మొగులయ్య, కార్యదర్శులుగా పి.విజయ్‌బాబు, ఎం.చంద్రశేఖర్, కపిల్ బరాబరి, కర్నె పాండు, స్పందన, వై. ప్రశాంతి, ఇంకా పలువురిని అధికార ప్రతినిధులుగా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియమించారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించింది.

వైద్య బిల్లులు లేకున్నా సీఎంఆర్ఎఫ్ చెల్లింపులు

విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) మంజూరు చేయడంలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. 2018–19లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో విచ్చలవిడిగా సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఆస్పత్రుల్లో చికిత్స పొందినట్లు బిల్లులు సమర్పించకపోయినా.. వందల మందికి సీఎంఆర్ఎఫ్ మంజూరు చేశారని గుర్తించినట్లు సమాచారం. ఒక్కో జిల్లాలో కనీసం 30 మందికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు సీఎంఆర్ఎఫ్ నుంచి చెల్లించినట్లు పరిశీలనలో తేలింది. వరంగల్ పశ్చిమ నియోజకర్గంలో పెద్ద సంఖ్యలో సీఎంఆర్ఎఫ్ నుంచి చెల్లింపులు జరిపినట్లు ఫిర్యాదులు అందాయి. ప్రస్తుతానికి ప్రభుత్వం శాఖాపరమైన విచారణ జరుపుతోందని, క్షేత్ర స్థాయిలోని ఆస్పత్రుల్లో వైద్య బిల్లులను పరిశీలించి అక్రమాలను నిర్ధారించేందుకు అవసరమైతే దర్యాప్తు సంస్థలకు బాధ్యత అప్పగించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

కోడ్ కూయక ముందే.. మోదీ టూరు!

ములుగులో గిరిజన యూనివర్సిటీకి శంకుస్థాపన

- నిజామాబాద్‌లో పసుపు బోర్డ్, ట్రిపుల్ ఆర్ పనులకు శ్రీకారం
- చర్లపల్లిలో రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం
- ఆయా అభివృద్ధి పనులతో ప్రధానితోనే ఎన్నికల ప్రచారం మొదలుపెట్టేలా.. రాష్ట్ర బీజేపీ నేతల సన్నాహాలు



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడే లోగానే.. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల కంటే ముందుగానే తొలివిడత ప్రచారాన్ని పూర్తిచేయాలని బీజేపీ భావిస్తోంది. వచ్చే నెల మొదటివారంలో షెడ్యూల్ ప్రకటనతో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందనే అంచనాల మధ్య పెద్దఎత్తున ముందస్తు ప్రచారానికి కమలదళం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా తెలంగాణ పర్యటనకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రానున్నట్టు పార్టీవర్గాల సమాచారం. ఈ నెలాఖరులోగా లేదంటే మార్చి మొదటివారంలోగా రెండు, మూడు పర్యాయాలు మోదీ రాష్ట్రానికి వస్తారని చెబుతున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం ద్వారా రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని స్వయంగా ప్రధానితోనే ప్రారంభించినట్టు అవుతుందని బీజేపీ నాయకులు అంచనావేస్తున్నారు.

మోదీ చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి ముందే గత అక్టోబర్ 1న మహబూబ్‌నగర్‌లో, 3న నిజామాబాద్‌లలో ఏర్పాటు చేసిన బహిరంగసభల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు, ములుగులో గిరిజన యూనివర్సిటీ, తెలంగాణలో పసుపుబోర్డులను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్లీ అదే పంథాలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించేలోగానే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు తెలుస్తోంది. అదేవిధంగా శాసనసభ ఎన్నికలకు ముందు కేంద్రప్రభుత్వం ప్రకటించిన వివిధ కార్యక్రమాలకు సంబంధించి యాక్షన్‌ప్లాన్ కూడా అమల్లోకి తీసుకురావాలని బీజేపీ భావిస్తోంది. ఈ క్రమంలోనే కేంద్రం ద్వారా రాష్ట్రంలో వివిధ రూపాల్లో చేపట్టనున్న ఎన్‌టీపీసీ, రోడ్లు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు తెలిసింది.

ఆదిలాబాద్‌లో బహిరంగసభ?

ఆదిలాబాద్‌లో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం అక్కడే విడిగా ఏర్పాటు చేసే బహిరంగసభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ లక్ష్యంగా చేసుకుని మోదీ రాజకీయ విమర్శలు సంధిస్తారని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇక మోదీ రాష్ట్ర పర్యటనలో భాగంగా... ములుగులో గిరిజన యూనివర్సిటీ, నిజామాబాద్‌లో పసుపు బోర్డ్ ఏర్పాటుకు శంకుస్థాపనలు, తెలంగాణకు మరీ ముఖ్యంగా రాష్ట్ర రాజధానికి ప్రయోజనం చేకూరేలా చేపట్టనున్న రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేస్తారని తెలుస్తోంది. ఇక చర్లపల్లిలో రైల్వే టెర్మినల్‌ను మోదీ లాంఛనంగా ప్రారంభిస్తారని అంటున్నారు. మొత్తంగా ఈ కార్యక్రమాల ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ మైలేజీని సాధించే దిశలో పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని బీజేపీ భావిస్తోంది.

కొత్తగూడెం చైర్‌పర్సన్‌పై వీగిన అవిశ్వాసం



సంతకం చేసి వెళ్తున్న కౌన్సిలర్ ఆమని

కొత్తగూడెం అర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకురాలు కాపు సీతాలక్ష్మిపై 22 మంది కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం సమావేశం జరిగింది. తొలుత ఉదయం 11 గంటలకు సమావేశం మొదలుకావాల్సి ఉండగా.. చైర్‌పర్సన్ సహా 36 మంది కౌన్సిలర్లలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన వర్గంతో పాటు చైర్‌పర్సన్ వర్గీయులూ హాజరుకాలేదు. నిర్ణీత సమయానికి ఎవరూ రాకపోవడంతో అధికారులు మధ్యాహ్నం 1.30 గంటల వరకు కౌన్సిల్ సభ్యుల్లో కోరం మేరకు 25 మంది హాజరుకావాలని నోటీసు విడుదల చేశారు. ఈ క్రమంలో చైర్‌పర్సన్ వర్గానికి చెందిన 28వ వార్డు కౌన్సిలర్ మండల ఆమని మాత్రమే వచ్చి సంతకం చేసి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 2గంటల వరకు వేచి ఉన్నా కోరానికి సరిపడే సభ్యులు రానందున చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని సమావేశానికి ప్రత్యేక అధికారిగా వ్యవహరించిన ఆర్డీఓ మధు వెల్లడించారు. చైర్‌పర్సన్ సీతాలక్ష్మి తమ వర్గం కౌన్సిలర్లతో గోవాలో క్యాంపు నిర్వహిస్తుండగా, ఇటీవల కాంగ్రెస్ కండువా కప్పుకున్న కౌన్సిలర్ల భర్తలు, కౌన్సిలర్లు కొత్తగూడెంలో ఉండి కూడా హాజరు కాలేదు. అయితే, అవిశ్వాసం పెట్టిన వారు కోర్టుకు వెళ్లకుండా అడ్డుకునేందుకు కేవలం ఒక కౌన్సిలర్‌ను చైర్‌పర్సన్ వర్గం పంపించినట్లు తెలుస్తోంది. ఫలితంగా కోరానికి సరిపడా కౌన్సిలర్లు రాకపోవడంతో తీర్మానం వీగిపోగా, ఒకరు హాజరుకావడంతో అవిశ్వాసం ప్రవేశపెట్టిన వర్గం కోర్టుకు వెళ్లే అవకాశాన్ని కోల్పోయినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది.

విద్యార్థుల నడవడికను గమనిస్తూ ఉండాలి

ఇమాంపేట గురుకుల పాఠశాలను సందర్శించిన మానసిక నిపుణులు



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న మానసిక నిపుణుల కమిటీ సభ్యులు

సూర్యాపేట రూరల్: పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యను బోధించడమే కాకుండా వారి నడవడికను ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని సైకాలజిస్టు స్రవంతి, అనిల్‌కుమార్ అన్నారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం ఇమాంపేట సమీపంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో వరుస ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో కలెక్టర్ వేసిన మానసిక నిపుణుల కమిటీ సోమవారం ఆ పాఠశాలను సందర్శించింది. ఒక్కో విద్యార్థినికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, పలుమార్లు పిల్లలు తమతో మొరపెట్టుకున్నట్లు తల్లిదండ్రులు కమిటీ సభ్యుల ముందు వాపోయారు. అనంతరం పాఠశాలలో ఉన్న వసతులను, తరగతి గదులను, భోజనశాలను పరిశీలించారు. ఈ కౌన్సెలింగ్ వారం రోజుల పాటు కొనసాగుతుందని, ప్రతి విద్యార్థిని కమిటీ విచారణ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉమామహేశ్వరి, పద్మజ, జ్యోతిపద్మ, అరుణకుమారి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డుకు జ్యుడీషియల్ అధికారాలు ఇవ్వాలి

సీఎంకు వక్ఫ్‌బోర్డు పాలకమండలి సభ్యుడి వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తులను పరిరక్షణ కోసం బోర్డుకు జ్యుడీషియల్ అధికారాలు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేసినట్లు వక్ఫ్‌బోర్డు పాలకమండలి సభ్యుడు మౌలానా సయ్యద్ అబుల్ ఫతే బందగీ బాదే షా రియాజ్ పాషా ఖాద్రీ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన వక్ఫ్‌బోర్డు చైర్మన్‌తోపాటు పాలక మండలి సభ్యులందరూ మర్యాదపూర్వకంగా సీఎంను కలిసి వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, అభివృద్ధి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బోర్డుకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం స్పష్టమైన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులతోపాటు అన్ని అంశాలపై సమగ్ర అధ్యయనం, పరిశీలన కోసం సీఎం పలు సూచనలు చేశారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ, న్యాయ విభాగాల అధికారులను భాగస్వాములను చేయాలని సూచించినట్లు వెల్లడించారు. వక్ఫ్‌బోర్డు పూర్తి స్థాయి కసరత్తు చేసిన తర్వాత సంబంధిత శాఖల అధికారులను పిలిపించి వివరణాత్మక సమావేశం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

హారిజాంటల్ రిజర్వేషన్లు దారుణం

- రోస్టర్ పాయింట్ల రద్దుతో ఆడబిడ్డలకు అన్యాయం... తక్షణమే జీవో 3ను వెనక్కి తీసుకునేలా ఆదేశించండి
- సోనియా, ఖర్గేలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖలు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగావకాశాల్లో మహిళల హక్కులను హరించేలా రోస్టర్ పాయింట్లు లేని హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. తెలంగాణలో ఆడబిడ్డలతో పాటు దివ్యాంగుల ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామకాల్లో ఆడబిడ్డలకు అన్యాయం చేసేలా ఉన్న జీవో 3ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి రాసిన లేఖలను కవిత సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు తీరని అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు మహిళలకు రోస్టర్ పాయింట్లతో కూడిన హారిజాంటల్ రిజర్వేషన్లు అమలవుతున్నాయని, మహిళలకు హారిజాంటల్ రిజర్వేషన్ ఇస్తూనే వర్టికల్ రిజర్వేషన్లతో సమానంగా అమలు చేయాలంటే రోస్టర్ పాయింట్లను పెట్టాలనే ప్రతిపాదన 1996లో తెరమీదికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం జీవో 41, 56లను జారీ చేసిందన్నారు. పాత విధానం ప్రకారం మహిళలకు కచ్చితంగా 33 శాతం ఉద్యోగాలతో పాటు అదనంగా మరిన్ని ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉండేదన్నారు. హారిజాంటల్ రిజర్వేషన్ విధానంతో ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకే తీవ్రంగా నష్టం జరుగుతుందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అన్యాయం చేసే జీవో 3ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ప్రకటించారు.

బీజేపీ 'జనసందేశ్' డిజిటల్ ఎడిషన్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అధికారపత్రిక 'జనసందేశ్'డిజిటల్ ఎడిషన్‌ను కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించారు. సోమవారం ఆన్‌లైన్‌లో డిజిటల్ ఎడిషన్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో పార్టీపక్షాన 1991 నవంబర్ 25న ప్రారంభమైన ఈ పత్రిక తొలుత అంతర్గత సర్క్యులేషన్‌లోనే ఉండేదన్నారు. మూడున్నర దశాబ్దాలుగా తన ప్రస్థానాన్ని కొనసాగించిన పత్రిక మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుందన్నారు. తాను మొదటిసారి పార్టీ అధ్యక్షుడైనప్పుడు నలుపు, తెలుపు టాబ్లాయిడ్ నుంచి రంగుల పేజీల మ్యాగజైన్‌గా రూపాంతరం చేశామని తెలిపారు. ప్రధాని మోదీ చొరవతో దేశంలో డిజిటల్ విప్లవం తాలూకు ఫలితాలు మారుమూల పల్లెలకు సైతం చేరుతున్న ప్రస్తుత తరుణంలో.. 'జనసందేశ్'పత్రికను కూడా డిజిటల్ రూపంలో తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. ఇకపై www. bjpjanasandesh.org వెబ్‌సైట్‌లో జనసందేశ్ సంచికలను డిజిటల్‌లో ప్రచురించనున్నట్టు తెలిపారు. ఈ డిజిటల్ ఎడిషన్‌ను కంప్యూటర్, మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని చెప్పారు.

మాది ఒంటరి పోరే

▶ మొదటి పేజీ తరువాయి

మొదలవుతాయని, మేడారం జాతర కారణంగా వరంగల్ వైపు సాగే యాత్ర (ఐదవది)మాత్రం కొన్నిరోజుల ఆలస్యంగా ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ యాత్రల్లో భాగంగా... రైతులు, చేతివృత్తులవారు, నిరుద్యోగులు, పాదుపు సంఘాల మహిళలు, ఇలా అన్ని వర్గాల ప్రజలను కలుసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, డా.పాల్వాయి హరీశ్‌బాబు, నేతలు ఈటల రాజేందర్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, డా.కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యాత్రలు ఇలా...

1) కొమరంభీం విజయ సంకల్ప యాత్ర...బాసర సరస్వతి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న తర్వాత భైంసా నుంచి ప్రారంభమవుతుంది. ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఈ యాత్ర సాగుతుంది. సుమారు 1,056 కి.మీ మేర 12 రోజులు 21 నియోజకవర్గాల్లో ఈ యాత్ర కొనసాగుతుంది. అస్సాం సీఎం హిమంతబిశ్వశర్మ దీనిని ప్రారంభిస్తారు. ఎంపీ డా. కె.లక్ష్మణ్, ఆరుగురు శాసనసభ్యులు భైంసా యాత్రలో పాల్గొంటారు.

2) రాజరాజేశ్వర విజయ సంకల్ప యాత్ర...కరీంనగర్, చేవెళ్ల, మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో 1,217 కి.మీ ఉంటుంది. 22 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఈ యాత్ర కొనసాగుతుంది. తాండూరులో కేంద్రమంత్రి బీఎల్ వర్మ ప్రారంభిస్తారు. ఎంపీ బండి సంజయ్, ఇతర నేతలు పాల్గొంటారు.

3) భాగ్యనగర విజయ సంకల్ప యాత్ర... భువనగిరిలో యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆశీస్సులతో ఈ యాత్ర ప్రారంభమవుతుంది. భువనగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజ్ గిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఈ యాత్ర సాగుతుంది. గోవా సీఎం ప్రమోద్ సావంత్ ప్రారంభిస్తారు. ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు రాజా సింగ్, వెంకటరమణా రెడ్డి పాల్గొంటారు.

4) కృష్ణమ్మ విజయ సంకల్ప యాత్ర...మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణా గ్రామం సమీపంలో కృష్ణా నది వద్ద పూజలు చేసిన తర్వాత ఈ యాత్ర ప్రారంభమవుతుంది. మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఈ యాత్ర ఉంటుంది. 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,440 కి.మీ మేర యాత్ర సాగనుంది. కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా ప్రారంభిస్తారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, నేతలు డీకే అరుణ, ఏపీ జితేందర్ రెడ్డి పాల్గొంటారు.

5) కాకతీయ భద్రకాళి విజయ సంకల్ప యాత్ర...సమ్మక్క సారక్క జాతర కారణంగా కొన్ని రోజులు ఆలస్యంగా ఈ యాత్ర భద్రాచలంలో ప్రారంభమవుతుంది. వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో 1,015 కి.మీ మేర 7 రోజుల పాటు 21 నియోజకవర్గాలను కవర్ చేసేలా ఈ యాత్ర ఉంటుంది.

భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద యాత్ర రథాలకు కిషన్‌రెడ్డి పూజలు

చార్మినార్: విజయ్ సంకల్ప యాత్ర రథాలకు సోమవారం కిషన్‌రెడ్డి.. ఈటల రాజేందర్‌తో కలిసి చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయలు, గుమ్మడి కాయలు కొట్టి ప్రారంభించారు. భారత్ మాతాకీ జై..నరేంద్ర మోదీకి జై..అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రహస్య ఒప్పందం: కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య రహస్య ఒప్పందం జరిగిందని బీజేపీ పార్లమెంటరీ పార్టీ బోర్డు సభ్యుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఢీకొట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్నప్పటికీ, ఢిల్లీ స్థాయిలో పెద్దలు రహస్య ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, బీఆర్ఎస్ సహా ఏ పార్టీ అయినా కాళ్లబేరానికి వచ్చినా ఎవరితోనూ పొత్తును ఉండబోవని లక్ష్మణ్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. బీఆర్ఎస్ అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్‌ను మార్చాలని ప్రజలు అనుకున్నందుకే కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో ఈడీ విచారణ కొనసాగుతోందని.. తప్పు చేసిన వారిపై తప్పకుండా చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. ఆధారాలు ఉంటే ఈ కేసులో కవిత సహా ఎవరినీ ఈడీ వదలబోదని అన్నారు. కాగా, మేడిగడ్డ ప్రాజెక్ట్‌పై కేంద్రం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో సీబీఐ విచారణ చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని లక్ష్మణ్ పేర్కొన్నారు.

బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు: బాల్క సుమన్



సాక్షి, హైదరాబాద్: 'లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు. బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని మేం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో చెప్పామా? మాది సెక్యులర్ పార్టీ, కేసీఆర్ సెక్యులర్ నేత'అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ స్పష్టంచేశారు. తాము బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని వారే మీడియాకు లీక్‌లు ఇస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం పార్టీ నేతలు పల్లె రవికుమార్ గౌడ్, భరత్ కుమార్ గుప్తాతో కలిసి బాల్కసుమన్ మీడియాతో మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రాలు ఇస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ ఘనతను తన ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శించారు.

తల్లి ఒడికి నవజాత శిశువు

- 24 గంటల్లోపే కేసు ఛేదన
- జమ్మికుంటకు చెందిన డాక్టర్ సలహా మేరకు కిడ్నాప్ చేసిన మహిళ
- ఇద్దరినీ అరెస్ట్ చేసిన పోలీసులు



నజాతశిశువును తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఏసీపీ నరేందర్

కరీంనగర్ క్రైం: నగరంలోని మాతాశిశు ఆస్పత్రిలో ఆదివారం ఉదయం అపహరణకు గురైన నవజాత శిశువు కేసును కరీంనగర్ పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. సోమవారం బిడ్డను తల్లి ఒడికి చేర్చారు. సోమవారం కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బీహార్‌కు చెందిన మనోజ్‌రాం–నిర్మల దంపతులు ఉపాధి కోసం నగరానికి వచ్చి ఆసిఫ్‌నగర్‌లో అద్దెకు ఉంటున్నారు. నాలుగు రోజుల క్రితం నిర్మల మాతాశిశు ఆస్పత్రిలో ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఆదివారం ఉదయం శిశువును ఎవరో అపహరించారన్న మనోజ్‌రాం ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఆస్పత్రి నుంచి ఓ మహిళ శిశువును అపహరించినట్లు సీసీ ఫుటేజీలో గుర్తించారు. పెద్దపల్లి జిల్లా తక్కళ్లపల్లికి చెందిన బొమ్మ ఉరఫ్ ముక్కెర కవిత ఉరఫ్ పద్మకు పిల్లలు లేకపోవడంతో జమ్మికుంటకు చెందిన డాక్టర్ ఎర్రమరాజు జగ్గంరాజును సంప్రదించగా.. ఎక్కడైనా ప్రభుత్వాసుపత్రుల్లో పసిబిడ్డను ఎత్తుకొచ్చేయమని సలహా ఇచ్చాడు. ఆ మేరకు నవజాత శిశువును కిడ్నాప్ చేసినట్లు పోలీసులు తేల్చారు. కరీంనగర్‌లోని మాతాశిశు ఆస్పత్రికి వచ్చిన పద్మ.. టీకా వేయించి తీసుకొస్తానని ఆ నవజాత శిశువును తీసుకుని ఆటోలో ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడి నుంచి జమ్మికుంటకు వెళ్లి వైద్యుడు జగ్గంరాజుకు శిశువును చూపించి అనంతరం తక్కళ్లపల్లి గ్రామానికి వెళ్లింది. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించిన పోలీసులు.. నిందితురాలితో పాటు ఆసుపత్రుల్లో పసిబిడ్డను ఎత్తుకొచ్చేయమని సలహా ఇచ్చిన డాక్టర్ జగ్గంరాజును సోమవారం అరెస్టు చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

'పట్టా'లు తప్పారు

▶ మొదటి పేజీ తరువాయి

పోతారం(ఎస్) గ్రామంలో సర్వే నంబర్ 250లో 2.00 ఎకరాలు, 263లో 1.30 ఎకరాల వ్యవసాయ భూమిని కొంతమంది పట్టా చేయించుకున్నారు. మోక మీద రాజయ్య కుటుంబ సభ్యులే ఉన్న విషయమూ రెవెన్యూ అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. దీంతో బోగస్ సాదాబైనామాలు సృష్టించి నలుగురు పేరున పట్టా చేయించుకున్నారని బాధితులు ఆరోపిస్తూ ఆర్డీఓ, తహసీల్దార్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు.

మోక చూడకుండానే పట్టా మార్పిడి..

భూ రికార్డుల మార్పు సమయంలో రెవెన్యూ అధికారులు మోక(పొజిషన్) విచారణ జరిపాక పట్టా చేయాలి. కానీ అవేమీ పట్టించుకోలేదు. ఒకరు మోక మీద ఉంటే మరొకరి పేరున పట్టా చేశారు. దీని వల్ల 250లో సర్వే నంబర్‌లో రక్బా తక్కువ వస్తుంది. మోక మీద ఇళ్లు నిర్మించుకొని ఉంటున్న దళిత కుటుంబాలకు పట్టాలు లేవు, కొత్తగా పట్టాదార్ పాసు పుస్తకాలు పొందినవారికి మోక మీద భూమి లేదు.

మా తాతల సమాధులను పట్టా చేశారు



1980లోనే 250 సర్వే నంబరులో మా తాతల సమాధులు కట్టాం. ఒకటి కాదు రెండు కాదు 18 సమాధులు ఉన్నాయి. వ్యవసాయ బావి, మా ఇళ్లకు కరెంట్ మీటర్లు ఉన్నాయి. మిషన్ భగీరథ నుంచి తాగునీరు కూడా ఇస్తున్నారు. ఇప్పుడు ఎవరో వచ్చి ఈ భూములు కావాలంటే ఎలా? 50 ఏళ్ల నుంచి ఈ భూమిని నమ్ముకొని బతికినోళ్లం...ఇప్పుడు భూమి లేదంటే ఎక్కడకు పోవాలి. మా పాత రికార్డులను పరిశీలించి మోక విచారణ జరిపి మా భూములకు పట్టాలు ఇవ్వాలి.

– కాలేష్ శివకుమార్, పోతారం(ఎస్)

మా తాత ఇల్లు కట్టిన భూమి మాది కాదంటున్నారు



యాభై ఏళ్ల క్రితమే మా తాత ఇల్లు కట్టాడు. అయితే ఇప్పుడు ఆ భూమి మాది కాదని ఎవరో అమ్మారని రియల్ ఎస్టేట్ వ్యాపారులు మా దగ్గరకు వచ్చి ఇబ్బంది పెడుతున్నారు. సర్వేనంబర్ 250లో రెండు ఎకరాలు, 263 సర్వేనంబరులో 1.30 ఎకరాల్లో మా తాత కాలేష్ రాజయ్యనే పహాణీలో, కబ్జాలో ఉన్నారు. ఇప్పుడు మా వారికి పట్టా మారిన సంగతి తెలియదు. మేమంతా మా అయ్యలు చూపించిన భూములనే దున్నుకొని బతుకుతున్నాం. ఇప్పుడు ఈ భూములు మావి కావంటే ఎలా? మోక విచారణ జరిపించి మాకు న్యాయం చేయాలి.

– కాలేష్ రాజేశ్, పోతారం(ఎస్)

విచారణ జరిపిస్తాం



పోతారం(ఎస్) దళిత కాలనీ పేదల భూముల విషయమై మోక విచారణ జరిపిస్తాం. అదే సర్వే నంబర్‌లో పేదల ఇళ్లు ఉంటే పట్టాదారుల పాసు పుస్తకాలు రద్దు చేసి పేదలకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు నివేదిస్తాం.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్,హుస్నాబాద్

డీఈ, ఏఈలపై బదిలీ వేటు

సాక్షి, హైదరాబాద్: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో గచ్చిబౌలి డీఈ పి.గోపాలకృష్ణ సహా మాదాపూర్ ఏఈ ఎస్.రంజిత్‌పై డిస్కం బదిలీ వేటు వేసింది. వీరిద్దరినీ సీపీడీసీఎల్ కార్పొరేటర్ ఆఫీసులోని హెచ్ఆర్ సీజీఎంకు అటాచ్ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా సైబర్‌సిటీ ఎస్ఈ వెంకన్నకు షోకాజు నోటీసులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ హెచ్చరించినట్లు తెలిసింది.



భవిష్యత్తు గురించి నువ్వు ఆందోళన చెందకు.
తప్పనిసరైతే దాన్ని ఎలాగూ ఎదుర్కొంటావు... వర్తమానాన్ని ఎదుర్కోవడానికి
ఈ రోజు అనేది నీకు ఇచ్చిన అవే తార్కిక ఆయుధాలతోనే!

– మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 20 ఫిబ్రవరి 2024

పారదర్శకత అవసరం!

భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ ఫిబ్రవరి 15 చరిత్రాత్మక దినమని ప్రజాస్వామ్య ప్రియుల అభిప్రాయం. కేంద్రంలోని మోదీ సర్కార్ తెచ్చిన ఎన్నికల బాండ్ల పథకం (ఈబీఎస్) రాజ్యాంగ విరుద్ధమనీ, పారదర్శకత లోపించిన ఈ పథకం కింద వివిధ పార్టీలకు బాండ్ల రూపంలో నిధులిచ్చిన దాతల వివరాలను భారతీయ స్టేట్ బ్యాంక్ వెల్లడించాలనీ సుప్రీమ్ కోర్ట్ చరిత్రాత్మక తీర్పునివ్వడమే అందుకు కారణం. 2018 నుంచి రాజకీయ పార్టీలకు పాడి ఆవుగా మారిన ఈ పథకం రాజ్యాంగంలోని 19 (1)(ఎ) అధికరణాన్ని ఉల్లంఘిస్తోందనీ, దాతలకుండే గోప్యత హక్కు కన్నా పౌరుల సమాచార హక్కే ముఖ్యమనీ కోర్ట్ అభిప్రాయపడింది. బాండ్ల రూపంలో డబ్బులిచ్చిన దాతలు, అందుకున్న పార్టీలు, అందిన నిధులతో సహా మొత్తం వివరాల్ని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) వెల్లడించాలన్న సుప్రీమ్ ఆదేశం పాలక వర్గాలకు దెబ్బే! గత ఆరేళ్ళుగా జనం దృష్టి పడకుండా తప్పించుకున్న వివరాలన్నీ ఇక ప్రజాక్షేత్రంలోకి వస్తాయి. అలాగే, కొన్నేళ్ళుగా అనుమానిస్తున్న కార్పొరేట్ల– రాజకీయపార్టీల క్విడ్ ప్రోకో బంధంపై ఎంతో కొంత బయటపడవచ్చు.

ఈ పథక రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించిన ఆర్థిక శాఖ, ప్రధానమంత్రి కార్యాలయం కోర్ట్ తీర్పుపై ఇంకా మౌనముద్ర వీడలేదు. న్యాయశాఖ మంత్రి మాత్రం తీర్పును పరిశీలిస్తున్నామనీ, సవాలు చేయదలిచినదీ లేనిదీ నిర్ణయిస్తామనీ వెల్లడించారు. నిజానికి, ఎన్నికల్లో లెక్క చూపని అక్రమ ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయడానికి ఎన్నికల బాండ్లను తెచ్చామన్నది పాలకుల వాదన. కోర్ట్ తీర్పుతో మళ్ళీ అదే ధన ప్రవాహ పరిస్థితి తలెత్తుతుందని వారి మాట. కానీ, ఏ కార్పొరేట్ సంస్థల నుంచి, ఏ పార్టీకి, ఎంత నిధులు బాండ్ల రూపంలో వస్తున్నాయో తెలియని గోప్యమైన ఎన్నికల బాండ్ల వ్యవస్థ వల్ల కూడా మరో రకంగా జరుగుతున్నది అదే! అంతా గోప్యమే గనక సంస్థలు స్వప్రయోజనాలు ఆశించి బాండ్ల రూపంలో పార్టీకి నిధులు కట్టబెట్టడం, ప్రతిగా వాటి ప్రయోజనాలను పాలకులు నెరవేర్చడమన్నది అచ్చమైన 'క్విడ్‌ప్రోకో'యే! వివరాలు వెల్లడించాలన్న కోర్ట్ తాజా ఆదేశంతో ఈ 'నీ కిది... నాకది' పందేరాలు బట్టబయలవుతాయి. ఈ తలనొప్పి ఎందుకని బాండ్ల బదులు నేరుగా డబ్బులిస్తే అడ్డుకోవడం అప్పుడైనా, ఇప్పుడైనా కష్టమే. అందుకే, కోర్ట్ తీర్పు సర్వరోగ నివారిణి కాకున్నా, ఎన్నికల నిధుల్లో పారదర్శకతనే అంశంపై మరోసారి చర్చ రేపగలిగింది.

లెక్క తీస్తే, 2017–18 నుంచి 2022–23 వరకు 12 వేల కోట్ల పైచిలుకు విలువైన ఎన్నికల బాండ్లు అమ్మకమయ్యాయి. చిత్రమేమిటంటే అందులో 55 శాతం, అంటే రూ. 6,564 కోట్ల మేర నిధులు అధికార బీజేపీకే దక్కాయి. ఈ అయిదేళ్ళలో ప్రతిపక్ష కాంగ్రెస్‌కు దక్కిన బాండ్లు 9.5 శాతమే. మరో మాటలో రూ. 1,135 కోట్లే. ఈ మొత్తం డబ్బులు ఎవరిచ్చారు, ఎంతిచ్చారన్నది దేవరహస్యం. ఆ గోప్యత చెల్లనేరదన్నది సుప్రీమ్ తాజా ఆదేశం. ఆ ఆదేశాలను పాటిస్తామంటూ భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. నిజానికి, ఎన్నికల బాండ్ల విషయంలో ఎన్నికల సంఘం (ఈసీ) సైతం రోజుకో రకం అభిప్రాయం వ్యక్తం చేసింది. మొదట్లో బాండ్లపై అభ్యంతరం చెబుతూ, ఇది వట్టి తిరోగమన చర్య అని పేర్కొంది. కారణాలేమో కానీ, తీరా సుప్రీమ్ ముందు తన మాట మార్చేసి, ఎన్నికల బాండ్లను సమర్థించింది. పథకాన్ని ఆపు చేయరాదని వాదించింది. ఇప్పుడేమో సుప్రీమ్ ఆదేశాల్ని పాటిస్తామంటోంది. వెరసి, బాండ్లపై ఈసీకి ఏపాటి నిర్దిష్టమైన అభిప్రాయముందో అర్థమైపోతోంది.

చెల్లిస్తున్న వారి పేరేమీ లేకుండా ఏ సంస్థ అయినా వెయ్యి, పదివేలు, లక్ష, పది లక్షలు, కోటి రూపాయల వంతున ఎంతైనా ఓ పార్టీకి ఇచ్చే వీలు ఈ బాండ్ల పథకం కల్పించింది. అందుకు తగ్గట్టే, అపరిమిత రాజకీయ విరాళాలకు వీలు కల్పిస్తూ, కంపెనీస్ యాక్ట్‌లోని 182వ సెక్షన్‌ను 2017లో ప్రభుత్వం సవరించింది. గతంలో రూ. 20 వేల పైన వచ్చే ప్రతి విరాళానికీ పార్టీలు రికార్డులు సమర్పించాలని ఆదాయపన్ను చట్టం. పాలకులు దాన్నీ మార్చేశారు. ఆర్థిక సంవత్సరంలో వచ్చిన విరాళాల మొత్తం ఎంతన్నది చెబితే చాలంటూ ఎన్నికల బాండ్లకు మినహాయింపు కల్పించారు. ఈ సవరణల్ని సుప్రీమ్ తాజాగా కొట్టేసింది. గత మూడేళ్ళలో సదరు సంస్థకొచ్చిన సగటు నికర లాభంలో 7.5 శాతమే గరిష్ఠంగా ఇవ్వాలనే మునుపటి పరిమితిని మళ్ళీ తెచ్చింది. అపరిమిత కార్పొరేట్ ఫండింగ్ దోవలో డొల్ల కంపెనీలతో అక్రమ ధనాన్ని పార్టీలకు చేరవేయకుండా అడ్డుకట్ట వేసింది.

గత 2019 లోక్‌సభ ఎన్నికల ఖర్చు రూ. 2,994 కోట్లని చెబుతున్నా, అసలు ఖర్చు 55 – 60 వేల కోట్లని అంచనా. అందుకే, ఎన్నికల బాండ్ల కథ గోప్యంగా సాగుతోందంటూ సుప్రీమ్ కొట్టేయడం సరైనదే! నిర్ద్వంద్వమైన, సమగ్రమైన ఆ తీర్పును స్వాగతించాల్సిందే! అంత మాత్రాన ఇకపై అంతా పారదర్శకత నెలకొంటుందనుకోలేం. అలాగే, సుప్రీమ్ మాట సర్కార్‌కు ఎదురుదెబ్బే అయినా, కావాలనుకుంటే భవిష్యత్తులో పార్లమెంట్‌లో చట్టం ద్వారా కొత్త రూపంలో బాండ్లకు పాలకులు తెర తీసినా ఆశ్చర్యం లేదు. అయితే, కోర్ట్ తన పని తాను సమర్థంగా చేసింది గనక, ఇప్పుడా తీర్పు స్ఫూర్తిని అందిపుచ్చుకొని, ఆచరణలో పెట్టాలి. చట్టబద్ధమైన ఎస్బీఐ, రాజ్యాంగబద్ధమైన ఈసీ అందులో ముందుండాలి. ఎన్నికల్లో అక్రమ ధనాన్ని అడ్డుకట్టాలంటే పాలకులు సైతం చిత్తశుద్ధి చూపాలి. పార్టీ విరాళాలిచ్చేందుకు వీలుగా సంస్థలు ప్రత్యేక ట్రస్టుల ఏర్పాటు లాంటి ఆలోచన చేయాలి. పారదర్శకత నెలకొల్పడం పెను సవాలే కానీ, ప్రజలు, పార్టీలు, బడా సంస్థలు... అందరూ త్రికరణశుద్ధిగా ప్రయత్నిస్తే అది అసాధ్యమేమీ కాదు. సుప్రీమ్ తీర్పు ఆ దిశలో తొలి అడుగైతే అంతకన్నా కావాల్సింది ఏముంటుంది!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** శు.ఏకాదశి ప.12.03 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఆరుద్ర ప.2.20 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.2.57 నుండి 4.37 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.44 నుండి 9.32 వరకు తదుపరి రా.11.00 నుండి 11.48 వరకు, **అమృతఘడియలు:** లేవు. భీష్మ ఏకాదశి.

సూర్యోదయం : 6.29
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

మరణానంతర ప్రదానం మంచిదేనా?

సందర్భం



గోపాలకృష్ణ గాంధీ

ఇటీవల ప్రకటించిన భారతరత్న పురస్కారాల్లో ముగ్గురికి మరణానంతరం ఇచ్చారు. ఆ ముగ్గురూ దానికి పూర్తి అర్హులు. కానీ వీటిని వారు బతికి ఉన్నప్పుడే ఇచ్చివుంటే ఎంత బాగుండేది! 53 మంది ఇప్పటివరకు 'భారతరత్న'తో అలంకృతులయ్యారు. వారిలో 18 మందికి మరణానంతరం ప్రకటించారు. మరణానంతర ప్రదానంలోని ఇబ్బంది ఏమిటంటే, ఫలానావాళ్లకు ఎందుకు ఇవ్వలేదనే ప్రశ్నకు సమాధానం ఉండదు. కర్పూరీ ఠాకూర్‌కు ఇచ్చినప్పుడు, అన్నాదురైకి ఎందుకు ఇవ్వకూడదు? మరి రాంమనోహర్ లోహియాను ఎలా విస్మరిస్తారు? మొదటి నుంచీ మరణానంతరం ఇవ్వడాన్ని ఒక నియమంగా కాక, ఒక మినహాయింపుగా మాత్రమే చూశారు. జీవించి ఉన్నప్పుడు ఇవ్వడమే భారతరత్నకు ప్రమాణంగా ఉండటం మంచిది.


చౌధురీ చరణ్ సింగ్, పీవీ నరసింహారావు, ఎం.ఎస్. స్వామినాథన్ – ముగ్గురికీ మరణానంతరం 'భారతరత్న' పురస్కారం ప్రకటించడమే ఈ వ్యాసం రాయడానికి నన్ను పురిగొల్పింది. ఈ ముగ్గురూ దానికి పూర్తిగా అర్హులు, ప్రశంసించదగినవారు. వాస్తవానికి వీరికి అత్యున్నత పురస్కారం ప్రకటించడంపై ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా 'సెల్యూట్' చేసింది. కానీ రెండు యూపీఏ (యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్) ప్రభుత్వాలూ లేదా రెండు ఎన్డీయే (నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్) ప్రభుత్వాలూ ఇన్నేళ్లుగా వీరిని ఈ రత్నాలతో ఎందుకు సత్కరించలేదనేది ప్రశ్న. నిజంగానే రత్నాలైన వీరిని దేశం కృతజ్ఞతతో అధికారికంగా కూడా అలాగే పరిగణిస్తుందనే విషయాన్ని వారి జీవితకాలంలోనే చెప్పవలసింది కదా!

అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కుమార్తె ఇందిరా గాంధీ 1954 ఆగస్టు 15న మొదటి భారతరత్న సి. రాజగోపాలాచారికి ఇలా రాశారు: 'మీరు మొదటి భారతరత్న అయినందుకు మేమంతా చాలా సంతోషిస్తున్నాము. చాలా ఏళ్లుగా భారత్‌కు 'రత్నం'గా మీరు గుర్తింపు పొందారు. అది ఇప్పుడు అధికారికంగా ప్రకటించడం చాలా మంచి విషయం.'

53 మంది ఇప్పటివరకు 'భారతరత్న'తో అలంకృతులయ్యారు. వారిలో 18 మందికి మరణానంతరం ప్రకటించారు. నేను 'ఇప్పటి వరకు' అని నొక్కి చెబుతున్నాను. ఎందుకంటే గత కొన్ని రోజులుగా, ఈ గుర్తింపులు వెంటవెంటనే వచ్చేస్తున్నాయి. నేను ఈ అంశంపై మరింతగా చెప్పడానికి ముందు, కొన్ని గణాంకాలను చూద్దాం.

భారతరత్న పురస్కారాలన్నింటినీ వరుస రాష్ట్రపతులే ప్రదానం చేశారు. అయినప్పటికీ ఈ విషయంలో దాదాపుగా దేశ ప్రధానులదే అధికారం. వీరిలో కొందరు ప్రధానులు తాము కూడా దీన్ని పొందారు. నెహ్రూ (1947–64) తనతో కలుపుకొని, 13 మందికి అవార్డును ప్రదానం చేశారు. గుల్జారీలాల్ నందా పరివర్తనా కాలపు బాధ్యత (1966)లో ఉన్నప్పుడు ఒక్క భారతరత్నను ఇచ్చారు. ఇందిరా గాంధీ తన మొదటి ప్రధానమంత్రి పదవీ కాలంలో (1965–77) తనకు ఒకటి, మూడు ఇతరులకు ప్రదానం చేశారు. ఆమె రెండోసారి ప్రధానిగా ఉన్నప్పుడు (1980–84) ఇద్దరికి ఇచ్చారు. రాజీవ్ గాంధీ (1984–89) ఇద్దరికీ, వీపీ సింగ్ (1989– 90) ఇద్దరికీ, పీవీ నరసింహారావు (1991– 96) ఆరుగురికీ, ఐకే గుజ్రాల్ (1997–98) నలుగురికీ, అటల్ బిహారీ వాజ్‌పేయి (1999–2004) ఏడుగురికీ, మన్మోహన్ సింగ్ (2004–14) ముగ్గురికీ ఇచ్చారు. నరేంద్ర మోదీ (2014–) హయాంలో పదిమందికి ప్రకటించారు.

ఇప్పటివరకు అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న నెహ్రూ తన పదవీ కాలంలో అత్యధిక సంఖ్యలో 13 భారతరత్నలను ప్రదానం చేశారు. నరేంద్ర మోదీ ఆ తర్వాత అత్యధిక సంఖ్యలో పదిమందికి ఇచ్చారు.



భారత రత్నలు ప్రకటించడం 1954లో ఉనికిలోకి వచ్చిందని గుర్తుంచుకుంటే, 'సాంద్రత' పరంగా ఇద్దరు ప్రధానులూ సమానంగా పదేళ్లలో పది మందికి ఇచ్చారు. మరణానంతరం ప్రదానం చేసిన భారతరత్నల సంఖ్యలో మాత్రం మోదీ ముందున్నారు. మరణానంతరం ప్రకటించిన 18 భారతరత్నాలలో మోదీ స్కోరు ఏడు. తదుపరి అత్యధికం పీవీ నరసింహారావుది– మూడు.

భారతరత్న అసలు ప్రకాశాన్ని రెండు పరిణామాలు ప్రభావితం చేశాయి: ఒకటి, మరణానంతరం బహూకరించడం. ముందుగా ఈ అంశాన్ని చేపడదాం. దీనిని 1955 జనవరి 15న, నాటి భారత ప్రభుత్వ గెజిట్ నంబర్ 222 ద్వారా ప్రారంభించారు. అయితే దీన్ని ఒక నియమంగా కాక, ఒక మినహాయింపుగా మాత్రమే చూశారు. ఈ 'సడలింపు' అమలులోకి రావడానికి పదేళ్లు పట్టింది. 1966 జనవరి 11న తాష్కెంట్‌లో అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి మరణించిన కొన్ని గంటల్లోనే ఆయనకు రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ తొలి మరణానంతర భారతరత్నను ప్రకటించారు. రెండవ మరణానంతర భారతరత్నకు మరో పదేళ్లు పట్టింది. ప్రధాని ఇందిరాగాంధీ దాన్ని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కె. కామరాజ్‌కు ప్రకటించారు. అయితే, ఆయన జీవించి ఉంటే, ఆయన జీవిత కాలంలో ఆమె ఆ గౌరవం ఇచ్చివుండేవారు కాదు.

కాంగ్రెస్‌వాద మూలాలతో కూడిన మరణానంతర భారతరత్న కొనసాగుతోంది. అదే సమయంలో 'జీవించి ఉండగా' ఇవ్వడాన్ని అధిగమించింది. మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వాల హయాంలో ప్రదానం చేసిన పదింటిలో ఏడు మరణానంతరమైనవి. అయితే 'అర్హత'కు సంబంధించిన ప్రశ్నలు అనివార్యంగా తలెత్తుతాయి. మరణానంతర గ్రహీతల్లో ప్రధానులు వీపీ సింగ్, చంద్రశేఖర్‌లను వదిలివేయవచ్చా? బిహార్ దివంగత ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు ఈ పురస్కారం లభించినందున, సీఎన్ అన్నాదురైనీ, సాటిలేని ఈఎంఎస్ నంబూద్రిపాద్‌నూ విస్మరించగలమా? మరి మన కాలానికి దగ్గరగా ఉండే ఎం.కరుణానిధి, జ్యోతి బసు సంగతి? ఆచార్య వినోబా భావే మరణానంతరం పొందారు. అలాంటప్పుడు జేబీ కృపలానీ, నరేంద్ర దేవ్ వంటి ఆచార్యులను మరచిపోగలమా? జయప్రకాశ్ నారాయణ్, నానాజీ దేశ్‌ముఖ్ వంటి రాజకీయ చింతనాపరులు మరణానంతరం పొందినప్పుడు, పెరియార్‌కు ఇవ్వకూడదా?

కల్లోల తుఫాన్‌లను దాటి దూసుకొచ్చే సముద్ర పక్షి లాంటి అరుణా అసఫ్ అలీ భారతరత్నను పొందారు. మరింత 'తుఫాను లాంటి' కమలాదేవీ ఛటోపాధ్యాయను వదిలివేయవచ్చా? కాంగ్రెస్ వాళ్లు ఈ ఆలోచనంటేనే విరుచుకుపడతారేమోగానీ ఏ సోషలిస్టు, ప్రజాస్వామ్యవాది రాంమనోహర్ లోహియాను మరచిపోతారు? పునరాలోచన, అధికార రాజకీయ ప్రేరణలతో ఉండే 'ఇబ్బంది' ఇదీ!

భారతరత్న ప్రకాశాన్ని ప్రభావితం చేసిన రెండవ పరిణామం ఏమిటంటే, దానిపై అహంభావపు స్పర్శ. నెహ్రూ, ఇందిరా గాంధీలు ఇద్దరూ తమ పదవీకాలంలో దానిని అంగీకరించకపోయి ఉంటే పురస్కార గొప్పదనాన్ని పెంచి, తమ గొప్పతనాన్నీ పెంచుకునేవారు. వారు దానిని పొందడం అంటే తమకు తామే దండలు మెడలో వేసుకున్నట్టు. మరణానంతర ప్రదానాలు లోపాలకు సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తితే, అధికారంలో ఉన్నప్పుడు పొందే ప్రదానాలు వ్యవహారాలకు సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తుతాయి. మౌలానా ఆజాద్‌కు కేబినెట్ మంత్రిగా ఉన్నప్పుడు భారతరత్నను ఆఫర్ చేసినప్పుడు ఆయన ఇలా చెప్పారని ప్రతీతి: 'మేము ఇచ్చేవాళ్లలో ఉన్నాం, తీసుకునేవాళ్లలో కాదు.'

నేను ఇలా చెప్పడం ద్వారా ఈ వ్యాసాన్ని పూర్తి చేయాలని అనుకుంటున్నాను: జీవించి ఉన్నప్పుడు ఇవ్వడమే భారతరత్నకు ప్రమాణంగా ఉండనివ్వండి. మరణానంతర ఎంపిక ఒక మినహాయింపుగా ఉండాలి. ఆమె లేదా అతను పదవిలో ఉండేవరకు 'ఇచ్చేవారు'గానే ఉండాలి తప్ప, 'గ్రహీత'లు కావాలని కలలు కనకూడదని ఆశిద్దాం. పదవిలో లేనట్టయితే పురస్కార విలువ పెరుగుతుంది.

అంతర్జాతీయంగానూ, జాతీయ స్థాయిలోనూ గౌరవం పొందిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను ఇటీవల పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రశంసించారు. బహుశా ఆయనకు భారతరత్నను ప్రతిపాదించి ఉండొచ్చు, సలక్షణమైన వినమ్రతతో ఆయన తిరస్కరించి ఉండొచ్చు. ఆయనను 'రత్నం'గా చూసిన చాలామందికి అది అధికారికం అయినప్పుడు ఒక సంతృప్తి ఉండదా?

వ్యాసకర్త పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్, మాజీ దౌత్యవేత్త
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మహానుభావులు



విశ్వాన్ని నియంత్రించే సూత్రాలను గణిత శాస్త్రవేత్తలు ఛేదిస్తారు. మానవ జాతిని నియంత్రించే చట్టాలను తాత్వికులు రూపొందిస్తారు.

– జోసెఫ్ టి. నూనీ, థింకర్

అంతకుమించి...



హిట్లర్ కంటే ముందు బెల్జియంకు చెందిన కింగ్ లియోపోల్డ్ ఉండేవాడు. ఆయన కోటి మంది కాంగోలీయులను హత్యగావించాడు. ప్రపంచంలో అత్యంత నిర్దయుడు హిట్లర్ కాదు, లియోపోల్డ్.

– అడేమోలా, పాన్-ఆఫ్రికనిస్ట్

అందరికీ సొంతం



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)లో సోరా లాంటి సాఫ్ట్‌వేర్ వచ్చాక, ఇక తర్వాతి తరం ఫిలిం మేకర్స్ ఎవరూ మన ఫిలిం స్కూళ్ల నుంచి రారు. ధారావి లాంటి మురికివాడల్లో యానిమేషన్, కంప్యూటర్స్ చదివే ప్రదేశాల నుంచి వస్తారు.

– శేఖర్ కపూర్, దర్శకుడు

చదువులు – పెళ్లిళ్లు



వైద్యుల్లో, ప్రత్యేకించి రెసిడెంట్లలో పెళ్లయిన బ్యాచిలర్లు ఉండటం సహజం. భర్త పీజీ చదువుతూ ఒక కాలేజీలో, భార్య పీజీ చదువుతూ మరో కాలేజీలో, ఒక్కోసారి వేరే రాష్ట్రంలో ఉంటుంటారు. పెళ్లి వల్ల చదువు దెబ్బతినడం కన్నా, చదువు వల్ల పెళ్లి దెబ్బతింటుంటుంది.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

ఏమనుకోవాలి?



ఉత్తరప్రదేశ్ గత అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు మొత్తం ముస్లింల ఓట్లను అందుకున్న సమాజ్‌వాదీ పార్టీ తమ మూడు రాజ్యసభ స్థానాలకు ఒక్క ముస్లింను కూడా నామినేట్ చేయకూడదని నిర్ణయించుకుంది. ముస్లింలకు ఆ పార్టీ ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటోంది?

– అర్ఫా ఖానమ్ షేర్వానీ, జర్నలిస్ట్

నీరే ప్రాణం



గత ఏడాది ఏప్రిల్ 14 తర్వాత నీటి సరఫరా చేయలేనని అక్కడి ప్రభుత్వం చేతులు ఎత్తేయడంతో ప్రపంచంలో నీళ్లు లేని తొలి నగరంగా కేప్‌టౌన్ నిలిచింది. నీటిని కాపాడుకోకపోతే హైదరాబాద్‌లో కూడా ఆ తరహా సంక్షోభం రావొచ్చు. అలాంటి ప్రతికూల ఫలితం రాకుండా ఉండాలంటే, ప్రతి ఒక్కరూ నీటిని, వాననీటిని సంరక్షించుకోవడానికి పాటుపడాలి.

– కల్పనా రమేశ్, వాననీటి యాక్టివిస్ట్

మారే వయసు



బెనారస్‌లో జరిగినట్టుగా ఇంతకు ముందెప్పుడూ నేను ఇంత వేగంగా వయసు పెరగడం, తగ్గడం జరగలేదు. శ్రీరామ్ భండార్‌కు బ్రేక్‌ఫాస్ట్‌కు బయలుదేరినప్పుడు ఆటోడ్రైవర్ నన్ను 'మాతాజీ' అన్నాడు. వెళ్లాక నాతో కలిసి తినమన్న తర్వాత థ్యాంక్స్ చెబుతూ 'ఆంటీజీ' అన్నాడు. మళ్లీ తిరిగి వచ్చేటప్పుడు 'దీదీ' (అక్క) అన్నాడు. అంతా పూరీ – సబ్జీ మహిమ.

– ఘజాలా వాహెబ్, సంపాదకురాలు

ఇన్ బాక్స్

ఈ ఎమ్మెల్యేకు న్యాయం కావాలి

రాజకీయ ప్రత్యర్థుల కుట్రలో భాగంగా హత్య కేసులో ఇరికించబడి ఎమ్మెల్యే పదవి కోల్పోయి న్యాయం కోసం పోరాడుతున్నాడు ఓ ఎమ్మెల్యే. అతని పేరు కామ్రేడ్ మనోజ్ కుమార్ మంజిల్. నిరుపేద దళిత కుటుంబం నుంచి వచ్చాడు. 36 ఏండ్లకే బిహార్ రాష్ట్రంలోని అజియోన్ (ఎస్సీ) నియోజకవర్గం నుంచి 2020లో సీపీఐ (ఎమ్ఎల్) లిబరేషన్ అభ్యర్థిగా గెలుపొందాడు. కపుర్థిహారా (దేవ్)కు చెందిన నిరుపేద దళిత కూలీ దంపతులకు మనోజ్ 1984లో జన్మించాడు. 1970 ప్రాంతంలో వారి గ్రామం హదియబాద్ భూస్వామ్య శక్తుల చేతుల్లో బూడిదయ్యింది. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. అటువంటి పరిస్థితుల్లో మనోజ్ తల్లి ప్రాణాలతో బయటపడింది. భూస్వామ్య శక్తులు, 'రణవీర్ సేన' ఆరాచకాలకు ఆ కుటుంబం ఎదురొడ్డి నిలబడింది. విద్యార్థి సంఘం నాయకునిగా గ్రామీణ పేద కుటుంబాల పిల్లలకు విద్యను నిజమైన హక్కుగా మార్చడానికి 'సడక్ పే స్కూల్' ఉద్యమం నడిపాడు మనోజ్. అధ్వాన్నమైన పాఠశాలల దుస్థితిపై రోడ్లపై సింబాలిక్ తరగతులు నిర్వహించడం ద్వారా నిరసన వ్యక్తం చేసేవారు. అప్పటి నితీష్ కుమార్ ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. ప్రాథమిక విద్యా పథకాల అమలుకు ఈ పోరాటం ప్రభుత్వాన్ని కదిలించింది. ఆ తర్వాత విప్లవ యువజన సంఘం (ఆర్‌వైఏ) జాతీయ అధ్యక్షుడిగా ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నాడు మనోజ్. బిహార్ శాసన సభకు 2020 నవంబర్‌లో జరిగిన ఎన్నికలలో రెండో ప్రయత్నంలో అజియాన్ నియోజక వర్గం నుంచి విజయభేరి మోగించాడు.

ప్రజా జీవితంలో 30కి పైగా కేసులు ఎదుర్కొన్నాడు. ఐదు సార్లు జైలుకెళ్లాడు. 2015 ఎన్నికల సమయంలో భోజ్పూర్ జిల్లా అజింబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో మనోజ్‌తో పాటు 22 మందిని నిందితులుగా చేర్చారు. జైలు నుంచి మొదటిసారి పోటీ చేసి 35 వేల పైచిలుకు ఓట్లను సాధించి మూడో స్థానంలో నిలిచాడు. ఈ ఫిబ్రవరి 13న మనోజ్ మంజిల్‌తో పాటు 22 మంది ఇతర సహచరులకూ 'ఆరా' సివిల్ కోర్టు... పైన పేర్కొన్న కేసులో దోషులుగా పేర్కొంటూ జీవిత ఖైదు విధించింది. దీంతో ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడింది. ఇప్పుడు అతడి తరఫున ప్రజలు న్యాయపోరాటం చేస్తున్నారు.

– మామిండ్ల రమేష్ రాజా । సీపీఐ (ఎమ్ఎల్) లిబరేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

తప్పు చేస్తే... చర్యలు తప్పవు!

అభిప్రాయం



శ్యామ్ సుందర్ వరయోగి

'చట్టం ముందు అందరూ సమానమే', 'చట్టం ఎవరికీ చుట్టం కాదు', 'చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది' లాంటి మాటలు ఎక్కువగా చెప్పేది రాజకీయ నాయకులే. అయితే తాము చేసిన నేరాల విషయంలో చట్టం కల్పించుకునే సరికి చట్టాన్ని వారే విమర్శించడం కనిపిస్తోంది.

దేశంలో ప్రధానిగా నెహ్రూ ఉన్న కాలంలోనే 1956లో జరిగిన దాదాపు కోటి 2 లక్షల రూపాయల ముంద్రా స్కామ్ మొట్ట మొదటి కుంభకోణంగా చెప్పవచ్చు. ఆ తర్వాత మారుతి కుంభకోణం లాంటివి జరిగినా రాజీవ్ గాంధీ హయాంలో జరిగిన బోఫోర్స్ కుంభకోణం, 1992లో జరిగిన స్టాక్ ఎక్స్చేంజ్ కుంభకోణం, 200 కోట్ల విలువైన స్టాంప్ పేపర్ల కుంభకోణం, 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం, బొగ్గు కుంభకోణం, దక్కన్ హెరాల్డ్ కుంభకోణం, హవాలా కుంభకోణం, కామన్వెల్త్ గేమ్స్ కుంభకోణం ఇలా చెప్పుకుంటూ పోతే బోలెడన్ని ఉన్నాయి. అయితే ప్రధాన కుంభకోణాలన్నింటిలోనూ కాంగ్రెస్ అధినాయకులైన రాజీవ్ గాంధీ, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రాతో పాటు ఆ పార్టీ ముఖ్యనాయకులు నిందితులుగా ఉండడం గమనార్హం. అలాగే బిహార్‌లో 1985 నుంచి 1995 మధ్య జరిగిన రూ. 930 కోట్ల విలువైన పశువుల దాణా కుంభకోణంలో అప్పటి బిహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ జైలు పాలయ్యారు.

అయితే లాలూప్రసాద్ యాదవ్ కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో నిరుద్యోగుల నుంచి భూమిని లంచంగా తీసుకొని ఉద్యోగాలు ఇచ్చినట్లు లాలు ప్రసాద్ యాదవ్, ఆయన భార్యా పిల్లలపై సీబీఐ జూలై 2023లో చార్జిషీట్ దాఖలు చేసింది. ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా చార్జిషీట్ దాఖలు చేసి విచారణ చేపట్టింది. అయితే కేంద్రం పక్షపాతంతో వ్యవహరిస్తోందంటూ ఈ కుంభకోణానికి



రాష్ట్రీయ జనతా దళ్ రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నది.

అలాగే పశ్చిమబెంగాల్‌లో ప్రజాపంపిణీ వ్యవస్థలో జరిగిన దాదాపు రూ. 10,000 కోట్ల కుంభకోణంలో నిందితుడైన తృణమూల్ కాంగ్రెస్ (టీఎమ్‌సీ) పార్టీ నాయకుడు షాజహాన్ షేక్ ఇంటికి విచారణకు వెళ్ళిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులపై అదే పార్టీకి చెందిన కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరచడం సంచలనం కలిగించింది. భూ కుంభకోణంలో అరెస్టయిన జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ తన పదవికి రాజీనామా చేయాల్సి రాగా తనపై కేంద్రం కక్ష సాధిస్తుందనడం నేటి నేతల మనస్తత్వాలను తెలియజేస్తుంది. మరో సంచలనమైన ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఏకంగా కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రయివేట్ సంస్థలకు లబ్ధి చేకూరేలా కొత్త మద్యం పాలసీనే తీసుకువచ్చినట్లు విచారణ సంస్థలు చెబుతున్నాయి. ఈ కుంభకోణంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు కవితతోపాటు పలు సంస్థలకు చెందిన ప్రముఖులు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ఎమ్‌పీ, అతని కుమారుడు విచారణ ఎదుర్కొన్నారు. ఇదే లిక్కర్ స్కాంలో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆ రాష్ట్ర మంత్రి సత్యేంద్ర జైన్ అరెస్టయ్యారు.

ఇటీవల కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక ఎమ్‌పీ సంస్థలో దొరికిన రూ. 600 కోట్లకు పైగా నగదును లెక్కించడానికే 5, 6 రోజులు పట్టిందంటే కాంగ్రెస్ నాయకుల బ్లాక్ మనీ ఇంకెంత ఉందో అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ రకంగా ఆ యా పార్టీల నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ కూడా కేంద్ర ప్రభుత్వం, విచారణ సంస్థలు తమపై రాజకీయంగా కక్ష సాధిస్తున్నాయని ఎదురుదాడి చేయడం దారుణం. తాము సక్రమంగా ఉంటే ప్రజల ముందు తలదించుకొని, జైలు పాలు కామనే సత్యాన్ని నిందితులంతా గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

వివేకవంతుల లక్షణం

అంతా బాగున్నప్పుడు ఏమో కానీ... తలపెట్టిన పని ఏదీ సరిగా ముందు కెళ్ళక, ఊహించని విధంగా మధ్యలో ఇబ్బందులు ఎదురై, పెట్టిన డబ్బు నష్టమై, ధైర్యం కోల్పోయేలా చేసే ఆపదలో మాత్రం దేవుడు తప్పనిసరిగా గుర్తుకొస్తాడు. అందుకే ఆనందంలో గడిచేది అసలు జీవితమే కాదని విజ్ఞులు అంటారు. కష్టాల్లేని జీవితాన్ని గడపడానికి ఏ విశేషమైన ప్రతిభ అవసరం లేదు. కళ్ళు మూసుకుని కూర్చున్నా గడిచిపోతుంది. అయితే, కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు. చూస్తూండగానే సుఖాల కాలం అంతమై పోయి, కష్టం కరుకుదనం మనసుకు, శరీరానికి తగలడం మొదలవుతుంది. అప్పుడు దేవుని గురించిన ఆలోచనల వైపు మనసు మళ్ళుతుంది. ఏ పూజలు చేస్తే కష్టాల కాలం నుంచి తొందరగా బయటపడి, మళ్ళీ సుఖాలలోకి అడుగు పెడతామా అని ఎదురు చూస్తాం.

జ్యోతిర్మయం

కానీ, ఎదురు చూసినంత తొందరగా పరిస్థితులలో మార్పులు రావు. రేపు తెల్లవారితే ముంగిట్లో అంతా మునుపటి సుఖమే అన్న భావనతో ముందు రోజు రాత్రి నిద్ర పోతాం. తెల్లవారి చూస్తే మళ్ళీ అదే పరిస్థితి గోచరిస్తుంది. నిరుత్సాహం కలుగుతుంది. అలా కష్టాల కాలం పెరిగే కొలదీ సహనం కోల్పోయి 'ఏం తప్పు చేశామని, ఇన్ని కష్టాలు పెడుతున్నాడు దేవుడు!' అని ఏకంగా దేవుడినే నిదించడం మొదలు పెడతాం. అదిగో, సరిగ్గా అదే చేయదగిన పని కాదని సారంగు తమ్మయ రచించిన 'వైజయంతీ విలాసం' కావ్యం ప్రథమాశ్వాసంలోని ఈ క్రింది పద్యంలో సరళమైన మాటలలో చెప్పబడింది.

కారణము లేక చెందవు /ధారుణి నాపదలు సంపదలు, నిందులకై
యారటపడి సర్వేశ్వరు/దూఱుట గోరుటయు వలదు తోయజ నయనా!

ఈ లోకంలో కష్టాలు సంభవించడం కానీ, సుఖసంపదలు దక్కడం కానీ కారణం లేకుండా జరగవు. ఆ సత్యాన్ని గ్రహించలేక కష్టం వచ్చినపుడు పరమాత్ముని నిందించడం, సుఖంగా కాలం గడుస్తున్న రోజులలో మితిలేని కోరికలు కోరడం తగదు. అది గ్రహించి సంయమనంతో మెలగడం వివేకంతో కూడిన పని అవుతుంది.

– భట్టు వెంకటరావు

మిలాన్ విన్యాసాలు ప్రారంభం


శత్రువులపై బాంబులతో దాడి చేస్తున్న హెలికాప్టర్లు

విశాఖ వేదికగా ప్రతిష్టాత్మక మిలాన్-2024 నిర్వహణ

సాక్షి, విశాఖపట్నం: యుద్ధ నౌకల సమాహారం.. ప్రపంచ నౌకాదళాల సమన్వయం 'మిలాన్-2024' విశాఖ వేదికగా సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. ప్రతిష్టాత్మక నౌకాదళ యుద్ధ విన్యాసాల ప్రదర్శన 'మిలాన్-2024'లో 58 దేశాలు పాల్గొంటున్నాయి. ఇప్పటికే చాలా దేశాలకు చెందిన నౌకాదళాలు, కోస్ట్‌గార్డ్ బృందాలు, యుద్ధనౌకలు, విమానాలు, హెలికాప్టర్లు, సబ్‌మెరైన్లు విశాఖకు చేరుకున్నాయి. ఈ నెల 27వ తేదీ వరకు జరిగే మిలాన్-2024లో భాగంగా తొలి రోజు మధ్యాహ్నం మారీటైమ్ వార్‌ఫేర్ సెంటర్‌లో వివిధ దేశాల మధ్య ప్రీ సెయిల్ డిస్కషన్స్ జరిగాయి. హార్బర్ ఫేజ్ విన్యాసాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అదేరోజు రాత్రికి ఐస్ బ్రేకర్ డిన్నర్ ఏర్పాటు చేసి అన్ని దేశాల అధికారులు, సిబ్బందికి భారత నౌకాదళం ఆతిథ్య విందు ఇవ్వనుంది. కాగా, 22వ తేదీన జరిగే ప్రతిష్టాత్మక సిటీ పరేడ్‌కు సంబంధించిన రిహార్సల్స్ సోమవారం సాయంత్రం ఆర్కే బీచ్‌లో అద్భుతంగా జరిగాయి. మంగళవారం సాయంత్రం జరిగే తుది రిహార్సల్స్‌కు నౌకాదళ అధికారులు, జిల్లా అధికారులు హాజరుకానున్నారు.

ఉత్పత్తికి సిద్ధమైన మరో భారీ ఫార్మా యూనిట్

కాకినాడ వద్ద రూ.2,205 కోట్లతో పెన్సులిన్ జీ తయారీ కేంద్రం


కాకినాడలో ఉత్పత్తికి సిద్ధమైన లిఫియస్ ఫార్మా యూనిట్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో భారీ ఫార్మా సంస్థ ఉత్పత్తికి సిద్ధమైంది. చైనా నుంచి ఫార్మా దిగుమతులను తగ్గించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) స్కీం కింద లిఫియస్ పేరుతో అరబిందో గ్రూపు పెన్సులిన్ జీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. పెన్సులిన్ తయారీలో కీలక ముడిపదార్థంగా పెన్సులిన్‌జీని వినియోగిస్తారు. కాకినాడ సమీపంలోని తొండంగి వద్ద 250 ఎకరాల్లో సుమారు రూ.2,205 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్ శరవేగంగా నిర్మాణాన్ని పూర్తి చేసుకొని, ఉత్పత్తి ప్రారంభానికి సిద్ధమైంది. ఈ కర్మాగారంలో ఏటా 15,000 టన్నుల పెన్సులిన్‌జీ యూనిట్, 2,000 టన్నుల సామర్థ్యంతో 7-ఏసీఏ యూనిట్‌ను అరబిందో గ్రూపు ఏర్పాటు చేసింది. ఈ యూనిట్‌లో 3,000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. ఈ ప్లాంట్ వాణిజ్య ఉత్పత్తికి సిద్ధమవడంతో లిఫి యస్ ఉద్యోగ నియామకాలు చేపట్టింది. బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్ (బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ) కోర్సులు పూర్తి చేసిన వారిని వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్లు లిఫియస్ ప్రకటించింది. ఈ నెల 22న హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు వద్ద ఉన్న మనోహర్ హోటల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఫెర్మిటేషన్స్‌లో పొడక్షన్, మైక్రోబయోలజీ రంగాల్లో నియామకాలకు తాజాగా కోర్సు పూర్తి చేసిన వారి (ఫ్రెషర్స్) దగ్గర నుంచి 10 ఏళ్ల అనుభవం ఉన్నవారికి అవకాశం కల్పిస్తోంది. వాటర్ ట్రీట్‌మెంట్ అసిస్టెంట్ పోస్టులకు కనీసం రెండేళ్ల అనుభవం నుంచి పదేళ్ల వారికి అవకాశం కల్పిస్తోంది.

మరో రెండు ఫార్మా యూనిట్లు

లిఫియస్‌కు సమీపంలోనే పీఎల్ఐ స్కీం కింద మరో రెండు ఫార్మా యూనిట్లు ఏర్పాటవుతున్నాయి. అరబిందో గ్రూపు క్యూలే పేరుతో సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడితో 159 ఎకరాల్లో ఎరిత్రోమైసిన్ థియోసేనేట్ యూనిట్‌ని ఏర్పాటు చేస్తోంది. దీని ఉత్పత్తి సామర్థ్యం 1,600 టన్నులు. దీనికి సమీపంలోనే దివీస్ సంస్థ ఓ ఫార్మా యూనిట్ ఏర్పాటు చేస్తోంది. దీని పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మూడు యూనిట్లతో కాకినాడ మేజర్ ఫార్మా హబ్‌గా ఎదగనుంది.

అనస్థీషియా హైడోస్‌తో యువకుడి మృతి

ఫిర్యాదు చేసిన తండ్రి.. కేసు నమోదు


లక్ష్మీనారాయణ (ఫైల్)

బంజారాహిల్స్ (హైదరాబాద్): అనస్థీషియా హైడోస్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ మేరకు మృతుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లిలోని ఎన్ఆర్ఎస్ఏ కాలనీకి చెందిన వింధ్యం లక్ష్మీనారాయణ (30) జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 37లోని ఎఫ్ఎంఎస్ ఇంటర్నేషనల్ డెంటల్ క్లినిక్‌కు రెండు రోజుల క్రితం దంత పరీక్షలకు వచ్చాడు. అక్కడ పనిచేసే ఇద్దరు వైద్యులు చికిత్సలో భాగంగా అనస్థీషియా డోస్ అధికంగా ఇచ్చినట్లు బంధువులు చెబుతున్నారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో తనకు వాంతులు అవుతున్నాయని, తల తిరుగుతుందని, కళ్లు తేలిపోతున్నాయంటూ లక్ష్మీనారాయణ వైద్యులకు చెప్పాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆయన్ను అపోలో ఆస్పత్రిలో చేర్చగా కొద్దిసేపటికే మృతి చెందాడు. తన కొడుకు మృతికి ఎఫ్ఎంఎస్ ఇంటర్నేషనల్ డెంటల్ క్లినిక్ వైద్యులే కారణమని, డాక్టర్ల నిర్లక్ష్యంతోనే చనిపోయాడని మృతుడి తండ్రి రాములు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు డెంటల్ క్లినిక్ యాజమాన్యంపై ఐపీసీ సెక్షన్ 304 (ఏ) కింద క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా లక్ష్మీనారాయణ వివాహం మరో నెల రోజుల్లో జరగాల్సి ఉండగా, ఈ ఘటనతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

డిప్రెషన్‌తోనే ఆర్‌జీఐఏకు బెదిరింపు మెయిల్స్

బెంగళూరులో నిందితుడి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు


వైభవ్ తివారీ

శంషాబాద్: హైజాకర్ల విధ్వంసకర చర్యలు శంషాబాద్ విమానాశ్రయంలో జరుగుతాయంటూ ఐదురోజుల వ్యవధిలోనే రెండుసార్లు ఈ-మెయిల్స్ పంపిన వ్యక్తిని ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15 శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఓ ఈ-మెయిల్ వచ్చింది. అందులో విమానాశ్రయ ద్వారాలు తెరిస్తే హైజాకర్లు మిమ్మల్ని చంపేస్తారు అన్న సందేశం ఉంది. దీంతో అధికారులు అప్రమత్తమై ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం అందించారు. 15వ తేదీన పంపిన మెయిల్ ఐడీతోనే ఈ నెల 18న కూడా ఎయిర్‌పోర్టు మరో ఈ- మెయిల్ సందేశం వచ్చింది. టెక్నాలజీ సాయంతో ఆరా తీయగా, అతడు బెంగళూరులో నివాసముంటున్న వ్యక్తిగా గుర్తించారు. బిహార్‌కు చెందిన వైభవ్ తివారీ 2012 నుంచి 2020 వరకు బెంగళూరులోనే ఐటీ ఉద్యోగం చేశాడు. కోవిడ్ సమయంలో ఉద్యోగం కోల్పోయి, అప్పటి నుంచి డిప్రెషన్‌లోకి వెళ్లాడు. మానసిక్థితి సరిగ్గా లేక భయానక స్థితి కల్పించేందుకు ఇలాంటి ఈ మెయిల్స్ పంపినట్టు గుర్తించారు. వెంటనే అరెస్ట్ చేసి అతడి నుంచి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

60 రోజుల్లో 25 వేల ఉద్యోగాలిచ్చాం: శివసేనారెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చరిత్రలో కేవలం 60 రోజుల్లో 25 వేల ఉద్యోగాలిచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ నిరుద్యోగుల ఉసురు తగిలే బీఆర్ఎస్ గత ఎన్నికల్లో ఓడిపోయిందని విమర్శించారు. పేపర్ లీక్‌లు, కోర్టు కేసులు తప్ప బీఆర్ఎస్ నిరుద్యోగుల కోసం ఏం చేసిందని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి దేవాలయంగా మార్చామని శివసేనారెడ్డి పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 5వ తేదీ లోపు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వేస్తున్నామని, ఇది మార్పు కాదా? అని ప్రశ్నించారు. గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల శివసేనారెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

విజ్ఞాన పుస్తకాలు మంచి తరాన్ని సృష్టిస్తాయి

- కూరెళ్ల విఠలాచార్య స్వీయ లైబ్రరీ ప్రారంభోత్సవంలో గవర్నర్ తమిళిసై
- గ్రంథాలయ అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం, వేయి పుస్తకాల బహూకరణ


కూరెళ్ల గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, చిత్రంలో కూరెళ్ల విఠలాచార్య, హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్ తదితరులు

రామన్నపేట: విజ్ఞానవంతమైన పుస్తకాలు ఒక మంచి తరాన్ని సృష్టిస్తాయని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. పుస్తకాలకు మంచిస్థానం కల్పించే గొప్ప మనసు అందరూ కలిగి ఉండాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో మధురకవి, పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన కూరెళ్ల విఠలాచార్య తన ఇంట్లో రెండు లక్షల పుస్తకాలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని, నూతనంగా రూ.2 కోట్లతో నిర్మించిన భవనాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. గ్రంథాలయ అభివృద్ధికి రూ.10 లక్షలు అందజేశారు. వేయి పుస్తకాలను బహూకరించారు. అనంతరం జరిగిన సభలో గవర్నర్ మాట్లాడుతూ..కూరెళ్ల విఠలాచార్య ఎంతో శ్రమకోర్చి అమూల్యమైన జ్ఞాన సంపదను భావితరాలకు అందించి ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. కూరెళ్ల కృషి ఫలితంగా వెల్లంకి గ్రామం తెలంగాణ చిత్రపటంలో ప్రముఖస్థానం పొందిందని ప్రశంసించారు. కూరెళ్ల గొప్ప ప్రయత్నంను గుర్తించి ప్రధానమంత్రి మోదీ మన్‌కీబాత్‌లో ప్రస్తావించడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్, సినీ గేయ రచయిత చంద్రబోస్, కలెక్టర్ జండగే హనుమంతు కొండిబా,సంస్థ అధ్యక్షుడు కూరెళ్ల నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతోనే ప్రగతి

పుస్తక ప్రదర్శన ముగింపు సభలో మంత్రి పొన్నం


పదేళ్ల బుక్‌ఫెయిర్‌కు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ రవీందర్ తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): పుస్తకాన్ని సజీవంగా భవిష్యత్ తరాలకు అందించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ పుస్తక ప్రదర్శన ముగింపు సభను ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గత పదేళ్ల పుస్తక ప్రదర్శనకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పుస్తక పఠనం మానవ మేధోసంపత్తికి నావిగేషన్ వంటిదన్నారు. రోజురోజుకూ పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గిపోతోందన్నారు. పుస్తక పఠనంపై తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. కవి కె.శివారెడ్డి మాట్లాడుతూ ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న తనను పుస్తకమే ఈ ప్రపంచానికి పరిచయం చేసిందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ బి.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. ఇలాంటి పుస్తక ప్రదర్శనలు నిరంతరం కొనసాగాలన్నారు. హైదరాబాద్ పుస్తక ప్రదర్శన అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రిటైర్డ్ ప్రొఫెసర్ రమామేల్కోటే తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన గిరిజన శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ



సాక్షి, హైదరాబాద్: గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) కె.జగజ్యోతి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిపోయారు. వివరాల్లోకి వెళితే... గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిజామాబాద్ పట్టణంలో ఒక నిర్మాణ పనిని, గాజుల రామారంలో జువెనైల్ బాయిస్ హాస్టల్ నిర్మాణపనులను బొడుకం గంగన్న అనే లైసెన్స్‌డ్ కాంట్రాక్టర్ చేపట్టారు. వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల విషయమై కాంట్రాక్టర్‌ను ఆ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ కె.జగజ్యోతి లంచం డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంట్రాక్టర్ నుంచి రూ.84 వేల లంచం తీసుకుంటుండగా సోమవారం హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ(డీఎస్ఎస్) భవన్‌లో జగజ్యోతిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం ఆమెను అరెస్టు చేసి ఏసీబీ కోర్టు ప్రిన్స్‌పల్ స్పెషల్ జడ్జి ముందు హాజరుపర్చినట్లు ఏసీబీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

పదేళ్ల రాచరిక పాలన తర్వాత 70 రోజుల ప్రజాపాలన

ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పదేళ్ల రాచరిక పాలన తర్వాత 70 రోజులుగా ప్రజాపాలన సాగుతోందని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. 70 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలు స్వేచ్ఛగా తమ పనులు చేసుకుంటున్నారని చెప్పారు. సోమ వారం గాంధీభవన్‌లో విలేకరులతో ఆ యన మాట్లాడుతూ బీఆర్ఎస్, కేసీఆర్ అవినీ తిని బయటపెడతామనే నమ్మకంతోనే ప్రజ లు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, ప్రజల నమ్మకాన్ని తాము నిలబెడతామని అన్నారు. మంత్రులు శాఖల వారీగా చేసే సమీక్షల్లో కుప్పలు తెప్పలుగా అవినీతి వ్యవహారాలు బయటపడుతున్నాయని మహేశ్‌కుమార్ తెలిపారు. కమీషన్ల కోసం లక్షల కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

'హకీంపేట స్పోర్ట్స్' మాజీ ఓఎస్డీకి హైకోర్టులో ఊరట

కక్ష గట్టి తనను సస్పెండ్ చేయించారన్న హరికృష్ణ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై ఏర్పాటు చేసిన కమిటీ విచారణలో లైంగిక ఆరోపణలు రుజువు కాకపోవడంతో సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గత ఆగస్టులో జారీ చేసిన సస్పెండ్ ఉత్తర్వులను కొట్టివేసింది. ఎలాంటి విచారణ లేకుండా మంత్రి ఆదేశాల మేరకు సస్పెండ్ చేయడాన్ని తప్పుబట్టింది. గత ఆగస్టులో హరికృష్ణపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో నాటి మంత్రి ఆదేశాల మేరకు ఆయన్ను సస్పెండ్ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్ విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ విచారణలో హరికృష్ణపై లైంగిక ఆరోపణలు రుజువు కాలేదని చెప్పారు. హరికృష్ణ సోమవారం హైకోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ 'నా వివరణ కోరకుండానే సస్పెండ్ చేశారు. స్పోర్ట్స్ పాఠశాల సీట్ల విషయంలో కొందరు పెద్దలు చెప్పినట్లు వినలేదన్న కారణంగానే కక్ష గట్టి నన్ను సస్పెండ్ చేయించారు. ప్రతిభ ఉన్న వారికే నేను సీట్లు కేటాయించాను. న్యాయస్థానంలో న్యాయం దక్కింది'అని తెలిపారు.

బీజేపీ ఒక్కటి కంటే ఎక్కువ గెలవదు

టీపీసీసీ నేత నిరంజన్

సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి బీజేపీ ఒక్కటి కంటే ఎక్కువ సీట్లలో గెలవదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ స్పష్టం చేశారు. ఆ విషయం తెలంగాణ బీజేపీ నేతలకు కూడా తెలుసునన్నారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ జాతీయ మహాసభల పేరుతో మోదీ లేనిదే దేశమే ఉండదన్న రీతిలో అహంకారంతో మాట్లాడటం పరాకాష్ట అని అన్నారు. రాముడి పేరుతో.. దేశంలో ప్రేమానురాగాలు లేకుండా చేస్తున్న రావణుడి లాంటి మోదీకి రానున్న ఎన్నికల్లో రాముడే బుద్ధి చెపుతాడని నిరంజన్ వ్యాఖ్యానించారు.

ఉద్యమకారులకు 'గుర్తింపు'

- ఫోన్ నంబర్లు, ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా గుర్తిస్తున్న పోలీసులు
- అమరుల కుటుంబాలకు నెలకు రూ.25 వేల పింఛన్, జీవించి ఉన్న వారికి 250 గజాల స్థలం
- పార్లమెంట్ ఎన్నికలకు ముందే పంపిణీకి ప్రయత్నాలు


రేవంత్‌రెడ్డితో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు (ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ మలిదశ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ చివరి దశకు చేరింది. అమరులైన వారి కుటుంబాలకు నెలకు రూ.25వేల పింఛన్, జీవించి ఉన్న వారికి 250 గజాల ఇంటి స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. అందులో భాగంగా ఇటీవల నిర్వహించిన ప్రజాపాలనలో ఉద్యమకారుల నుంచి కేసులు, ఇతర వివరాలతో దరఖాస్తులు ఆహ్వానించింది. ఇప్పటి వరకూ 86,470 మంది ఉద్యమకారులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఉద్యమంలో పాల్గొని, కేసులు, జైలుశిక్ష అనుభవించిన వారిని గుర్తించే పనిని ప్రభుత్వం పోలీసుశాఖకు అప్పగించింది. ఉమ్మడి పదిజిల్లాల నుంచి ఇప్పటికే డిస్ట్రిక్ట్ క్రైం రికార్డ్స్ బ్యూరో విభాగం వీరిలో అర్హుల్ని గుర్తించి డీజీపీ కార్యాలయానికి నివేదిక పంపించింది. గుర్తించిన ఉద్యమకారులకు పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఇంటి స్థలాల పంపిణీ చేస్తారని సమాచారం.

నేపథ్యం ఏంటి?

తెలంగాణలో మలిదశ ఉద్యమంలో వివిధ ఆందోళనలు, నిరసనలు నిర్వహించిన ఆందోళనకారులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. చాలామంది జైలు జీవితం అనుభవించారు. మిలియన్‌మార్చ్ సందర్భంగా ఒకేరోజు రాష్ట్రవ్యాప్తంగా 60వేలకుపైగా కేసులు నమోదయ్యాయి. ఇందులో చాలా వరకు స్టేషన్ బెయిల్ కావడంతో అందరినీ సాయంత్రానికి వదిలేశారు. తెలంగాణ సిద్ధించాక ఉద్యమంలో పాల్గొన్న తమకు గుర్తింపు లేకుండాపోయిందని భావించిన వారంతా ఆరేళ్ల క్రితం తెలంగాణ ఉద్యమకారుల ఫోరంగా ఆవిర్భవించారు. డా.చీమ శ్రీనివాస్ నేతృత్వంలో ఓరుగంటి ఆనంద్, కనకం కుమారస్వామి, పటోళ్ల సురేందర్‌రెడ్డిలు తదితరులు అన్ని పార్టీలను కలిసి తమను గుర్తించి, ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో చైర్మన్‌గా ఉన్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మరో సీనియర్‌నేత పొన్నం ప్రభాకర్‌లను కలిసి పరిస్థితిని వివరించారు. రేవంత్‌రెడ్డిని కలిస్తే ఆయన అంగీకరించారు. వారంతా అధిష్టానంతో మాట్లాడి అమరుల కుటుంబాలకు రూ.25వేల పింఛన్, ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం ఇచ్చేందుకు ఒప్పించారు. ఫలితంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో వీరి డిమాండ్లకు కూడా చోటు దక్కింది.

గుర్తింపు బాధ్యత 'డీసీఆర్‌బీ'కి

పోలీసుశాఖలోని డీసీఆర్‌బీ విభాగం ఉద్యమకారులను గుర్తించే పనిని స్వీకరించింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల వారీగా ఎంతమంది ఉద్యమంలో పాల్గొన్నారు? ఏఏ సందర్భంలో కేసులు అయ్యాయి. ఎవరెవరు బైండోవర్ అయ్యారు? అన్న విషయాలను గుర్తించి డీజీపీ కార్యాలయానికి నివేదిక పంపినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తుల్లో కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్ జిల్లాల నుంచి అధికంగా ఉన్నాయని సమాచారం. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు డా.చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ''రాష్ట్రం కోసం మేం చేసిన పోరాటానికి ఇప్పుడు గుర్తింపు రాబోతోంది. 2001 నుంచి పోరాటం చేసిన వారికి, ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు త్వరలో స్వాతంత్ర సమర యోధులతో సమానంగా గుర్తింపు వస్తుంది'' అని చెప్పారు.

ఎటు చూసినా మిర్చి.. భారీగా చేర్చి!

ఖమ్మం, ఏనుమాముల మార్కెట్లకు 1.40 లక్షల బస్తాలకుపైగా రాక


మిర్చి బస్తాలతో నిండిపోయిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్

ఖమ్మం వ్యవసాయం/వరంగల్: ఖమ్మం, వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లకు సోమవారం మిర్చి పోటెత్తింది. ఎక్కడ చూసినా మిర్చి బస్తాలుండటంతో మార్కెట్ ఆవరణ అంతా ఎర్రతివాచీ పరిచినట్లుగా కనిపించింది. శుక్ర, శని, ఆదివారాలు వరుస సెలవులు రావడంతో సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు పెద్ద మొత్తంలో మిర్చిని తీసుకొచ్చారు. ఖమ్మం మార్కెట్ కమిటీకి.. ఎర్రమిర్చి 52,388 బస్తాలు, తాలు మిర్చి 8,632 బస్తాలను విక్రయించేందుకు తరలించారు. మిర్చి జెండాపాట క్వింటాకు ధర రూ.20,850 నమోదు కాగా, మోడల్ ధర రూ.19 వేలు, కనిష్టం రూ.14 వేలుగా నమోదైంది. ఏనుమాముల మార్కెట్‌కు 80 వేలకుపైగా మిర్చిబస్తాలు వచ్చాయి.

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై కేసు



తాడూరు: నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఈమేరకు తాడూరు ఎస్సై మహేశ్ వివరాలు వెల్లడించారు. 'జనార్దన్‌రెడ్డి తన సొంత నిధులతో ఎంజేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో తాడూరు మండలంలోని సిర్సవాడ ఉన్నత పాఠశాలను అధునాతన హంగులతో పునర్నిర్మించారు. అయితే ఆదివారం పాఠశాల ప్రారంభోత్సవం చేపట్టగా జనార్దన్‌రెడ్డి అనుచరులు కొందరు స్వయంగా తెచ్చుకున్న రిబ్బన్ ప్రధాన గేటు ముఖద్వారం వద్ద కట్టి కట్ చేసి లోపలికి ప్రవేశించారు. అనంతరం ప్రస్తుత ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి రావడంతో రసాభాస నెలకొంది'అని తెలిపారు. ఎమ్మెల్యేను పిలిచి అవమానించారంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు డీఈఓ గోవిందరాజులు ప్రకటించారు. ఈ ఘటనపై సోమవారం పాఠశాల హెచ్ఎం చాంద్‌పాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు జనార్దన్‌రెడ్డితోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంట ఎండడంతో ప్రాణం తీసుకున్నాడు

రైతు బలవన్మరణం


సాయిమల్లయ్య

బచ్చన్నపేట: పంట ఎండిపోవడంతో మనోవేదనకు గురైన రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నారాయణపురంలో జరిగిన ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. రైతు పరిదె సాయి మల్లయ్య (42) తనకున్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో వరి పంట సాగు చేశాడు. ఇటీవల భూగర్భ జలాలు అడుగంటడంతో ఎకరం పొలం నీరందక ఎండిపోయింది. పంటను కాపాడుకోవడానికి రెండు బోర్లు వేయించినా నీరు రాలేదు. రూ.లక్ష వరకు అప్పులయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం సాయి మల్లయ్య వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. సోమవారం ఉదయం తొమ్మిది గంటల వరకు కూడా ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకుని ఉన్నాడు. విషయం తెలియగానే ఎస్ఐ సతీష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే సాయి మల్లయ్య మృతి చెందాడు. వ్యవసాయ భూమి యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల పరిధిలో ఉండడంతో అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గ్రహశకలాలపై నీటి జాడలు


తొలిసారిగా వెలుగులోకి • అంతరిక్ష శోధనలో మేలిమలుపు

గ్రహశకలాలు పూర్తిగా పొడి శిలలతో కూడుకుని ఉంటాయని ఇప్పటి దాకా సైంటిస్టులు భావించేవారు. కానీ అంతరిక్ష పరిశోధన చరిత్రలోనే తొలిసారిగా వాటిపై నీటి అణువుల జాడలను గుర్తించారు! సోఫియా (స్ట్రాటోస్పియరిక్ అబ్జర్వేటరీ ఫర్ ఇన్‌ఫ్రా రెడ్ ఆస్ట్రానమీ ఎయిర్‌బోర్న్ టెలిస్కోప్) టెలిస్కోప్ అందించిన డేటాను అధ్యయనం చేసిన మీదట వారు ఈ మేరకు ధ్రువీకరణకు వచ్చారు. ఈ అధ్యయన ఫలితాలు ప్లానెటరీ సైన్స్ జర్నల్లో సోమవారం ప్రచురితమయ్యాయి.

ఇలా చేశారు...

గ్రహశకలాలపై నీటిజాడను కనిపెట్టేందుకు సైంటిస్టులు పెద్ద ప్రయాసే పడాల్సి వచ్చింది...

- ముందుగా ఇన్‌ఫ్రా రెడ్ కిరణాలను దాదాపుగా పూర్తిగా అడ్డుకునే భూ వాతావరణానికి ఎగువన ఉండే స్ట్రాటోస్పియర్‌ను తమ కార్యక్షేత్రంగా ఎంచుకున్నారు.
- అవసరమైన మార్పుచేర్పులు చేసిన బోయింగ్ 747ఎస్‌పీ విమానంలో స్ట్రాటోస్పియర్ గుండా సోఫియా టెలిస్కోప్‌ను సుదీర్ఘకాలం ప్రాటు పయణింపజేశారు.
- ఎట్టకేలకు వారి ప్రయత్నం ఫలించింది. ఐరిస్, మస్సాలియా అనే గ్రహశకలాలపై నీటి అణువుల జాడను సోఫియా తాలూకు ఫెయింట్ ఆబ్జెక్ట్ కెమెరా (ఫోర్‌కాస్ట్) స్పష్టంగా పట్టిచ్చింది!
- సోఫియా కెమెరా కంటికి చిక్కిన నీటి పరిమాణం కనీసం 350 మిల్లీలీటర్ల దాకా ఉంటుందని అధ్యయన బృందం నిర్ధారించింది.
- ఈ గ్రహశకలాలు సూర్యుడి నుంచి ఏకంగా 22.3 కోట్ల మైళ్ల దూరంలో గురు, బృహస్పతి గ్రహాల మధ్యలోని ప్రధాన ఆస్టిరాయిడ్ బెల్ట్‌లో ఉన్నాయి.
- ఈ ఉత్సాహంతో సోఫియా కంటే అత్యంత శక్తిమంతమైన జేమ్స్ వెబ్ టెలిస్కోప్ ద్వారా మరో 30 గ్రహశకలాలపై నీటి జాడలను మరింత స్పష్టంగా కనిపెట్టే పనిలో నాసా సైంటిస్టులు తలమునకలుగా ఉన్నారు.



ఏమిటీ గ్రహశకలాలు...

ఒక్కమాటలో చెప్పాలంటే మన సౌర వ్యవస్థ రూపొందే క్రమంలో మిగిలిపోయిన అవశేషాలు. ఒకరకంగా సూర్యుడు, తన నుంచి నిర్ధారిత దూరాల్లో గ్రహాలు ఒక్కొక్కటిగా రూపొందే క్రమంలో మిగిలి విడిపోయిన వ్యర్థాల బాపతువన్నమాట. సౌర వ్యవస్థ ఏర్పడే క్రమంలో సూర్యుడికి కాస్త దూరంలో ఉన్న భూమి వంటి గ్రహాలు రాళ్లు తదితరాలకు ఆలవాలంగా మారితే సుదూరంలో ఉన్న యురేనస్, నెప్ట్యూన్ వంటివి నింపాదిగా చల్లబడి మంచు, వాయుమయ గ్రహాలుగా రూపుదిద్దుకుంటూ వచ్చాయట. గ్రహశకలాలు కోట్లాది ఏళ్ల క్రితం భూమిని విపరీతమైన వేగంతో ఢీకొన్న ఫలితంగానే మన గ్రహంపై నీరు ఇతర కీలక మూలకాలు పుట్టుకొచ్చాయని సైంటిస్టులు చాలాకాలం క్రితమే సిద్ధాంతీకరించారు. గ్రహశకలాలపై నీటి అణువుల ఉనికి దానికి బలం చేకూర్చేదేనని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ గ్రహశకలాల పరమాణు కూర్పును మరింత లోతుగా పరిశోధిస్తే అంతరిక్షంలో వీటి జన్మస్థానంపై ఇంకాస్త కచ్చితమైన నిర్ధారణకు రావచ్చన్నది సైంటిస్టుల భావన. అది అంతరిక్షంలో ఇతర చోట్ల నీరు తదితర కీలక మూలకాలతో పాటు జీవం ఉనికి కోసం చిరకాలంగా చేస్తున్న పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడగలదని వారంటున్నారు.

జాబిలిపై నీటి జాడలే స్ఫూర్తి...

గతంలో చంద్రునిపై నీటి జాడలను కనిపెట్టింది కూడా సోఫియానే! ఆ స్ఫూర్తితోనే అదే టెలిస్కోప్ సాయంతో గ్రహశకలాలపైనా నీటి జాడల అన్వేషణకు పూనుకున్నారు. నిజానికి ఈ అధ్యయనానికి సహ సారథ్యం వహించిన నాసా సైంటిస్టు డాక్టర్ మాగీ మెక్ ఆడమ్ ఈ గ్రహశకలాలపై గతంలోనే ఆర్ద్రీకరణ(హైడ్రేషన్) జాడలను కనిపెట్టారు. కానీ దానికి కారణం నీరేనా, లేక హైడ్రోక్సిల్ వంటి ఇతర అణువులా అన్న దానిపై మాత్రం స్పష్టతకు రాలేకపోయారు. ఆ అనుమానాలకు తాజా అధ్యయనం తెర దించిందని దానికి సారథిగా వ్యవహరించిన రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ అనీసియా అరెడొండో తెలిపారు. ''నిజానికి డాక్టర్ మెక్ ఆడమ్ తన పరిశోధనకు ఎంచుకున్న ఈ రెండు గ్రహశకలాలు పూర్తిగా సిలికేట్‌మయం. కనుక అవి పూర్తిగా పొడిబారినవే అయ్యుంటాయని తొలుత అనుకున్నాం. కానీ వాటిపై కనిపించింది నీరేనని మా పరిశోధనల్లో స్పష్టంగా తేలింది'' అని వివరించారు. 2020లో చంద్రుని దక్షిణార్ధ గోళంలో నీటి జాడలను సోఫియా నిర్ధారించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

బ్యాలెట్‌పై 'ఎక్స్' మార్కు ఎందుకేశారు?

- చండీగఢ్ రిటర్నింగ్ అధికారిని నిలదీసిన చీఫ్ జస్టిస్
- ప్రాసిక్యూట్ చేయాల్సిందేనని స్పష్టీకరణ
- నేటి విచారణకు రావాలంటూ అనిల్ మసీహ్‌కి ఆదేశం



న్యూఢిల్లీ: చండీగఢ్ మేయర్ ఎన్నిక సమయంలో బ్యాలెట్ పత్రాలను పాడుచేసిన ఆరోపణలను సుప్రీంకోర్టు సీరియస్‌గా తీసుకున్న విషయం తెలిసిందే. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకున్నందుకు గాను రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్‌ను ప్రాసిక్యూట్ చేయాలని పేర్కొంది. అనిల్ మసీహ్‌ను ప్రశ్నించడం ద్వారా, రిటర్నింగ్ అధికారిని దేశ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ క్రాస్ ఎగ్జామినేట్ చేయడం స్వతంత్ర భారత చరిత్రలో మొదటిసారిగా భావిస్తున్నారు. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. చండీగఢ్ మేయర్‌గా ఎన్నికైన మనోజ్ సోంకార్ రాజీనామా, ఆప్ కౌన్సిలర్లు ముగ్గురు ఆదివారం బీజేపీ పంచన చేరినట్లు వచ్చిన వార్తలపై స్పందిస్తూ.. అభ్యర్థులను ప్రలోభ పెట్టడాన్ని తీవ్రమైన అంశంగా పేర్కొంది. తాజాగా ఎన్నికలు జరపటానికి బదులుగా కొత్త రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణంలో మరోసారి ఓట్లను లెక్కించడం మంచిదని భావిస్తున్నట్లు తెలిపింది. అయితే, మంగళవారం బ్యాలెట్ పత్రాలను పరిశీలించాకే ఈ అంశంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

నిజాయతీగా సమాధానమివ్వండి

సోమవారం విచారణ సందర్భంగా జస్టిస్ డీవై చంద్రచూడ్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన అనిల్ మసీహ్‌ను కొన్ని ప్రశ్నలు సంధించారు. 'ఇది చాలా తీవ్రమైన వ్యవహారం. నిజాయతీగా సమాధానాలు చెప్పకుంటే ప్రాసిక్యూట్ చేస్తాం. ఆ ఫుటేజీ చూశాం. మీరు బ్యాలెట్ పేపర్లపై క్రాస్ మార్కులు పెడుతూ కెమెరా వైపు ఎందుకు చూస్తున్నారు? ఎందుకు క్రాస్ మార్కులు పెట్టారు?' అని అడిగారు. ఎనిమిది బ్యాలెట్ పేపర్లపై క్రాస్ మార్కు పెట్టింది నిజమేనని మసీహ్ అంగీకరించారు. అవి అప్పటికే పాడైపోయి ఉన్నందున, వేరు చేసేందుకే అలా చేశాన'ని చెప్పారు. 'బ్యాలెట్ పేపర్లపై మీరు కేవలం సంతకం మాత్రమే చేయాలి. అలాంటప్పుడు వాటినెందుకు పాడు చేశారు? బ్యాలెట్ పేపర్లపై రిటర్నింగ్ అధికారులు ఇతరత్రా మార్కులు వేయొచ్చని ఏ నిబంధనల్లో ఉంది?'అని సీజేఐ అడిగారు. ఎన్నికల ప్రక్రియలో కలుగ జేసుకున్నందుకు మసీహ్‌ను ప్రాసిక్యూట్ చేయాల్సిందేనని చండీగఢ్ యంత్రాంగం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతానుద్దేశించి సీజేఐ పేర్కొన్నారు. మంగళవారం జరిగే విచారణకు కూడా హాజరుకావాలని అనిల్ మసీహ్‌ను ఆదేశించారు. ధర్మాసనంలో జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ఉన్నారు.

బ్యాలెట్ పత్రాలు, కౌంటింగ్ వీడియో పరిశీలిస్తాం

బ్యాలెట్ పత్రాలతోపాటు ఎన్నిక ప్రక్రియకు సంబంధించిన మొత్తం వీడియో ఫుటేజీని తమకు పంపించాలని పంజాబ్, హరియాణా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది. రికార్డులను సురక్షితంగా తీసుకువచ్చేందుకు ప్రత్యేకంగా ఒక న్యాయాధికారికి బాధ్యతలు అప్పగించాలని, పటిష్ట బందోబస్తు నడుమ ఆయన్ను ఢిల్లీకి పంపాలని స్పష్టం చేసింది.

ఏం జరిగిందంటే..?

జనవరి 30వ తేదీన మేయర్ ఎన్నికలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎనిమిది ఓట్లను చెల్లనివిగా రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్ ప్రకటించడం, బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకార్ చేతిలో ఆప్-కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి నాలుగు ఓట్ల తేడాతో ఓటమిపాలవడం తెలిసిందే. బీజేపీ మైనారిటీ సెల్‌కు చెందిన అనిల్ మసీహ్ కావాలనే ఓట్లను చెల్లనివిగా ప్రకటించారని ఆప్ ఆరోపించింది. కెమెరా వైపు చూసుకుంటూ ఆప్ కౌన్సిలర్లకు చెందిన బ్యాలెట్ పేపర్లపై మసీహ్ 'ఎక్స్' మార్కువేస్తున్న ఫుటేజీని ఆప్ కోర్టుకు సమర్పించింది. ఈ నెల 5వ తేదీన జరిగిన విచారణ సందర్భంగా రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్ చర్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది.

అదే ప్రతిష్టంభన

- ఐదేళ్లు మద్దతు ధర: కేంద్రం
- తిరస్కరించిన రైతు సంఘాలు
- రేపటి నుంచి 'ఢిల్లీ చలో' కొనసాగుతుందని ప్రకటన



కేంద్రం ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు ప్రకటిస్తున్న నేతలు పంథేర్, దల్లేవాల్

చండీగఢ్: కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కు చట్టబద్ధత తదితర డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వానికి, రైతు సంఘాలకు మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. సమస్య పరిష్కారానికి కేంద్ర మంత్రుల కమిటీ చేసిన తాజా ప్రతిపాదనలను కూడా రైతు సంఘాల నేతలు తిరస్కరించారు. అవి రైతులకు మేలు చేసేవి కాదని నేతలు జగ్‌జీత్‌సింగ్ దల్లేవాల్, శర్వాన్ సింగ్ పంథేర్ తదితరులు సోమవారం కుండబద్దలు కొట్టారు. ప్రతిపాదనలపై సంఘాలన్నీ చర్చించుకున్న మీదట ఈ నిర్ణయానికి వచ్చినట్టు స్పష్టం చేశారు. తమ 'ఢిల్లీ చలో' ఆందోళన బుధవారం ఉదయం 11 నుంచి శాంతియుతంగా కొనసాగుతుందని ప్రకటించారు. దాంతో సమస్య మొదటికొచ్చింది.

రైతు సంఘాలతో ఆదివారం సాయంత్రం మొదలైన కేంద్ర మంత్రుల కమిటీ నాలుగో దశ చర్చలు అర్ధరాత్రి తర్వాత ముగిశాయి. చర్చల్లో మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండా, నిత్యానంద రాయ్‌తో పాటు పంజాబ్ ముఖ్యమంత్రి, ఆప్ నేత భగవంత్ మాన్ కూడా పాల్గొన్నారు. 'ఐదేళ్ల ఒప్పంద' ప్రతిపాదనను మంత్రులు తెరపైకి తెచ్చారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న రైతుల నుంచి పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, పత్తి పంటలను ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని చెప్పారు. ఆ పంటలకు ఐదేళ్లపాటు ఎంఎస్పీ చెల్లింపుకు సుముఖత వ్యక్తం చేశారు. వారి నుంచి ఎంత పంటనైనా కొనుగోలు చేస్తామన్నారు. ఇది వినూత్నమైన ఆలోచన అని అనంతరం గోయల్ మీడియాతో చెప్పారు. ''ఐదేళ్లపాటు ఎంఎస్పీకి ఆయా పంటల కొనుగోలుకు ఎన్సీసీఎఫ్, నాఫెడ్ వంటి ప్రభుత్వ రంగ సహకార సంఘాలు రైతులతో ఒప్పందం కుదుర్చుకుంటాయి. ఇందుకు ఒక పోర్టల్ అభివృద్ధి చేస్తాం'' అని చెప్పారు. కనీస మద్దతు ధరకు ఇప్పటికిప్పుడు చట్టబద్ధత అసాధ్యమని తేల్చిచెప్పారు. ఈ ప్రతిపాదనపై రైతులు, నిపుణులతో చర్చించి రెండు మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని పంథేర్ సోమవారం ఉదయం చెప్పారు. అప్పటిదాకా 'ఢిల్లీ చలో' కార్యక్రమాన్ని నిలిపేస్తున్నామన్నారు. కానీ ప్రతిపాదనలను తిరస్కరిస్తున్నామంటూ రైతు నేతల నుంచి రాత్రికల్లా ప్రకటన వెలువడింది.

ఫ్రాన్స్ పాస్‌పోర్టు చాలా పవర్‌ఫుల్

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్టుల జాబితాలో ఫ్రాన్స్ పాస్‌పోర్టు అగ్రస్థానంలో నిలిచింది. 'హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ ర్యాంక్స్-2024' ఈ మేరకు పేర్కొంది. ఇందులో భారత పాస్‌పోర్టు 85వ స్థానంలో ఉంది. 2023 కంటే ఈసారి ఒక స్థానం పడిపోయింది. గతేడాది ఇండియా పాస్‌పోర్టుతో 60 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించే వీలుండేది. ఈ ఏడాది అది 62కు పెరిగినా ర్యాంకు మాత్రం పడిపోయింది! అత్యంత శక్తివంతమైన ఫ్రాన్స్ పాస్‌పోర్టు కలిగి ఉంటే 194 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. ఈ ఏడాది అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్టుల జాబితాలో ఫ్రాన్స్ తర్వాత జర్మనీ, ఇటలీ, జపాన్, సింగపూర్, స్పెయిన్ నిలిచాయి. పాకిస్తాన్ పాస్‌పోర్టు ఈసారి కూడా 106వ స్థానంలో నిలిచింది. బంగ్లాదేశ్ పాస్‌పోర్టు ర్యాంకు 101 నుంచి 102కు పడిపోయింది. చిన్నదేశమైన మాల్దీవుల పాస్‌పోర్టు ర్యాంకు 58. ఈ పాస్‌పోర్టు ఉంటే 96 దేశాలకు వీసా రహిత ప్రయాణం చేయవచ్చు.

ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్(ఐఏటీఏ) డేటా ఆధారంగా పాస్‌పోర్టులకు ర్యాంకులు ఇస్తుంటారు. ఇందుకోసం గత 19 ఏళ్ల డేటాను పరిగణనలోకి తీసుకుంటారు. మొత్తం 199 పాస్‌పోర్టులకు ర్యాంకులు ఇస్తారు. వీసా లేకున్నా తమ దేశంలో పర్యటించే అవకాశం కల్పిస్తున్న దేశాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2006లో సగటున 58 దేశాల్లో వీసా రహిత ప్రయాణ సౌలభ్యం ఉండేది. ఇప్పుడు ఆ సంఖ్య 111కు చేరింది.

మాది రైతు ప్రభుత్వం

- ప్రకృతి సాగు, తృణధాన్యాలకు మరింత ప్రోత్సాహం: మోదీ
- తృణధాన్యాలపై భారీగా పెట్టుబడులకు ఇదే సమయం
- ప్రకృతి వ్యవసాయంతో మన నదులను కాపాడుకోవాలి



లక్నో/సంభాల్/న్యూఢిల్లీ: భారతీయ ఆహార ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా డైనింగ్ టేబుళ్లపై ఉండాలన్నదే మనందరి ఉమ్మడి లక్ష్యమని, ఆ దిశగా కలిసికట్టుగా కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగాన్ని నూతన మార్గంలోకి తీసుకెళ్లడానికి మన ప్రభుత్వం రైతన్నలకు తోడ్పాటునందిస్తోందని చెప్పారు. వారికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నట్లు స్పష్టం చేశారు. దేశంలో ప్రకృతి వ్యవసాయం, తృణధాన్యాల సాగును ప్రోత్సాహిస్తున్నట్లు చెప్పారు. సూపర్ ఫుడ్ అయిన తృణధాన్యాలపై పెట్టుబడులకు ఇదే సరైన సమయమని సూచించారు. ఉత్తరప్రదేశ్‌లో రూ.10 లక్షల కోట్లకుపైగా విలువైన 14,000 ప్రాజెక్టులకు ప్రధాని మోదీ సోమవారం శంకుస్థాపన చేశారు. మరికొన్నింటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఉత్తరప్రదేశ్‌లో గంగా నది పరివాహక ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. దీనివల్ల రైతులు లబ్ధి పొందడంతోపాటు నది సైతం కాలుష్యం నుంచి బయటపడుతుందని పేర్కొన్నారు. మన నదుల పవిత్రను కాపాడుకోవాలంటే ప్రకృతి వ్యవసాయం చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. ఆహార శుద్ధి రంగంలో లోపాలు అరికట్టాలని సంబంధిత పరిశ్రమ వర్గాలకు సూచించారు. స్వచ్ఛమైన ఉత్పత్తులు అందించాలని కోరారు. 'జీరో ఎఫెక్ట్, జీరో డిఫెక్ట్' అనే విధానంతో పనిచేయాలన్నారు. సిద్ధార్థనగర్ జిల్లాలో పండిస్తున్న కలానమాక్ బియ్యం, చందౌలీలో పండిస్తున్న బ్లాక్ రైస్ గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ రెండు రకాల బియ్యం విదేశాలకు పెద్ద ఎత్తున ఎగుమతి అవుతున్నట్లు తెలిపారు. మన ఆహార ఉత్పత్తులను ప్రపంచం నలుమూలలకూ చేర్చే సమ్మిళిత ప్రయత్నంలో ఇదొక భాగమని అన్నారు. వ్యవసాయ రంగంలో రైతులతో కలిసి పనిచేయాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. యూపీలో ప్రభుత్వ అలసత్వానికి చరమగీతం పాడి పెట్టుబడులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నామన్నారు. సంభాల్ జిల్లాలో శ్రీకల్కి ధామ్ ఆలయ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళుర్పించారు.

పుతిన్‌పై పోరాటమే..

రష్యా ప్రతిపక్ష నేత నవాల్నీ భార్య ప్రతిన



మాస్కో: రష్యా ప్రభుత్వం, అధ్యక్షుడు పుతిన్‌పై పోరాటం కొనసాగిస్తానని ఇటీవల మృతి చెందిన ప్రతిపక్ష నేత అలెక్సీ నవాల్నీ భార్య యూలియా నవాల్నయా ప్రతిజ్ఞ చేశారు. సోమవారం బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో పలువురు ఈయూ నేతలను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మీడియా ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు. భర్త నవాల్నీ అడుగుజాడల్లోనే నడుస్తానన్నారు. ఆయన్ను సుదూర ప్రాంతంలో ఉండే జైలుకు పంపి పొట్టన పెట్టుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పుతిన్‌ను, ఈ పాపంలో పాలు పంచుకున్న వారందరినీ శిక్షించేదాకా పోరాటం కొనసాగిస్తానన్నారు. నవాల్నీ మృతదేహాన్ని ఆయన తల్లికి అప్పగించేందుకు కూడా అధికారులు నిరాకరిస్తున్నారని, సాక్ష్యాలు దొరక్కుండా చేయడమే వారి ఉద్దేశమని ఆరోపించారు.

ప్రజల భాగస్వామ్యం లేనిదే అభివృద్ధి అసాధ్యం

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ

అమేథీ: దేశ బడ్జెట్‌లో వెచ్చించే ప్రతి వంద రూపాయల్లో జనాభాలో మూడింట రెండొంతులున్న దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు, పేదలకు దక్కేది కేవలం రూ.6 మాత్రమేనని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ వర్గాలకు ఇంతటి తీవ్ర అన్యాయం జరుగుతున్నందువల్లే దేశం పురోగతి సాధించడం లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే కులగణన చేపట్టి, సంపద వనరులు అందరికీ సమానంగా అందేలా న్యాయం జరిగిలా చూస్తామన్నారు. సంపద వనరుల మ్యాపింగ్ ద్వారా ఎవరికి ఎంత సంపద ఉందో తెలుసుకుంటామన్నారు. దేశాన్ని పరిపుష్టంగా మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ చర్య చర్యలు తీసుకుంటుందని వివరించారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా సోమవారం రాహుల్ గాంధీ అమేథీలో జరిగిన ర్యాలీలో మాట్లాడారు. అనంతరం కార్యక్రమంలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే మాట్లాడారు. ప్రధాని మోదీ ఇచ్చే గ్యారెంటీలు ఆయన సన్నిహితులైన ఇద్దరు ముగ్గురు బడా పారిశ్రామికవేత్తలకే తప్ప రైతులు, కార్మికులు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ప్రజలకు కాదని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వస్తే రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు.



సోమవారం యూపీలోని ప్రతాప్‌గఢ్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్రలో అభిమానులతో రాహుల్

ఒంటరిగా పోటీకి దిగండి: స్మృతి ఇరానీ

కేంద్ర మంత్రి, బీజేపీ నేత స్మృతి ఇరానీ కూడా సోమవారం అమేథీలో పర్యటించారు. అమేథీలో పర్యటిస్తున్న రాహుల్‌కు నిర్మానుష్యంగా ఉన్న వీధులే స్వాగతం పలికాయన్నారు. రాహుల్‌కు చేతనైతే అమేథీలో ఒంటరిగా పోటీ చేసి గెలవాలని ఆమె సవాల్ విసిరారు. 2019 ఎన్నికల్లో ఇరానీ చేతిలో రాహుల్ ఓటమి పాలైన విషయం తెలిసిందే. అంతకుముందు 15 ఏళ్లపాటు రాహుల్ అమేథీ ఎంపీగా కొనసాగారు.

కేజ్రీవాల్ ఆరో'సారీ'...


ఈడీ సమన్లను పట్టించుకోని వైనం

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ ఆరో విడత సమన్లకు కూడా సీఎం కేజ్రీవాల్ స్పందించలేదు. సోమవారం విచారణకు హాజరుకాలేదు. పదేపదే నోటీసులిచ్చే బదులు కోర్టు ఉత్తర్వులు వెలువడేదాకా ఈడీ వేచి ఉండాలని కేజ్రీవాల్ అన్నారు. ఈడీ నోటీసులపై చట్ట ప్రకారమే బదులిస్తామని చెప్పారు. అయితే, ఆయనకు ఏడో విడత నోటీసులివ్వాలని ఈడీ యోచిస్తోంది. తమ నోటీసులను ఉద్దేశపూర్వకంగానే కేజ్రీవాల్ పట్టించుకోవడం లేదన్న ఈడీ వాదనను 17న జరిగిన విచారణ సందర్భంగా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. కేజ్రీవాల్ వైఖరి ప్రాథమికంగా అపరాధంగా భావించాల్సి ఉంటుందని కోర్టు పేర్కొన్నట్లు ఈడీ వర్గాలు చెబుతున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేజ్రీవాల్ బిజీగా ఉన్నందున ఈ కేసు విచారణను మార్చి 16వ తేదీ వరకు కోర్టు వాయిదా వేసింది. 16న కోర్టు ఎదుట కేజ్రీవాల్ హాజరవుతారని ఆయన లాయర్ హామీ ఇచ్చారు.

వధువుకి వరుడి పాదాభివందనం

గౌహతి: హిందూ సంప్రదాయంలో పెళ్లి తర్వాత వరుడి పాదాలను వధువు తన రెండు చేతులతో తాకి నమస్కరించడం ఆనవాయితీ. అస్సాం రాజధాని గౌహతిలో మాత్రం ఇందుకు విరుద్ధంగా జరిగింది. వివాహ ఘట్టంలో కల్లోల్ దాస్ అనే వరుడు నూతన వధువు కాళ్లను తాకి, శిరస్సు వంచి నమస్కరించాడు. చుట్టూ ఉన్న బంధుమిత్రులంతా చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కల్లోల్ దాస్ స్వయంగా షేర్ చేసిన ఈ వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో చర్చనీయాంశంగా మారింది. లక్షలాది మంది తిలకించారు. తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పెళ్లిలో తొలుత నూతన వధువు తన భర్త కల్లోల్ దాస్‌కు పాదాభివందనం చేసింది. తర్వాత అతడు తన భార్యకు కాళ్లను తాకి నమస్కరించాడు. ఈ వ్యవహారాన్ని సోషల్ మీడియాలో కొందరు ప్రశంసిస్తుండగా, మరికొందరు విమర్శలు చేస్తున్నారు. తన భార్యను ఎంతగానో గౌరవిస్తున్నానని, అందులో భాగంగానే పెళ్లిలో ఆమెకు పాదాభివందనం చేశానని కల్లోల్ దాస్ ప్రతిస్పందించాడు.

సెనేట్ బరిలో భారతీయ అమెరికన్ అశ్విన్



వాషింగ్టన్: జనరేషన్ జెడ్‌కు చెందిన భారతీయ అమెరికన్ యువకుడు అశ్విన్ రామస్వామి(24) జార్జియా సెనేట్ సీటుకు పోటీ పడుతున్నాడు. తమిళనాడుకు చెందిన రామస్వామి తల్లిదండ్రులు ఐటీరంగ నిపుణులుగా 1990లో అమెరికాకు వలస వచ్చారు. 1997-2012 సంవత్సరాల మధ్య జన్మించిన వారినే జనరేషన్ జెడ్(జూమర్స్)గా పిలుస్తుంటారు. రాష్ట్ర, ఫెడరల్ చట్ట సభలకు పోటీ పడుతున్న మొట్టమొదటి భారతీయ అమెరికన్‌గా అశ్విన్ చరిత్ర సృష్టించాడు. రెండో తరానికి చెందిన భారతీయ అమెరికన్ అయిన అశ్విన్ జార్జియాలోని 48వ డిస్ట్రిక్ట్‌లో డెమోక్రాటిక్ పార్టీ తరఫున బరిలో నిలిచాడు. ఇతడు విజయం సాధించిన పక్షంలో జార్జియా సెనేట్‌లో జెన్ జెడ్‌కు చెందిన మొట్టమొదటి సెనేటర్‌గాను, కంప్యూటర్ సైన్స్‌తోపాటు లా డిగ్రీ కలిగిన ఏకైక జార్జియా సెనేటర్‌గా నిలుస్తాడు. ''నా తల్లిదండ్రులు ఇద్దరూ 1990లలో యూఎస్ వచ్చారు. అమ్మది చెన్నై, నాన్నది కోయంబత్తూరు.

కొత్తగా జూ, సఫారీలొద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అటవీ భూమిలో కొత్తగా జూలు లేదా సఫారీలను ఏర్పాటు చేయాలంటే ఇకపై తమ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అటవీ పరిరక్షణ చట్టానికి కేంద్రం తీసుకువచ్చిన సవరణలను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సోమవారం విచారించింది. చట్ట సవరణ అనంతరం దాదాపు 1.99 లక్షల చదరపు కిలోమీటర్ల అటవీ భూమిని ఇతర ప్రయోజనాల కోసం మళ్లించినట్లు ఈ సందర్భంగా న్యాయస్థానం దృష్టికి వచ్చింది. తమతమ పరిధిలో ఉన్న అటవీ భూముల వివరాలను మార్చి 31వ తేదీలోగా కేంద్ర అటవీ శాఖకు అందజేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ధర్మాసనం కోరింది.

యూపీలో కాంగ్రెస్‌కు 17 సీట్లు

ఓకే అంటేనే 'న్యాయ్' యాత్రలో పాల్గొంటా: అఖిలేశ్

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని మొత్తం 80 లోక్‌సభ స్థానాలకు గాను సీట్ల పంపిణీలో భాగంగా కాంగ్రెస్‌కు 17 స్థానాలను కేటాయిస్తున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)చీఫ్ అఖిలేశ్ యాదవ్ చెప్పారు. తమ ఆఫర్‌కు అంగీకరిస్తేనే ప్రస్తుతం రాష్ట్రంలో రాహుల్ గాంధీ సారథ్యంలో సాగుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్రలో పాల్గొంటానని ఆయన తెగేసి చెప్పారు. పొత్తులు తేలేదాకా యాత్రలో పాల్గొనబోనని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు వదిలేసే స్థానాల వివరాలను మాత్రం అఖిలేశ్ వెల్లడించలేదు. న్యాయ్ యాత్ర సోమవారం యూపీలోని అమేథీలో సాగింది. మంగళవారం రాయ్‌బరేలీలోకి ప్రవేశించనుంది. రాయ్‌బరేలీలో రాహుల్‌తో కలిసి భారత్ జోడో న్యాయ్ యాత్రలో పాల్గొంటానని ఇంతకుముందే అఖిలేశ్ ప్రకటించారు. ఆలోగానే తమ ఆఫర్‌కు అంగీకరించాలని ఎస్పీ చీఫ్ కోరారు.

ఢిల్లీలో రాజ్యాంగ సంక్షోభం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజ్యాంగ సంక్షోభం నెలకొందని సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ..బీజేపీ నుంచి ఎదురవుతున్న ఒత్తిళ్లు, బెదిరింపుల నేపథ్యంలో విధులు నిర్వర్తించలేమని అధికారులు చెబుతున్నారన్నారు. ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను లేకపోవడం, వాస్తవ అధికారాలన్నీ వేరే పార్టీకి చెందిన కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉండటమే ఈ సమస్యలకు మూలకారణమని వ్యాఖ్యానించారు. ఆ పార్టీ ఎన్నికైన ప్రభుత్వం పనిచేయాలని కోరుకోవడం లేదని పేర్కొన్నారు. వాటర్ బిల్లును క్లియర్ చేసేందుకు తీసుకువచ్చిన వన్‌టైం సెటిల్‌మెంట్ పథకాన్ని కొందరు అధికారులు అడ్డుకుంటున్నట్లు కేజ్రీవాల్ ఆరోపించారు. బీజేపీ నుంచి వస్తున్న ఒత్తిళ్లే ఇందుకు కారణమన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరి పోరు

లక్నో: ఇతర కూటములతో బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) జట్టుకట్టనుందంటూ వస్తున్న వార్తలను ఆ పార్టీ అధినేత్రి మాయావతి ఖండించారు. ఇటువంటి పుకార్లను నమ్మొద్దని ఆమె పార్టీ శ్రేణులను సోమవారం కోరారు. 'రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని బీఎస్పీ ఇప్పటికే పలుమార్లు ప్రకటించింది. అయినప్పటికీ, పొత్తుపై నిత్యం పుకార్లు షికారు చేస్తున్నాయి. బీఎస్పీ సాయం లేకుండా కొన్ని పార్టీలు మను గడ సాగించలేవనేందుకు ఇదే రుజువు' అని ఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఆధార్ రద్దుపై ప్రధానికి మమత లేఖ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో కొందరి ఆధార్ కార్డులను కేంద్రం తొలగిస్తోందంటూ ఆదివారం సీఎం మమతా బెనర్జీ ఆరోపించిన విషయం తెలిసిందే. ఆధార్ తొలగింపునకు కారణాలు తెలపాలంటూ సోమవారం ప్రధాని మోదీకి ఆమె లేఖ రాశారు. సామాన్య ప్రజలు ముఖ్యంగా ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీ వర్గాల వారి ఆధార్ తొలగింపుతో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని అందులో పేర్కొన్నారు. ఆధార్ కార్డుల డీయాక్టివేషన్ నిబంధనలకు విరుద్ధమని, ప్రజల హక్కులకు భంగం కలిగించడమేనని తెలిపారు.

అంగారకుడిపైకి 'ఇస్రో' హెలికాప్టర్!

న్యూఢిల్లీ: అరుణ గ్రహంపై మరిన్ని పరిశోధనలకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా అంగారకుడిపైకి మానవ రహిత ఎగిరే వాహనం(హెలికాప్టర్)ను పంపించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అమెరికా చెందిన 'నాసా' అభివృద్ధి చేసిన క్వాడ్‌కాప్టర్ తరహాలోనే ఇది పనిచేయనుంది. అంగారక గ్రహంపై పరిశోధనలకు అవసరమైన పేలోడ్లతో దానిపై ఉపరితలం ఇస్రో హెలికాప్టర్ చక్కర్లు కొడుతుంది. ఉపరితలం నుంచి 100 మీటర్ల ఎత్తు వరకు ఎగరగలదు. నాసా క్వాడ్‌కాప్టర్ అంగారకుడిపై 72 సార్లు చక్కర్లు కొట్టింది. భారత్ చేపట్టిన మంగళ్‌యాన్ మిషన్ జీవితకాలం 2022లో ముగిసింది. అందుకే హెలికాప్టర్ పంపించాలని నిర్ణయించారు. ఇందులోని పేలోడ్లలో టెంపరేచర్ సెన్సార్, హ్యూమిడిటీ సెన్సార్, ప్రెషర్ సెన్సార్, విండ్‌స్పీడ్ సెన్సార్, ఎలక్ట్రిక్ ఫీల్డ్ సెన్సార్‌తోపాటు అత్యాధునిక కెమెరాలు ఉంటాయి.

పపువా న్యూగినీ అల్లర్లలో 64 మంది బలి

పోర్ట్‌మోర్స్‌బీ: పసిఫిక్ ద్వీప దేశం పపువా న్యూగినీలో గిరిజన తెగల మధ్య జరిగిన పోరాటంలో 64 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇంగా ప్రావిన్స్‌లోని మారుమూల కొండప్రాంతంలో ఆదివారం ఈ దారుణం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన తెగి పడి ఉన్న మృతదేహాలు, ఓ పోలీస్ ట్రక్కు నిండా మృతదేహాలున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. చెట్ల నడుమ మరిన్ని మృతదేహాలు ఉండి ఉంటాయని ఓ అధికారి తెలిపారు. ఆ చుట్టుపక్కల ప్రాంతంలో తెగల పోరు ఇంకా కొనసాగుతున్నట్లుగా భావిస్తున్నామన్నారు. స్థానిక సికిన్, అంబులిన్, కేకిన్ తెగలకు తరతరాలుగా వైరం కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో ఏకే-47, ఎం4, ఏఆర్ 15, ఎం16 వంటి ఆధునిక రైఫిళ్లు వారి చేతుల్లో పడటంతో హింస తీవ్రరూపం దాల్చింది.

సాక్షి
కరీంనగర్
మంగళవారం | 20 ఫిబ్రవరి | 2024

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా హిందూవాహిని ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. నగర పురవీధులలో శివాజీ మహారాజ్ జై అంటూ నినాదాలు చేశారు. కాషాయ జెండాలు రెపరెపలాడాయి. కార్యక్రమంలో హిందూవాహిని బాధ్యులు తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్ కల్చరల్

కరీంనగర్‌లో ర్యాలీ తీస్తున్న హిందూవాహిని కార్యకర్తలు





శిశువును అప్పగిస్తున్న ఏసీపీ నరేందర్, సీఐలు వెంకటేశ్, సృజన్ రెడ్డి, రవీందర్

పిల్లలు లేరని శిశువును ఎత్తుకెళ్లింది!

కరీంనగర్ మాతాశిశు ఆస్పత్రిలో ఆదివారం కిడ్నాప్‌కు గురైన నవజాత శిశువు ఆచూకీ దొరికింది. కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఏసీపీ నరేందర్ నేతృత్వంలో కరీంనగర్ టూటౌన్, ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేసి కిడ్నాప్ చేసిన మహిళను గుర్తించారు. సంతానం లేకపోవడంతోనే శిశువును అపహరించినట్లు వెల్లడించారు.
– కరీంనగర్‌క్రైం,
– వివరాలు మెయిన్‌లో..



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

‘అడ్లూరి’కి తప్పిన ప్రమాదం

ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రయాణిస్తున్న కారు జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం అంబారిపేట వద్ద సోమవారం ఉదయం బోల్తా పడింది. ఈ ఘటనలో అడ్లూరి స్వల్పగాయాలతో బయటపడ్డారు. హైదరాబాద్ నుంచి ధర్మపురికి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో కారు పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. అప్పటికే కారు ఎయిర్‌బెలూన్ తెరుచుకోవడంతో లక్ష్మణ్‌కుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. గన్‌మెన్‌లు సంతోష్, ప్రశాంత్, డ్రైవర్ సంతోష్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి.
– గొల్లపల్లి, – వివరాలు మెయిన్‌లో..

ఆరిపోయిన ‘దియా’



దియాపటేల్ (ఫైల్)

చదువుకోవడానికి కాలేజీకి వెళ్లిన ఓ యువతిని లారీ కబళించింది. సోమవారం కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ నుంచి ఎలక్ట్రిక్ స్కూటీపై నగరంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కాలేజీకి దియాపటేల్(19)ను హైదరాబాద్ వెళ్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 14 టైర్ల లారీ వెనక నుంచి ఢీకొట్టింది. తీవ్రగాయాలైన ఆమెను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. తల్లిదండ్రులుల రోదనలు మిన్నంటాయి.
– కరీంనగర్‌రూరల్,– వివరాలు 8లో..

డీటీసీగా బాధ్యతలు తీసుకున్న పురుషోత్తం



డీటీసీ పురుషోత్తంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంవీఐలు, ఏఎంవీఐ

తిమ్మాపూర్(మానకొండూర్): ఉమ్మడి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పురుషోత్తం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయానికి వచ్చిన ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. కరీంనగర్ నూతన ఎంవీఐలు రవికుమార్, శ్రీకాంత్ చక్రవర్తి, ఏఎంవీఐ ప్రవంతి, హుజూరాబాద్ ఎంవీఐ వేణు విధుల్లో చేశారు. అనంతరం ఏవో గురుప్రసాద్, ఇన్‌చార్జి ఏవో అశోక్, సీనియర్ అసిస్టెంట్ సురేశ్, జూనియర్ అసిస్టెంట్ రవీందర్, కుమారస్వామి, రికార్డు అసిస్టెంట్ గంగాధర్, డీబీఏలు కరుణాకర్, దినేశ్, కృష్ణ తదితరులు వారికి పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

తీరని కన్నీటి వ్యథ!

- ప్రాణాలు ఇరుకు రోడ్డుపాలు
- రాజీవ్ రహదారిపై ప్రమాదకరంగా గుంటూరుపల్లి స్టేజీ
- గ్రామానికి చెందిన దాదాపు 20 మంది మృతి
- ప్రయాణికులు 60 మందికి పైనే..
- ఇంటి పెద్దదిక్కును కోల్పోయి చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు
- రేణికుంట–ఇరుకుల్ల వరకు బ్లాక్‌స్పాట్లు
- ఈ స్టేజీపై పట్టింపేది?



బొమ్మకల్ ఆర్‌యూబీ వద్ద ఇరుకు రోడ్డు

రాజీవ్ రహదారి గుంటూరుపల్లి స్టేజీ.. రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. ఇందుకు కారణం రోడ్డు సరిగ్గా ఇక్కడే ఇరుగ్గా ఉంటుంది. వేగంగా వచ్చే వాహనదారులకు ఇది తెలియకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లేవారిని కొట్టేస్తున్నారు. దీంతో ఇక్కడ అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎంతోమంది గాయపడుతున్నారు. ఫలితంగా వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. గ్రామస్తులు దశాబ్దాలుగా వేడుకుంటున్నా ప్రమాదాల నివారణకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేకపోవడం దురదృష్టకరం.

- గుంటూరుపల్లికి చెందిన కోరెం శ్రీనివాస్ కరీంనగర్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగి. గుంటూరుపల్లి స్టేజీ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో అతని వృద్ధ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

- ఇదే గ్రామానికి చెందిన 77 ఏళ్ల మహమ్మద్ హసన్ తన భార్యను రోడ్డుకు అవతలివైపు దించి తిరిగి వస్తుండగా.. వాహనం ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం అప్పు చేసి, రూ.4 లక్షలు ఖర్చు చేసినా ప్రాణం నిలవలేదు. దీంతో 70 ఏళ్ల ఆయన భార్య పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్తోంది.

అత్తమ్మకు పింఛన్ కూడా రావట్లే



మా మామ మహమ్మద్ హసన్. 2022 డిసెంబర్‌లో మా అత్తమ్మను రోడ్డు అవతలివైపు దించి తిరిగి వస్తుంటే ప్రమాదం జరిగింది. రూ.4 లక్షలు ఖర్చు చేసినా బతకలేదు. దీంతో అత్తమ్మ కూలీ పనులకు వెళ్తోంది. ఆమెకు పింఛన్ కూడా రావట్లే. – మహమ్మద్ జాఫర్

చెట్టంత కొడుకు దూరమైండు



నా కొడుకు శ్రీనివాస్ కరీంనగర్‌లోని ఓ వస్త్ర దుకాణంలో పనికి కుదిరిండు. పెళ్లి చేద్దాం అనుకునేలోపే.. స్టేజి మీద వాహనం గుద్దడంతో చనిపోయిండు. షాపు యజమాని కొంత ఆదుకున్నడు. మాకు ప్రభుత్వ పరిహారం రాలేదు. చెట్టంత కొడుకు దూరమైండు, బతికుంటే మనవళ్లతో ఆడుకుంటూ కాలం గడిపేవాళ్లం. కానీ, ఈ వయసులో దంపతులిద్దరం పనికి పోతున్నం. – కోరెం రాజవ్వ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కరీంనగర్ శివారు బొమ్మకల్ సమీపంలోని గుంటూరుపల్లి స్టేజీ గ్రామస్తుల పాలిట శాపంగా మారింది. ఇక్కడ రోడ్డు ఇరుగ్గా ఉండటంతో స్థానికులు, ఇతర ప్రాంతాలకు చెందినవారు అనుకోకుండా రోడ్డు ప్రమాదాల బారినపడి, ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ గ్రామంలో దాదాపు 1500 కుటుంబాలు నివసిస్తున్నాయి. గత ఐదారేళ్లలో దాదాపు 20 మంది గ్రామస్తులు స్థానిక స్టేజీ వద్ద జరిగిన ప్రమాదాల్లో మృతిచెందారని వారి స్నేహితులు తెలిపారు. దశాబ్దాలుగా ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడ లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని రేణికుంట నుంచి ఇరుకుల్ల వంతెన వరకు పలు ప్రాంతా లను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారని, ఇక్కడ మాత్రం సరైన చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఇంటర్ విద్యార్థిని బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద లారీ కింద నలిగి ప్రాణాలు కోల్పోవడంతో బ్లాక్‌స్పాట్ల అంశం మరోసారి చర్చకు వచ్చింది.

మృతుల సంఖ్య 80కి పైనే..

బొమ్మకల్ రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) సమీపంలో ఉన్న గుంటూరుపల్లి స్టేజీ ప్రాంతంలో రాజీవ్ రహదారి బాటిల్ నెక్(సీసామూతి) ఆకారంలో ఉంది. కరీంనగర్–గోదావరిఖని, గోదావరిఖని–కరీంనగర్ నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డు అనుకూలంగా ఉండటంతో 80 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నాయి. గుంటూరుపల్లి స్టేజి వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలను, రోడ్డు దాటుతున్న స్థానికులను ఢీకొంటున్నాయి. ఇలా 2016 నుంచి ఇప్పటివరకు ఈ రోడ్డుపై మృతిచెందినవారి సంఖ్య 80కి పైనే ఉంది. 114 మంది గాయపడ్డారు.

వృద్ధాప్యంలో కూలీ పనులకు..

గుంటూరుపల్లి స్టేజీ ప్రమాదాలు వందల కుటుంబాల్లో విషాదం నింపుతున్నాయి. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయినవి కొన్నయితే, గాయపడి, చికిత్స పొంది, ఆర్థికంగా చితికిపోయినవి మరికొన్ని. చేతికి అందివచ్చిన కుమారులను కోల్పోయి, వృద్ధాప్యంలో కూలీ పనులకు వెళ్తున్నవారు ఏం పాపం చేశామంటూ నిత్యం కంటతడి పెడుతున్నారు.

బ్లాక్‌స్పాట్ల నివేదికపై చర్యలేవి?

కమలాసన్‌రెడ్డి సీపీగా ఉన్న సమయంలో కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. అప్పటి ఆర్టీఏ అధికారులతో కలిసి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టారు. రేణికుంట, కొత్తపల్లి జంక్షన్, నుస్తులాపూర్, ఇందిరానగర్, ఎల్ఎండీ గెస్ట్‌హౌస్, చేపల కాలనీ, అలుగునూరు, ఎన్టీఆర్ స్టేడియం, ఆటోనగర్, కేన్సర్ హాస్పిటల్ రోడ్, లారీ అసోసియేషన్ రోడ్, బొమ్మకల్ ఫ్లైఓవర్, లిమ్రా ఐస్ ఫ్యాక్టరీ, చెలిమెడ ఆస్పత్రి సమీపం, ఇరుకుల్ల క్రాస్‌రోడ్ ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. దీనిపై అప్పట్లో సమగ్ర నివేదిక కూడా రూపొందించారు. కానీ ఇప్పటివరకు చర్యలు లేవు.

సుదర్శన హవనం.. బలిహారణం



సింహవాహనంపై వేంకటేశ్వర స్వామి ఊరేగింపు

- వైభవంగా కొనసాగుతున్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు
- నేడు మహాపూర్ణాహుతి, పుష్పయాగం



పూజలు చేస్తున్న మంత్రి ప్రభాకర్, కుటుంబీకులు



సహస్ర దీపాలంకరణకు హాజరైన భక్తులు



ఎంపీ సంజయ్ సతీమణి అపర్ణ..



భక్తి గీతం ఆలపిస్తున్న సింగర్ సునీత

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ మార్కెట్ రోడ్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సప్తమ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం యాగశాలలో మూలమంత్ర సుదర్శన హవనం నిర్వహించారు. బలిహరణం, తీర్థగోష్టి జరిపారు. ఆదివారం రాత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలయంలోనే నిద్రించి, మరుసటిరోజు ఉదయం సుప్రభాత, అన్నకూటోత్సవంలో కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. స్వామివారిని ఎంపీ బండి సంజయ్ సతీమణి అపర్ణ దర్శించుకున్నారు. శ్రీవారు హనుమత్ అవతారంలో ఉదయం సింహవాహనంపై, సాయంత్రం హనుమత్ వాహనంపై విహరించారు. రాత్రి సినీ నేపథ్య గాయకులు సునీత, కారుణ్య హాజరై, భక్తిగీతాలు ఆలపించారు. మంగళవారం మహాపూర్ణాహుతి, పుష్పయాగం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో వెంకన్న, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పురమల్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కల్చరల్ ఆర్గనైజర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో వివిధ భజన మండళ్ల సభ్యులు ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు, సంగీత కచేరీలు, నృత్య ప్రదర్శనలు, పాటలు అలరించాయి.



నృత్యం చేస్తున్న కళాకారిణి



స్వామివారిని ఊయలలో ఊపుతున్న ఆలయ కమిటీ సభ్యులు

పాత వ్యాపారులకే ప్రాధాన్యం

- షట్టర్ల కేటాయింపుపై మేయర్ సునీల్‌రావు హామీ

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ప్రహరీని ఆనుకొని నగరపాలక సంస్థ నిర్మించిన దుకాణ సముదాయంలో పాత వ్యాపారులకే ప్రాధాన్యం ఇస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు హామీ ఇచ్చారు. గతంలో ఇదే ప్రాంతంలో వ్యాపారాలు చేసుకున్న తమకు దుకాణ సముదాయంలో అవకాశం ఇవ్వాలని వీధి వ్యాపారులు కోరారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ స్మాల్ ట్రేడర్స్, ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భగత్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మేయర్‌ను కలిసి, వినతి పత్రం అందించారు. అంతకుముందు కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి, విన్నవించారు. తాము ఏళ్లుగా ఇక్కడే వ్యాపారాలు చేసుకుంటున్నామని, దుకాణ సముదాయం నిర్మించడంతో ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మేయర్ దుకాణ సముదాయంలో 126 షట్టర్లు ఉన్నాయని తెలిపారు. అద్దె ప్రాతిపదికన వాటి కేటాయింపులో గతంలో అక్కడ వ్యాపారం చేసుకున్న వారికి ప్రాధాన్యం ఇస్తామని, ఆ తర్వాతే మిగిలినవారికి కేటాయిస్తామన్నారు. వ్యాపారుల జాబితా తయారు చేస్తామని పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వూట్ల రాజు, ప్రధాన కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీధి వ్యాపారులు

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

- వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

కరీంనగర్ అర్బన్/కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులుండొద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, పెండింగ్ ఓటరు జాబితా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఓటరు జాబితాలో మార్పుచేర్పులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల వివరాలు పంపించాలని పేర్కొన్నారు. ఓటరు జాబితాపై ఏమైనా అనుమానాలుంటే రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేసుకొని, నివృత్తి చేసుకోవాలన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా జిల్లాలో ఎలాంటి ఇబ్బందులేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్డీవో మహేశ్వర్, డీపీవో రాంబాబు, డీఆర్డీవో శ్రీధర్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

చేనేత వస్త్రాలను ఆదరించాలి

నేతన్నలకు ఉపాధి కల్పించేందుకు అందరూ చేనేత వస్త్రాలను ఆదరించాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. సోమవారం చేనేత సహకార సంఘాల ప్రతినిధులు ఆమెను కలెక్టరేట్‌లో కలిశారు. అన్ని రకాల చేనేత ఉత్పత్తులను చూపించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. చేనేత వస్త్రాలు చాలా బాగున్నాయని అన్నారు. వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. అలాగే, ప్రతీ సోమవారం అధికారులందరూ చేనేత వస్త్రాలు ధరించేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ప్రజావాణి సందర్భంగా చేనేత వస్త్రాల స్టాళ్లు ఏర్పాటు చేసుకొని, విక్రయించుకోవాలని సూచించారు. హ్యాండ్లూమ్స్ ఏడీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: జిల్లాలోని మైనార్టీ విద్యార్థులు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్–2023కి ఈ నెల 20 నుంచి మార్చి 20 సాయంత్రం 5 గంటల్లోగా తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. విదేశాల్లో(యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, సౌత్ కొరియా) పీజీ, పీహెచ్‌డీ చదువుకునేవారు ఈ స్కీంకు అర్హులన్నారు. 1 ఆగస్టు 2023 నుంచి 31 డిసెంబర్ 2023 మధ్య విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత పత్రాలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏప్రిల్ 15 సాయంత్రం 5 గంటల్లోగా అందించాలని సూచించారు. స్కాలర్‌షిప్ రూ.20 లక్షల వరకు వస్తుందన్నారు. ఆదాయ పరిమితి రూ.5 లక్షలు మించరాదని, వివరాలకు 99897 27382 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రజావాణికి భూసమస్యల వెల్లువ

- పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరిన బాధితులు
- ‘ధరణి’పై పలు ఫిర్యాదులు
- 186 అర్జీలు వచ్చాయన్న కలెక్టరేట్ ఏవో



దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్

కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 186 అర్జీలు వచ్చాయి. దరఖాస్తులు ఇస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతిని వేడుకున్నారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్ అర్జీలు తీసుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 27, డీపీవో కార్యాలయానికి 12, ఆర్డీవో కార్యాలయానికి 16, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఆఫీస్‌కు 12, కొత్తపల్లి తహసీల్దార్ ఆఫీస్‌కు 10, రామడుగు తహసీల్దార్ కార్యాలయానికి 07, వారధి సొసైటీకి 06, ఇతర శాఖలకు 96 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టరేట్ ఏవో సుధాకర్ తెలిపారు.

‘ధరణి’ పాస్‌బుక్‌లో భూమి లేదు



మా గ్రామంలోని సర్వే నంబర్ 307లో నాకు 0.06 గుంటల భూమి ఉంది. ఇది పాత పాస్‌బుక్‌లో ఉండగా ధరణి వచ్చాక ఇచ్చిన పాస్‌బుక్‌లో లేదు. ఇదెక్కడి అన్యాయమని అధికారులను కలిస్తే సరిచేస్తామంటూ తిప్పుకుంటున్నారు. మోకాపై విచారణ జరిపి, న్యాయం చేయాలని కోరితే పట్టించుకోవడం లేదు. ధరణి పహణీలో నమోదు చేయాల్సినవారు తప్పు చేస్తే నాకెందుకు శిక్షో తెలియడం లేదు.
– ఎం.మల్లేశం, ఖాజీపూర్, కరీంనగర్ రూరల్

సాగు చేస్తున్న.. రికార్డులో పేరు లేదు



మా గ్రామ శివారులోని సర్వే నంబర్ 444/రూలో నాకు 1.22 ఎకరాల భూమి ఉంది. 22 ఏళ్ల క్రితం రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేయగా రికార్డుల్లో, మోకాపై ఉండి వ్యవసాయం చేసుకుంటున్నాను. కానీ, ఎవరి నిర్లక్ష్యమో తెలియదు. 444/లుగా బై నంబర్ మార్చి, వేరే వారి పేరు చేర్చారు. భూమిని అనుభవిస్తూ కూడా రికార్డులో పేరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న. కలెక్టర్ స్పందించి, న్యాయం చేయాలె.
– కొంతం భూమయ్య, నగునూరు, కరీంనగర్ రూరల్

పాత భూమి వివరాలు లేవు



ధరణి వచ్చుడేమో గానీ నా భూమి వివరాలు రికార్డులో లేవు. ఇదెక్కడి అన్యాయమని అధికారులను కలిస్తే ఉపశమన మాటలే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. పాత పాసుపుస్తకంలో సర్వే నంబర్ 423లో 0.27, 414లో 1.20 ఎకరాల భూమి ఉంది. కానీ, సదరు భూ వివరాలు కొత్త పాసుపుస్తకంలో లేవు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న.
– కొత్త మల్లయ్య, చెర్లపల్లి, గంగాధర

క్లుప్తంగా

డ్రామా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక



కరీంనగర్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి డ్రామా పోటీల్లో రామడుగు మండలం రుద్రారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జెండర్ డిస్క్రిమినేషన్ అనే డ్రామా అంశంలో పాల్గొని సత్తాచాటిన గోనే వైష్ణవి (9వ తరగతి), పల్లి ప్రణయ, పింగిలి అనన్య, వెలుమల సహస్ర, కొక్కుల శివమణి (8వ తరగతి)లను గైడ్ టీచర్ శ్రావణ్‌కుమార్, డైట్ ప్రిన్సిపాల్ పి.మొండయ్య, వినయధర్ రాజు, సీహెచ్ ప్రద్యుమ్నకుమార్, జి.శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీపీవీ రంగనాథశర్మ అభినందించారు.

కల్వర్టు వద్ద లారీ బోల్తా



మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. మధ్యప్రదేశ్ నుంచి గోధుమల లోడ్‌తో వరంగల్ వైపు వెళ్తున్న లారీ మేడిపల్లి – వెంకట్రావుపేట మధ్య కల్వర్టు వద్ద ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఏవరికీ ఏమీ కాలేదు. లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో రెండుప్రమాదాలు చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రాయికల్:రాయికల్ మండలం రామాజీపేటలో అక్రమంగా నిలువ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్ య్యాన్ని పట్టుకున్నట్లు జగిత్యాల, మల్యాల సివిల్ సప్‌లై డీటీలు వరప్రసాద్, శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. రామాజీపేటలో బియ్యం నిలువ చేశారనే పక్కా సమాచారంతో దాడులు చేశామని, ఇందులో 12 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని వారు తెలిపారు. దాడుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పద్మయ్య పాల్గొన్నారు.

మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి అదృశ్యం



చంద్రారెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన నేవూరి చంద్రారెడ్డి(70) సోమవారం ఉదయం అదృశ్యమయ్యాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. పోలీసుల వివరాలు.. చంద్రారెడ్డి ఏడాదిగా మతిస్థిమితం సరిగా లేకుండా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడికి భార్య లక్ష్మి, కుమారులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కూతురు వెంకటవ్వ ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రైతే 'మార్కెట్'కు రాజు

- మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా వారే నియామకం
- మార్గదర్శకాలు వెలువరించిన ప్రభుత్వం
- పదవీకాలం మూడేళ్లు
- జిల్లాలో 7 మార్కెట్లు



కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

కరీంనగర్ అర్బన్: వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఇక రైతులే పాలకులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను వెలువరించగా.. వాటి ప్రకారం కొత్త కమిటీలు ఏర్పాటు కానున్నాయి. వ్యవసాయ మార్కెట్లకు త్వరలోనే నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేస్తామని ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. గతంలో ఏడాది ఉండే పాలకవర్గ పదవీ కాలాన్ని రెండేళ్లకు పెంచారు. తాజాగా ఆరేసి నెలలు రెండుసార్లు పెంచాలని నిర్ణయం తీసుకోవడంతో ఇప్పుడు వచ్చే పాలకవర్గాల పదవీ కాలం మూడేళ్ల వరకు ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన పలువురు పదవుల కోసం ఇప్పటికే పైరవీలు మొదలుపెట్టారు. జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట, గంగాధర, గోపాల్‌రావుపేట, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్ మార్కెట్లుండగా రిజర్వేషన్ విధానంలో పాలకవర్గాలను ప్రకటించనున్నారు.

18 మంది సభ్యులతో కమిటీ

తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశుగణాల మార్కెట్ల చట్టం–1966 సెక్షన్–5(1), ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం ప్రతీ మార్కెట్‌కు 18 మంది సభ్యులతో కూడిన మార్కెట్ కమిటీ ఏర్పాటవుతుంది. దీని పరిధిలో సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తిదారులు, పశుగణం, పశుగణ ఉత్పత్తిదారులు ఉంటారు. వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాక(మైనార్టీ) వర్గాలు, మహిళలై ఉండాలి. అలాగే కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు ఉండాలి. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నలుగురు ఉండనున్నారు. మార్కెట్ పరిధిలోని పీఏసీఎస్, సహకార మార్కెటింగ్ సంఘాల నుంచి ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారుల్లో ఒక సభ్యుడు, జిల్లా వ్యవసాయ/ఉద్యాన/పశుసంవర్ధక/మత్స్యశాఖ అధికారుల్లో ఒకరు, మార్కెట్ కమిటీ పరిధిలోని మేయర్/మున్సిపల్ చైర్‌పర్సన్ లేదా గ్రామ సర్పంచుల్లో ఒకరు సభ్యులుగా ఉండనున్నారు.

చైర్మన్, వైస్ చైర్మన్ నియామకం ఇలా..

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా 12 మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ చైర్మన్‌ను లైసెన్స్ ట్రేడర్స్ సభ్యుల నుంచి లేదా రైతు సభ్యుల నుంచి నియమించవచ్చు.

మార్కెట్లఆదాయాన్ని బట్టి గ్రేడింగ్

మార్కెట్‌ల ఆదాయాన్ని బట్టి గ్రేడింగ్ విధానం కొనసాగుతోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రధానంగా పంటల కొనుగోలు పరంగా పన్నుతో ఆదాయం లభిస్తుంది. ఆయా మార్కెట్ల ఆదాయాన్ని బట్టి ప్రభుత్వం గ్రేడ్ ఇస్తుంది. రూ.3 కోట్లకు పైగా ఆదాయం ఉంటే దాన్ని సెలక్షన్ గ్రేడ్‌గా పరిగణిస్తుండగా డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు ఉంటే స్పెషల్ గ్రేడ్‌గా పరిగణిస్తూ ఏడీ క్యాడర్ అధికారిని నియమిస్తారు. రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటే గ్రేడ్–1గా, రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఉంటే గ్రేడ్–2గా, రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉంటే గ్రేడ్–3గా పరిగణిస్తూ ఆయా గ్రేడ్ స్థాయిని బట్టి అధికారులను, రూ.25 లక్షల వరకు ఆదాయం లభిస్తే దానికి అసిస్టెంట్ సెక్రటరీ స్థాయి అధికారిని నియమిస్తారు. జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట మార్కెట్లు సెలక్షన్ గ్రేడ్ కాగా, చొప్పదండి స్పెషల్ గ్రేడ్, హుజూరాబాద్ గ్రేడ్–1, గంగాధర గ్రేడ్–3, మానకొండూరు, గోపాల్‌రావుపేట వేటి పరిధిలోకీ రావు.

రిజర్వేషన్లతో చైర్మన్ పదవులు

రిజర్వేషన్ల ప్రకారం చైర్మన్ పదవులు వరించనున్నాయి. ఆయా మార్కెట్లకు ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం చైర్మన్లను నియమించనున్నారు. కరీంనగర్ మార్కెట్ పాలకవర్గానికి బీసీ, జమ్మికుంట–ఎస్సీ మహిళా, మానకొండూరు–ఎస్టీ, గంగాధర–జనరల్ మహిళా, గోపాల్‌రావుపేట–జనరల్ మహిళా, చొప్పదండి–ఎస్సీ, హుజూరాబాద్– జనరల్ మహిళకు కేటాయించారు.

ఆరిపోయిన 'దియా'

- లారీ ఢీకొని డిగ్రీ విద్యార్థిని దుర్మరణం
- బొమ్మకల్ ఫ్లైఓవర్ సర్కిల్‌లో ఘటన



దియాపటేల్ (ఫైల్)

కరీంనగర్‌రూరల్: లారీ ఢీకొని ఓ విద్యార్థిని దుర్మరణం చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన వాసాని జగదీశ్ కొన్నేళ్ల క్రితం భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్ వచ్చి, ఇక్కడే ఉంటున్నాడు. స్థానికంగా కట్టెకోత మెషిన్ పని చేస్తున్నాడు. ఆయన పెద్ద కూతురు దియాపటేల్(19) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం 8 గంటలకు ఎలక్ట్రికల్ స్కూటీపై కాలేజీకి వెళ్తోంది. బొమ్మకల్ ఫ్లైఓవర్ సర్కిల్‌లో గోదావరిఖని నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 14 టైర్ల లారీ వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దియాపటేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంటకే మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యులు, సిబ్బందిని సస్పెండ్ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: ఎంసీహెచ్‌లో శిశువు అపహరణ నిర్లక్ష్యం వల్లే జరిగిందని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి బ్రామండ్లపల్లి యుగంధర్, అధ్యక్షుడు బోనగిరి మహేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. గతంలోనూ శిశువుల మిస్సింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయని, అయినా సిబ్బంది పనితీరులో మార్పు రావడం లేదన్నారు. తాజా సంఘటనకు డ్యూటీలో ఉన్న సెక్యూరిటీ గార్డు, జీఎన్ఎం, ఏఎన్ఎం, వైద్యులు, అధికారులను బాధ్యులను చేస్తూ వారిని సస్పెండ్ చేయాలని విన్నవించారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఔట్‌పోస్టు లేదని, ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీపైనే ఆధారపడటంతో భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చెంచల మురళి, నాయకులు పాల్గొన్నారు.

చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్నిక



అనూప్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జిల్లా కార్యదర్శి, అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారుడు కంకటి అనూప్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనూప్ కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెస్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయనను తెలంగాణ రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, కరీం, పెటా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ.యూనిస్ పాషా, జూడో సంఘం రాష్ట్ర సభ్యులు మహేందర్, సురేందర్ సింగ్, వికాస్, గౌతమ్, సందీప్ తదితరులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ వరంగల్, రంగారెడ్డి



పురుషుల విభాగంలో చాంపియన్‌గా నిలిచిన వరంగల్ జిల్లా జట్టు



మహిళల విభాగంలో చాంపియన్‌గా నిలిచిన రంగారెడ్డి జట్టు





తృతీయ స్థానంలో నిలిచిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పురుషుల, మహిళల జట్లు

- ద్వితీయస్థానాల్లో హైదరాబాద్, వరంగల్
- ఉమ్మడి కరీంనగర్ జట్లకు తృతీయ స్థానం
- ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: 52వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పురుషుల చాంపియన్‌గా వరంగల్ జట్టు, మహిళా చాంపియన్‌గా రంగారెడ్డి జిల్లా జట్లు నిలిచాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానం సాధించగా మహిళల విభాగంలో వరంగల్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానాలు సాధించాయి. కరీంనగర్‌లోని లయోలా జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిసాయి. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్‌లు హాజరై విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ క్రీడాకారులు ఇటీవల వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు ఎంపిక చేశామన్నారు. పోటీల పరిశీలకుడు దీపక్ ప్రసాద్, కరీంనగర్ జిల్లా యువజన క్రీడాధికారి శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మణ్, ప్రభాకర్, వెంకటేశ్, నర్సయ్య తదితరులున్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్ శివారు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఫికప్ వాహనాన్ని సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్ హౌస్ అధికారి శ్రీనివాస్‌రావు వివరాల ప్రకారం.. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన గాంతుల సత్తయ్య తన ఫికప్ వాహనంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నారాయణపూర్ మానేరువాగు నుంచి ఇసుకను కామారెడ్డి జిల్లా కేంద్రంలో అమ్మడానికి తరలిస్తుండగా గొల్లపల్లిలో పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి సత్తయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బర్డ్ ఫ్లూ ప్రచారాన్ని నమ్మొద్దు



మాట్లాడుతున్న భీంరెడ్డి, నాయకులు

విద్యానగర్(కరీంనగర్): పౌల్ట్రీ పరిశ్రమను దెబ్బతీసే కుట్రలో భాగంగా బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ వచ్చిందని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు దీన్ని నమ్మవద్దని నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.భీంరెడ్డి, బ్రాయిలర్ రైతుల సంక్షేమ సంఘం సభ్యుడు డి.జనార్దన్ రెడ్డి కోరారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమ్మక్క జాతర నేపథ్యంలో చికెన్, కోడిగుడ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని దళారులు లాభాలు పొందేందుకు వదంతులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రతినిధులు ఎం.ఖదీర్, పాదం రాజు, సంకిటి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.నర్సింహులు పాల్గొన్నారు.

మహిమగల పుణ్యక్షేత్రం ఎములాడ



సుమన్‌ను సత్కరిస్తున్న ఏఈవో శ్రీనివాస్

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అత్యంత మహిమగల పుణ్యక్షేత్రమని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని సోమవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడారు. రాజన్న క్షేత్రం అత్యంత మహిమ కలిగిన దేవుడని, అందుకే నిత్యం వేలాది మంది భక్తులు ఆయన దర్శనం కోసం వస్తున్నారని తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తాను రాజన్నకు మొక్కుకున్నానని వివరించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ఏఈవో శ్రీనివాస్, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు శ్రీరాములు తదితరులు సుమన్‌ను సత్కరించారు.

ఏపీఏ మైన్‌కు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న గని మేనేజర్ తిరుపతి

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ అడ్రియాల ప్రాజెక్టు ఏరియా గనికి 2023–24 సంవత్సరానికి గాను 'బెస్ట్ టెక్నాలజీ మైన్ ఇన్ అండర్ గ్రౌండ్ కోల్ విభాగంలో జాతీయస్థాయి అవార్డు దక్కింది. ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వరరావు, అడిషనల్ మేనేజర్ శ్రీకాంత్ 'డీప్ అండర్ గ్రౌండ్ కోల్ మైనింగ్'లో సమర్థత, భద్రతను పెంచడం, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కూలింగ్, ట్యూబ్ బండిల్ గ్యాస్ మానిటరింగ్ సిస్టంలతో కూడిన కేస్ స్టడీని సమర్పించారు. దాని ఆధారంగా 'బెస్ట్ టెక్నాలజీ మైన్ ఇన్ అండర్ గ్రౌండ్ కోల్' 2023–2024 కేటగిరీలో అవార్డు దక్కింది. భువనేశ్వర్‌లో జరిగిన సదస్సులో గని మేనేజర్ ములుకుంట్ల తిరుపతి జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు.

యువతి అదృశ్యం

కరీంనగర్‌క్రైం: ఎల్లారెడ్డిపేట మండలం అక్కన్నపేటకు చెందిన ఎ.సుజాత (22) యువతి ఈనెల 17న కరీంనగర్‌లో అదృశ్యమైనట్లు సోమవారం ఆమె కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుజాత ఈనెల 17న కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తన బంధువును చూసేందుకు వచ్చింది. ఆదే రోజు ఆమె సర్టిఫికెట్ల పనిమీద హైదరాబాద్‌కు వెళ్తానని చెప్పడంతో వారి సమీప బంధువు ఒకరు బైక్‌పై బస్టాండ్‌లో దించాడు. అప్పటి నుంచి ఆమె ఫోన్ పనిచేయకపోవడంతో ఆచూకీ కోసం హైదరాబాద్‌లోని స్నేహితుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె తాత వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం ఓగులాపూర్‌కు చెందిన వృద్ధుడు బోయిని మల్లయ్య (65) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై బండి రాజేశ్ తెలిపిన వివరాలు... ఓగులాపూర్‌కు చెందిన మల్లయ్య ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చాలా ఆసుపత్రిల్లో చికిత్స చేయించిన నయం కాలేదు. దీంతో మానసికంగా వేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొడుకు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.



సిరిసిల్ల బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



సీటు కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

బస్సుల కొరత.. ఇబ్బందుల తీవ్రత



ఫుట్‌బోర్డు ప్రయాణం



కామారెడ్డి బస్సులో కిక్కిరిసిన జనం

సమయానికి బస్సులు రాక సోమవారం సిరిసిల్ల బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మేడారం జాతరకు సిరిసిల్ల డిపో నుంచి 32 బస్సులు పంపించారు. డిపోలో మొత్తం 61 బస్సులు ఉండగా అందులో సగం జాతరకు పంపడంతో బస్సుల కొరత ఏర్పడి, సమయానికి రాక ప్రయాణికులు చాలాసేపు నిరీక్షించారు. తీరా బస్సులు బస్టాండ్‌కు రావడంతో సీట్లకోసం ఎగబడ్డారు. నిల్చోడానికి చోటు లేక చివరికి ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేశారు. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో జనంతో బస్టాండ్ కిక్కిరిసింది. చాలా సేపు బస్సులకోసం వేచి చూసి గత్యంతరం లేక సమయానికి ఇంటికి చేరుకునేందుకు ఆటోలను ఆశ్రయించారు. ఇదే అదనుగా భావంచిన ఆటోవాలాలు అధిక చార్జీలు వసూలు చేశారు. ఇదేం గోసరో నాయనా అంటూ జనం ప్రయాణం సాగించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

ఇలవేల్పుకు నీరాజనం

వేములవాడ: వేములవాడ రాజన్నను సోమవారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క జాతర సమీపిస్తుండటంతో తమ ఇలవేల్పుకు మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టింది. క్యూలైన్లు ఎక్కడికక్కడ నిండిపోయాయి. భక్తుల ద్వారా రూ.45 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.







క్లుప్తంగా

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న సాగర్

కరీంనగర్‌రూరల్‌: తీగలగుట్టపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు సోమవారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. సంస్థ సభ్యురాలు సరిత–మధుసూదన్ వివాహ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశామని సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. రాబోయే వార్షిక పరీక్షల్లో 9.6 జీపీఏ కంటే ఎక్కువ సాధించిన విద్యార్థులకు రూ.2,016 నగదు బహుమతి అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కరుణ, సంస్థ సభ్యులు చైత్ర, మన్‌సాయితో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీటీసీకి సన్మానం



డీటీసీ పురుషోత్తంను సన్మానిస్తున్న సభ్యులు

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పురుషోత్తంను సోమవారం డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంగవేణి లక్ష్మణ్, ప్రతినిధులు మాసం సుధాకర్, శ్రీకాంత్, అభినవ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల కులగణన ఆమోదం హర్షణీయం

కరీంనగర్‌: బీసీల కుల గణనకు అసెంబ్లీ ఆమోదం తెలపడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. బడుగు బలహీన వర్గాల బలోపేతమే లక్ష్యంగా అసెంబ్లీలో బీసీల కుల గణన ప్రవేశపెట్టి ఆమోదించడం బీసీ సమాజం సంతోషం వ్యక్తం చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించి బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

వృద్ధులకు అన్నదానం



భోజన ప్యాకెట్లు అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు సాయికృష్ణ

కరీంనగర్‌రూరల్‌: మహాదేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ వృద్ధుల అనాథ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. చామనపల్లికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు మెరుగు సాయికృష్ణ యాదవ్ జన్మదినం పురస్కరించుకుని వృద్ధులకు భోజనప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అవారి రాజు, అనిల్, సాయికుమార్‌గౌడ్, సాయికిశోర్, శివ తదితరులు పాల్గొన్నారు.

బావపై బావమరిది దాడి

కరీంనగర్ క్రైం: ఇంట్లో చేసుకున్న కార్యక్రమానికి రాలేదని ఓ వ్యక్తి తన బావపై దాడి చేశాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని కోతిరాంపూర్‌కు చెందిన చంద్రయ్య మెకానిక్. ఇదే ప్రాంతంలోని ఆయన అత్తగారింట్లో ఆదివారం సమ్మక్కకు చేసుకుంటే భార్య, కుమారుడు వెళ్లారు. కార్యక్రమం అయ్యాక చంద్రయ్య బావమరిది అనిల్ వారిని తిరిగి ఇంటి వద్ద దింపాడు. సమ్మక్కకు చేసుకుంటున్నామని పిలిస్తే రాలేదన్న కోపంతో అక్కడే ఉన్న చంద్రయ్యపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పూడిక తీత చేపట్టాలి

సైదాపూర్‌: మిడ్‌మానేర్ కుడి కాలువలో పూడిక పేరుకుపోయి యాసంగికి సాగునీరు రావడం లేదని పూడిక తీత పనులు చేపట్టాలని మండలంలోని జాగీర్‌పల్లి, గుజ్జులపల్లి రైతులు కోరుతున్నారు. సాగునీటి కాలువల ఆధారంగా పండిస్తున్న వరి, మొక్కజొన్న పంటలకు నీరు సరిగా అందడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం రైతులం పూడిక తొలగించుకున్నామని, గతేడాది సాగునీరు రాలేదని ఈ ఏడాది కూడా కాలువల్లో పూడికతో సాగునీరు వస్తలేదని రైతులు పేరం తిరుపతి, దుమ్మాల ఈరయ్య, మంతుర్తి అనిల్, గుంపుల మధుకర్, పేరం రవి, మెడవేన మధూకర్, రాజులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగ కల్పనే ధ్యేయం



అవార్డులు అందుకున్న విద్యార్థులు

కరీంనగర్ సిటీ: విద్యార్థుల ఉద్యోగ కల్పనే ధ్యేయంగా శ్రీచైతన్య విద్యాసంస్థలు పని చేస్తాయని ఆ విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి అన్నారు. మంకమ్మతోటలోని శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలల స్వాగతోత్సవ వేడుకలు సోమవారం రేకుర్తిలోని శుభం గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు ఉన్నత విద్యపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాలు, విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డులు అందజేసి అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎములాడకు తగ్గిన బస్సులు





సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా 80 శాతం బస్సులను ములుగు జిల్లా మేడారానికి వేశారు. దీంతో ఎములాడ రాజన్న దర్శనానికి వెళ్లే భక్తులు బస్సులు తక్కువగా నడుస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. కరీంనగర్ బస్టాండ్‌లో ఆ దృశ్యాలను సోమవారం 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

డీఏవోగా బాధ్యతలు



డీఏవో శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు, సిబ్బంది

కరీంనగర్ అర్బన్‌: జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో)గా బి.శ్రీనివాస్ సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిసి, విధుల్లో చేరారు. ఆయన మానకొండూరు ఏడీఏగానూ కొనసాగనున్నారు. ఈ సందర్భంగా డీఏవోకు ఏడీఏ అంజని, సాంకేతిక ఏవోలు మామిడి కృష్ణ, తుల రమ్యశ్రీ, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు డీఏవోగా ఉన్న ప్రియదర్శిని ఆత్మ పీడీగా వ్యవహరించనున్నారు.

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి



శివాజీమహరాజ్‌కు నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్‌: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని సోమవారం రేకుర్తిలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శివాజీ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జాడి బాల్‌రెడ్డి మాట్లాడుతూ మరాఠా యోధులు, దేశభక్తికి, ధీరత్వానికి మారుపేరైన ఛత్రపతి శివరాజ్ మహరాజ్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని జాతీయతా భావం పెంపొందించుకోవాలని అన్నారు. నేటి యువత వారిని స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాల్వ పూర్ణచందర్‌రెడ్డి, ఎర్రోళ్ల ప్రశాంత్, నాగుల వెంకటేష్ గౌడ్, పింగిళి ప్రతాప్ రెడ్డి, బుర్ర సాయిరాం గౌడ్, కామెర లక్ష్మణ్, గాలిపెల్లి శ్రీనివాస్, సంజీవ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్యంపై రైతులకు అవగాహన



భూసార ఫలితాల పత్రాలతో రైతులు

కొత్తపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన కొత్తపల్లి మండలం నాగులమల్యాలలో సోమవారం నేల ఆరోగ్యంపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. అదేవిధంగా భూసార ఫలితాల పత్రాల దినోత్సవాన్ని పురస్కరించుకొని సుమారు 300 మంది రైతులకు భూసార ఫలితాల పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వరి, మొక్కజొన్న పొలాల్లో క్షేత్ర సందర్శన చేపట్టారు. ఏడీఏ అంజనీ, శాస్త్రవేత్తలు జి.ఉషారాణి, మధూకర్, కె.మదన్‌మోహన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌లు పంటమార్పిడి, యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ విధానాలు, పచ్చి రొట్టె ఎరువుల ఉపయోగాలు, వానాకాలం వరిపంట ముందు పెసర పంట సాగు, భూసార ఫలితాల పత్రాల విశ్లేషణ, పంటల యాజమాన్య సమాచారాన్ని ప్రసార సాంకేతిక పరిజ్ఞానాన్ని వివిధ యాప్స్ ద్వారా తెలుసుకునే వివరాలు, వరి, నువ్వులలో చీడల నివారణ చర్యలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలపై అవగాహన కల్పించారు. క్షేత్ర సందర్శన చేసిన శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సుష్మిత, వ్యవసాయ విస్తరణ అధికారి లలిత, బీటీఎం రమ్య, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇవ్వని బీజేపీని ఓడించండి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేశ్

కరీంనగర్‌: యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వని బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేశ్ అన్నారు. సోమవారం నగరంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ బడా కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తూ నిరుద్యోగ యువతీ యువకుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఉద్యోగాలు ఇచ్చేంతవరకు అర్హులైన యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్, కృష్ణ, నవీన్, శ్రీధర్ దినేశ్, సురేశ్, నవీన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఏసీపీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏసీపీ వెంకటరమణ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ రూరల్ ఏసీపీగా వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రూరల్ ఏసీపీగా ఉన్న కరుణాకర్ రావు ఇటీవల బదిలీ కాగా నూతనంగా ఏసీపీగా వెంకటరమణ వచ్చారు.

అక్రమ నియామకాలు నిలుపుదల చేయాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మునిగంటి అనిల్

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీలో కొత్త జీవో 1222 ద్వారా అక్రమ నియామకాలు, పదోన్నతులు చేపట్టడాన్ని నిలుపుదల చేసి విచారణ చేపట్టాలని కోరుతూ నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యుఐ)జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ సోమవారం బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. వైస్ ఛాన్సలర్ మల్లేశం అవినీతి అక్రమాలు బయటకు వస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో జీవో 1222ను తీసుకవచ్చారన్నారు. జీవోలో అక్రమ నియామకాలను అరికట్టి చట్టపరమైన చర్యలు తీసుకొని జీవో 1222 నిలుపుదల చేసి వీసీ మల్లేశంపై విచారణ చేపట్టాలని కోరారు.

జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ



రంగనాయకుల గుట్ట వద్ద జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ

హుజురాబాద్/హుజురాబాద్‌రూరల్‌: పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట, మండలంలోని జూపాకలో సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను సోమవారం హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ పరిశీలించారు. రంగనాయకుల గుట్ట వద్ద సమ్మక్క సారలమ్మ గద్దెలను దర్శించుకొని పూజలు చేశారు. ఎండోమెంట్ అధికారులు, సమ్మక్క జాతర చైర్మన్ మూగల రాజిరెడ్డితో ఏర్పాట్లపై పోలీసుశాఖ తీసుకునే చర్యలు చర్చించారు. సమ్మక్క జాతర రూట్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. వెంట హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేశ్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఈ. చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ అధికారులు సుధాకర్, మారుతిరావు, జాతర వైస్ చైర్మన్ సురుకంటి, తిరుపతి రెడ్డి, రాజు, ఉమాశంకర్, మున్సిపల్ సిబ్బంది ప్రతాపరాజు, రమేశ్ తదితరులు ఉన్నారు.

శంకరపట్నం: మండలంలో నిర్వహించబోయే సమ్మక్క –సారలమ్మ జాతరకు భక్తులకు ఇబ్బంది కలుగకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తామని ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. సోమవారం గద్దెల వద్ద మొక్కులు చెల్లించారు. అనంతరం మాట్లాడుతూ పాలకవర్గానికి, పోలీసు సిబ్బందికి తగు సూచనలు చేశారు. వాహనాలకు పార్కింగ్, భక్తులకు ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించారు. జాతర ప్రాంగణాన్ని సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ స్వామి, సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు.

సమ్మక్క జాతరకు రెండు రోజులు సెలవు ప్రకటించాలి

కరీంనగర్‌: రాష్ట్రంలో ఈనెల 21 నుంచి 24వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు రెండు రోజులు సాధారణ సెలవు ప్రకటించాలని టీపీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సారయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరగా జరుపుకునే పండుగకు జాతీయ హోదా కల్పించాలని కోరారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కేవలం వరంగల్ జిల్లాకు మాత్రమే సెలవు ప్రకటించి ఇతర జిల్లాలో ప్రకటించకపోవడం భావ్యం కాదని అన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రాష్ట్ర ప్రజలందరి మనోభావాలు కాపాడి సెలవు ఇవ్వాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్ శివారులోని చంద్రాపూర్‌కాలనీలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు, స్థానికుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని ముంజంపల్లికి చెందిన నేరెళ్ల వినయ్(28) ఏసీ మెకానిక్‌గా పని చేస్తూ భార్యతో కలిసి చంద్రాపూర్‌కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. ఆదివారం అతని భార్య పుట్టింటికి వెళ్లింది. సోమవారం రాత్రి ఇంటి యజమాని ఎంత పిలిచినా వినయ్ తలుపులు తెరవలేదు. అనుమానం వచ్చి, కిటికీలో నుంచి చూడగా ఉరేసుకొని కనిపించాడు. రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వచ్చి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలి

శంకరపట్నం: మండలంలోని తాడికల్–చింతగట్టు మార్గంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ హైవే అథారిటీ అధికారులకు లేఖ రాసినట్లు చింతగట్టుకు చెందిన అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు తెలిపారు. తాడికల్ నుండి –చింతగుట్టకు వెళ్లే దారి మూసివేశారని ఎంపీని కలిసి తమగోడు వెళ్లబోసుకోవడంతో అధికారులకు లేఖను రాశారని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్‌రూరల్‌: సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నగునూరు పంచాయతీ కార్యదర్శి మల్లయ్యపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కు జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్ వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న గృహ సముదాయం అనుమతుల వివరాలపై సమాచారం కోసం గతేడాది డిసెంబరులో డీపీవోకు దరఖాస్తు చేసుకోగా పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తును బదిలీ చేశారని తెలిపారు. నెలరోజులు దాటినప్పటికీ సమాచారం ఇవ్వకపోవడంతో మరోసారి ఈనెల 2న డీపీవోకు దరఖాస్తు చేయగా ఈనెల 6న పంచాయతీ కార్యదర్శి మల్లయ్య గృహసముదాయం అనుమతి వివరాలను టీఎస్‌బీపాస్ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సమాధానం పంపించినట్లు వివరించారు. సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శిపై తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

శానిటేషన్ లేబర్‌పై ఆరా

కరీంనగర్ కార్పొరేషన్‌: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వివరాలపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. మొత్తం కార్మికుల సంఖ్య ఎంత? అందులో ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారు? ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లల్లో ఎవరైన పనిచేస్తున్నారా? చేస్తే ఎంతమంది? అనే వివరాలపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టినట్లు తెలిసింది. కొంతమంది పారిశుధ్య కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేయకున్నా, వారి హాజరు వేస్తున్నారని, లక్షల రూపాయల్లో జీతాలు దుర్వినియోగమవుతున్నాయని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ గత ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఉన్నతాధికారులు శానిటేషన్ లేబర్ వ్యవహారంపై దృష్టిపెట్టి ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ శ్రీరాంనగర్ ఫీడర్ పరిధిలోని శ్రీరాంనగర్, కొత్తయాస్వాడ, ఆదిత్యనగర్, యూనివర్సిటీ, విద్యానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ టౌన్ ఏడీఈ–2 ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పప్పుల సురేశ్



సురేశ్

కరీంనగర్‌టౌన్‌: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లాకు చెందిన పప్పుల సురేశ్ ఎన్నికయ్యారు. గోదావరిఖనిలో జరుగుతున్న బీఎంఎస్ 4వ త్రైవార్షిక రాష్ట్ర మహాసభల్లో సురేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన ప్రతీ కార్యకర్త, నాయకులకు సురేశ్ ధన్యవాదాలు తెలిపారు.

పీసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్‌: పీసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్‌గా నగరంలోని కోతిరాంపూర్‌కు చెందిన మద్దికుంట శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు ఏఐసీసీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు అజయ్‌సింగ్ సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ శ్రీకాంత్‌లకు ఈ సందర్భంగా శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు

జమ్మికుంట: భూ వివాదంలో జరిగిన దాడిలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. మండలంలోని మాచనపల్లి గ్రామంలో బండి మహేశ్వరి, నరేశ్, సమ్మయ్య, అదే గ్రామానికి చెందిన బండి రాజు, కొంరయ్య, స్వరూప భూ వివాదంలో దాడులకు చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కరీంనగర్‌: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను సోమవారం ప్రెస్‌భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు చర్ల పద్మ, రాష్ట్ర, జిల్లా నాయకులు మల్లేశ్, కటికెరెడ్డి బుచ్చన్నయాదవ్, గుండేటి శ్రీనివాస్, రవీందర్, కాల్వ మల్లేశ్, వెంకటమల్లు, శ్రీనివాస్, వైజయంతి, రాజ్‌కుమార్, రవీందర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రాములు, రవి, రవీందర్, జిట్టవేని పర్శరాం, అశోక్, సంపత్, సదానందం, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు



నారాయణరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బొడ్డు సునీల్

గన్నేరువరం: లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొడ్డు సునీల్ జిల్లా స్థాయిలో బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డును క్లబ్ ఫాస్ట్ గవర్నర్ రిక్కల నారాయణరెడ్డి చేతుల మీదుగా సోమవారం కరీంనగర్‌లో అందుకున్నారు. అలాగే బెస్ట్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అవార్డు గంప వెంకన్న, బెస్ట్ లియో రీజియన్ కోఆర్డినేటర్ అవార్డు బూర శ్రీనివాస్, జిల్లా బెస్ట్ సెక్రటరీ అవార్డు తెల్ల భాస్కర్, జిల్లా బెస్ట్ ట్రెజరర్ అవార్డు కాంతాల అంజిరెడ్డి అందుకున్నారు. అలాగే బెస్ట్ పర్మమెంట్, బెస్ట్ నీడెడ్ సర్వీస్ అవార్డు, బెస్ట్ క్యాలెండర్ అవార్డులను గన్నేరువరం లయన్స్ క్లబ్ దక్కించుకుంది.



టర్కిష్ కప్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీకి సౌమ్య

నాలుగు దేశాల మధ్య జరిగే టర్కిష్ కప్ అంతర్జాతీయ మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే భారత సీనియర్ జట్టును ప్రకటించారు. 23 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణకు చెందిన ఫార్వర్డ్ ప్లేయర్ సౌమ్య గుగులోత్‌కు స్థానం దక్కింది. బుధవారం టర్కీలోని అలాన్యా పట్టణంలో ఈ టోర్నీ మొదలవుతుంది. భారత్, హాంకాంగ్, ఎస్టోనియా, కొసోవో దేశాల మధ్య రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో ఈ టోర్నీ జరుగుతుంది. అగ్రస్థానంలో నిలిచిన జట్టుకు టైటిల్ లభిస్తుంది. భారత్ తమ మ్యాచ్‌లను 21న ఎస్టోనియాతో, 24న హాంకాంగ్‌తో, 27న కొసోవోతో ఆడుతుంది.

పంజాబ్ 'స్టేట్ ఐకాన్'గా గిల్ నియామకం



త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్ రాష్ట్రంలో ఓటు శాతం పెంచేందుకు ... ఆ రాష్ట్రానికి చెందిన భారత స్టార్ క్రికెటర్ శుబ్‌మన్ గిల్‌ను 'స్టేట్ ఐకాన్'గా నియమించారు. యువతలో ఎంతో క్రేజ్ ఉన్న గిల్ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తాడని పంజాబ్ చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ సిబిన్ తెలిపారు. గత 2019 ఎన్నికల్లో 65.96 శాతం ఓటింగ్ నమోదు కాగా... ఈసారి 70 శాతానికి పైగా పెంచాలనే లక్ష్యంతో ముందుకెళ్తామని సిబిన్ చెప్పారు.


విజయం దిశగా హైదరాబాద్

తనయ్ ఖాతాలో ఐదు వికెట్లు ● మేఘాలయతో రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ ఫైనల్



తనయ్

సాక్షి, హైదరాబాద్: మరో 127 పరుగులు సాధిస్తే హైదరాబాద్ క్రికెట్ జట్టు 2023–2024 రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ చాంపియన్‌గా అవతరిస్తుంది. ఇక్కడి ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న ప్లేట్ డివిజన్ టైటిల్ పోరులో మేఘాలయ జట్టు హైదరాబాద్‌కు 198 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 71 పరుగులు సాధించింది. తన్మయ్ అగర్వాల్ (0) ఖాతా తెరవకుండా అవుటవ్వగా... రాహుల్ సింగ్ గహ్లోత్ (29 బంతుల్లో 50 బ్యాటింగ్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), తనయ్ త్యాగరాజన్ (35 బంతుల్లో 17 బ్యాటింగ్; 1 ఫోర్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 0/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మేఘాలయ జట్టు 71.3 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఆర్ఆర్ బిస్వా (100; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ సాధించగా... జస్కీరత్ (81; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. హైదరాబాద్ ఎడంచేతి వాటం స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ 86 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి మేఘాలయను కట్టడి చేశాడు. ఈ రంజీ సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడిన తనయ్ మొత్తం 56 వికెట్లు తీసి అగ్రస్థానంలో ఉన్నాడు. తనయ్ ఏడుసార్లు ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టడం విశేషం.



బుమ్రాకు విశ్రాంతి!

నాలుగో టెస్టుకు భారత స్టార్ బౌలర్ దూరం

- పూర్తి ఫిట్‌గా కేఎల్ రాహుల్
- రాంచీ టెస్టుకు స్టార్ బ్యాటర్

రాజ్‌కోట్: భారత ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు నాలుగో టెస్టులో విశ్రాంతి ఇవ్వనున్నట్లు తెలిసింది. ఐదు టెస్టుల ఈ సిరీస్‌లో సీనియర్ సీమర్ బుమ్రా రెండో టెస్టును ఒంటిచేత్తో గెలిపించాడు. మూడు మ్యాచ్‌లు ముగిసిన ఈ సిరీస్‌లో అతను 17 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ మూడు మ్యాచ్‌ల్లో 80.5 ఓవర్లు వేశాడు. ఈ నేపథ్యంలో అతనికి రెస్ట్ ఇవ్వాలని బోర్డు భావిస్తోంది. బోర్డుకు ఇది కొత్తేం కాదు. ఆటగాళ్లపై పనిఒత్తిడి తగ్గించేందుకు బోర్డు కొంతకాలంగా ఇలాంటి వైఖరి అవలంబిస్తోంది. వైజాగ్‌లో జరిగిన రెండో టెస్టులో హైదరాబాద్ స్పీడ్‌స్టర్ సిరాజ్‌కు విశ్రాంతినిచ్చి తిరిగి మూడో టెస్టు ఆడించింది. 'టీమిండియా మంగళవారం రాంచీకి బయలుదేరుతుంది. ఈ మ్యాచ్ నుంచి బుమ్రా విశ్రాంతి తీసుకుంటాడు. తొడ కండరాల గాయం నుంచి కోలుకుని వంద శాతం ఫిట్‌నెస్‌తో ఉన్న కేఎల్ రాహుల్ మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడు' అని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారి ఒకరు చెప్పారు. ధర్మశాలలో మార్చి 7 నుంచి జరిగే ఆఖరి టెస్టులో బుమ్రా తాజాగా బరిలోకి దిగేందుకు ఈ నిర్ణయం దోహదం చేస్తుందని బోర్డు భావిస్తోంది. స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తొలి టెస్టులో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కానీ ప్రత్యర్థి స్పిన్ ఉచ్చుతో భారత్ ఓడిపోయింది. పాతగాయం తిరగబెట్టడంతో రెండో టెస్టు నుంచి తప్పించారు. మూడో మ్యాచ్‌కు ఎంపిక చేసినప్పటికీ ఫిట్‌నెస్ సంతరించుకోకపోవడంతో మళ్లీ జాతీయ క్రికెట్ అకాడమీకి పంపించారు. భారత్, ఇంగ్లండ్‌ల మధ్య నాలుగో టెస్టు ఈనెల 23 నుంచి రాంచీలో జరుగుతుంది.

'డ్రా'తో గట్టెక్కిన ఆంధ్ర

రాణించిన అశ్విన్, రషీద్, షోయబ్	క్వార్టర్ ఫైనల్లో మధ్యప్రదేశ్‌తో 'ఢీ'	ముగిసిన రంజీ ట్రోఫీ లీగ్ దశ



అశ్విన్ హెబ్బర్



షోయబ్ ఖాన్

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు లీగ్ దశను 'డ్రా'తో ముగించింది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా కేరళతో జరిగిన చివరిదైన ఏడో లీగ్ మ్యాచ్‌ను ఆంధ్ర జట్టు పోరాడి 'డ్రా' చేసుకుంది. చివరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 19/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి 97 ఓవర్లలో 9 వికెట్లకు 189 పరుగులు సాధించి 'డ్రా'తో గట్టెక్కింది. 242 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన కేరళ జట్టుకు 3 పాయింట్లు, ఆంధ్ర జట్టుకు ఒక పాయింట్ లభించాయి. అశ్విన్ హెబ్బర్ (165 బంతుల్లో 72; 12 ఫోర్లు, 1 సిక్స్) సంయమనంతో ఆడి అర్ధ సెంచరీ చేశాడు. కరణ్ షిండే (82 బంతుల్లో 26; 5 ఫోర్లు), షేక్ రషీద్ (93 బంతుల్లో 36; 6 ఫోర్లు), షోయబ్ ఖాన్ (93 బంతుల్లో 11; 2 ఫోర్లు) మొండి పట్టుదలతో ఆడి ఆంధ్ర జట్టుకు ఓటమి తప్పించడంలో కీలకపాత్ర పోషించారు. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 272 పరుగులకు ఆలౌట్ కాగా... కేరళ తొలి ఇన్నింగ్స్‌ను 514/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది.

- సోమవారంతో ఈ రంజీ సీజన్ లీగ్ దశ మ్యాచ్‌లన్నీ ముగిశాయి. ఎలైట్ డివిజన్‌లో మొత్తం 32 జట్లను 4 గ్రూప్‌లుగా (ఎ, బి,సి,డి; 8 జట్ల చొప్పున) విభజించారు. గ్రూప్ 'బి'లో ముంబై జట్టు 37 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకోగా... ఆంధ్ర జట్టు 26 పాయింట్లతో (3 విజయాలు, 3 'డ్రా', 1 ఓటమి) రెండో స్థానంలో నిలిచింది. చివరి లీగ్ మ్యాచ్‌కంటే ముందే ఈ రెండు జట్లకు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు ఖరారయ్యాయి.
- గ్రూప్ 'ఎ' నుంచి విదర్భ (33 పాయింట్లు), సౌరాష్ట్ర (28 పాయింట్లు)... గ్రూప్ 'సి' నుంచి తమిళనాడు (28 పాయింట్లు), కర్ణాటక (27 పాయింట్లు)... గ్రూప్ 'డి' నుంచి మధ్యప్రదేశ్ (32 పాయింట్లు), బరోడా (26 పాయింట్లు) తొలి రెండు స్థానాల్లో నిలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. 32 జట్లలో చివరి రెండు స్థానాల్లో నిలిచిన మణిపూర్, గోవా జట్లు వచ్చే సీజన్‌కు 'ప్లేట్' డివిజన్‌కు పడిపోగా... 'ప్లేట్' డివిజన్‌లో ఫైనల్ చేరిన హైదరాబాద్, మేఘాలయ ఎలైట్ డివిజన్‌కు అర్హత పొందాయి.
- ఈనెల 23 నుంచి జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో కర్ణాటకతో విదర్భ (నాగ్‌పూర్‌లో); మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర (ఇండోర్‌లో); ముంబైతో బరోడా (ముంబైలో); తమిళనాడుతో సౌరాష్ట్ర (కోయంబత్తూరులో) తలపడతాయి.

'షూటౌట్'లో భారత్‌దే పైచేయి



భువనేశ్వర్: పురుషుల ప్రొ హాకీ లీగ్ టోర్నీలో భారత జట్టు నాలుగో విజయం అందుకుంది. స్పెయిన్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా సడెన్‌డెత్ 'షూటౌట్'లో 8–7తో గెలిచింది. నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున జర్మన్‌ప్రీత్ సింగ్ (1వ ని.లో), అభిషేక్ (35వ ని.లో)... స్పెయిన్ తరఫున జోస్ బస్టెరా (3వ ని.లో), బొర్యా లకెలా (15వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. స్కోర్లు సమమయ్యాక విజేతను నిర్ణయించడానికి 'షూటౌట్'ను నిర్వహించారు. 'షూటౌట్'లో తొలి ఐదు ప్రయత్నాల్లో ఇరు జట్ల ఆటగాళ్లు సఫలమయ్యారు. దాంతో 'సడెన్‌డెత్' షూటౌట్‌ను నిర్వహించారు. 'సడెన్‌డెత్'లో స్పెయిన్ ప్లేయర్ మిరాలెస్ తీసుకున్న మూడో షాట్‌ను భారత గోల్‌కీపర్ శ్రీజేష్ నిలువరించాడు. ఆ వెంటనే భారత్ తరఫున లలిత్ ఉపాధ్యాయ్ గోల్ చేయడంతో టీమిండియా విజయం ఖరారైంది. తొమ్మిది జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో భారత్ ఐదు మ్యాచ్‌ల ద్వారా 10 పాయింట్లు సాధించి నాలుగో స్థానంలో ఉంది. రేపు జరిగే మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ ఆడుతుంది.

భారత మహిళల జట్టుకు రెండో విజయం



మనిక బత్రా

బుసాన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టుకు రెండో విజయం లభించగా... భారత పురుషుల జట్టు ఖాతాలో రెండో పరాజయం చేరింది. సోమవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 3–0తో ఉజ్బెకిస్తాన్ జట్టుపై గెలుపొందగా... భారత పురుషుల జట్టు 0–3తో దక్షిణ కొరియా చేతిలో ఓడిపోయింది. మహిళల విభాగం తొలి మ్యాచ్‌లో అర్చన కామత్ 11–7, 11–3, 11–6తో రిమా గఫ్రనోవాపై... రెండో మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ మనిక బత్రా 11–7, 11–4, 11–1తో మర్కబో మగ్దియెవాపై... మూడో మ్యాచ్‌లో దియా చిటాలె 11–6, 10–12, 11–4, 11–6తో రోజలినా ఖద్జియెవాపై విజయం సాధించారు. ఆరు జట్లున్న గ్రూప్–1లో ప్రస్తుతం భారత మహిళల జట్టు ఐదు పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

పురుషుల విభాగం తొలి మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 4–11, 10–12, 8–11తో జాంగ్ వూజిన్ చేతిలో... రెండో మ్యాచ్‌లో సత్యన్ 5–11, 7–11, 7–11తో లిమ్ జొంగ్‌హూన్ చేతిలో... మూడో మ్యాచ్‌లో శరత్ కమల్ 9–11, 11–8, 6–11, 5–11తో లీ సాంగ్‌సు చేతిలో ఓటమి చవిచూశారు. ఐదు జట్లున్న గ్రూప్–3లో ప్రస్తుతం భారత్ నాలుగు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.



హైదరాబాద్ బ్లాక్ హాక్స్ బోణీ

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు గెలుపు బోణీ కొట్టింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో బ్లాక్ హాక్స్ 7–15, 12–15, 15–10, 15–11, 20–18తో ముంబై మెటోర్స్ జట్టును ఓడించింది. తొలి రెండు సెట్‌లు ఓడిపోయిన బ్లాక్ హాక్స్ ఆ తర్వాత అద్భుత ఆటతీరుతో పుంజుకొని వరుసగా మూడు సెట్‌లు నెగ్గి విజయాన్ని అందుకుంది. బ్లాక్ హాక్స్ విజయంలో అష్మతుల్లా, హేమంత్, లాల్ సుజన్ కీలకపాత్ర పోషించారు.



గుల్‌వీర్ సింగ్‌కు స్వర్ణం

టెహ్రాన్: ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను భారత్ స్వర్ణ పతకంతో ముగించింది. సోమవారం జరిగిన పురుషుల 3000 మీటర్ల రేసులో భారత అథ్లెట్ గుల్‌వీర్ సింగ్ (8ని:07.48 సెకన్లు) పసిడి పతకం గెలిచాడు. మహిళల 3000 మీటర్లలో అంకిత (9ని:26.22 సెకన్లు) రజత పతకం సాధించింది. ఈ పోటీల్లో భారత్‌కు మొత్తం నాలుగు స్వర్ణాలు, ఒక రజతం లభించాయి.

సినిమా



● కాళిదాస్, ధనుష్, సందీప్ కిషన్

దుస్తులను చూస్తుంటే చెఫ్‌లు అనిపించడం సహజం. కానీ బట్టలపై రక్తపు మరకలు, చేతిలో ఆయుధాలు, తీక్షణమైన చూపులు చూస్తుంటే పేరుకే చెఫ్‌లు.. చేసేది వేరే అనే సందేహం కలగక మానదు. సోమవారం రిలీజైన 'రాయన్' పోస్టర్‌లో ధనుష్, సందీప్ కిషన్, కాళిదాస్ జయరామ్‌లు ఈ విధంగా కనిపించారు. ధనుష్ దర్శకత్వం వహిస్తూ, సందీప్ కిషన్, కాళిదాస్‌లతో కలిసి నటిస్తున్న చిత్రమిది. తమిళ్, తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి మూడు భాషల్లోనూ 'రాయన్' టైటిల్‌ని ఖరారు చేసి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: ఓం ప్రకాశ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రేయాస్ శ్రీనివాసన్.



● జాన్వీ కపూర్

తెలుగులో మరో సినిమా

జాన్వీ కపూర్ తెలుగులో మరో క్రేజీ ఆఫర్ అందుకున్నారు. హీరో రామ్ చరణ్‌కి ఆమె జోడీగా నటించనున్నారు. తొలి చిత్రం 'ఉప్పెన'తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న దర్శకుడు బుచ్చిబాబు సన ద్వితీయ చిత్రంగా రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా ('ఆర్‌సీ 16' వర్కింగ్ టైటిల్) తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో చరణ్‌కి జోడీగా ఎవరు నటిస్తారు? అంటూ తెరపైకి వచ్చిన హీరోయిన్ల పేర్లలో జాన్వీ కపూర్ పేరు కూడా ఉంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం అధికారికంగా ప్రకటించలేదు. కానీ, జాన్వీ కపూర్ తండ్రి, నిర్మాత బోనీకపూర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ– ''రామ్ చరణ్‌తో జాన్వీ కపూర్ చేసే చిత్రం త్వరలో ఆరంభం కానుంది'' అని స్పష్టం చేశారు. దీంతో రామ్‌చరణ్‌కి జోడీగా నటించే హీరోయిన్ ఎవరనే ప్రశ్నకు జవాబు దొరికింది. ఇక గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా రూపొందనున్న 'ఆర్‌సీ 16' ఏప్రిల్‌లో సెట్స్‌పైకి వెళ్లనుందని టాక్.



● మమ్ముట్టి

తెలుగులోనూ...

మమ్ముట్టి లీడ్ రోల్‌లో బ్లాక్ అండ్ వైట్‌లో రూపొందిన చిత్రం 'భ్రమయుగం'. రాహుల్ సదాశివన్ దర్శకత్వం వహించిన ఈ సైకలాజికల్ హారర్, థ్రిల్లర్ చిత్రం ఇటీవల మలయాళంలో విడుదలైంది. ఈ నెల 23న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సూర్యదేవర నాగవంశీ తెలుగులో విడుదల చేస్తున్నారు. కాగా మలయాళంలో సూపర్ హిట్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రంలోని మమ్ముట్టి నటనకు కూడా ప్రత్యేకంగా ప్రశంసలు లభిస్తున్నాయి. అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్దా లిజ్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: క్రిస్టో జేవియర్, కెమెరా: షెహనాద్ జలాల్.

కాలం సూపుల గాలంరా...



● ఎంఎం కీరవాణి

చైతన్యా రావు, భూమి శెట్టి జంటగా కుమారస్వామి (అక్షర) దర్శకత్వం వహించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ మూవీ నుంచి 'కాలం సూపుల గాలం రా..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి రిలీజ్ చేసి, ''ఈ సినిమాని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు. అరుణ్ చిలువేరు స్వరపరచిన ఈ పాటకు గోరేటి వెంకన్న సాహిత్యం అందించగా, రామ్ మిర్యాల పాడారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రవీణ్ వనమాలి, శేఖర్ పోచంపల్లి, సంగీతం: అరుణ్ చిలువేరు, సురేష్ బొబ్బిలి (పన్నెండు గుంజల), నేపథ్య సంగీతం: ప్రిన్స్ హెన్రీ.

బాఫ్టాలో మెరిసిన దీపికా పదుకోన్

ఒప్పెన్ హైమర్‌కి అవార్డుల పంట



● దీపికా పదుకోన్

ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన బయోగ్రాఫికల్ థ్రిల్లర్ 'ఒప్పెన్ హైమర్' చిత్రానికి అవార్డుల పంట పండింది. లండన్‌లోని రాయల్ ఫెస్టివల్ హాల్‌లో 77వ బ్రిటిష్ అకాడమీ ఫిల్మ్ అవార్డుల (బాఫ్టా) ప్రదానోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. దేశం నుంచి దీపికా పదుకోన్ ఈ వేడుకల్లో పాల్గొని, 'నాన్ ఇంగ్లిష్' విభాగంలో ఉత్తమ చిత్రానికి (ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్) అవార్డు అందజేశారు. ఇక 'బాఫ్టా'లో 'ఒప్పెన్ హైమర్' చిత్రం ఏడు విభాగాల్లో పురస్కారాలు అందుకుని సత్తా చాటింది. ఉత్తమ చిత్రం, దర్శకుడు, నటుడు, సహాయనటుడు, సినిమాటోగ్రఫీ, బ్యాగ్రౌండ్ స్కోర్, ఎడిటింగ్ విభాగాల్లో 'ఒప్పెన్ హైమర్'కి అవార్డులు దక్కాయి. క్రిస్టోఫర్ నోలన్‌కు దర్శకుడిగా దక్కిన తొలి బాఫ్టా అవార్డు ఇది.




● అవార్డులతో 'ఒప్పెన్ హైమర్' టీమ్

ఇప్పటికే అత్యధిక గోల్డెన్ గ్లోబ్ అవార్డులు గెలుచుకున్న 'ఒప్పెన్ హైమర్' చిత్రం తాజాగా బాఫ్టాలో ఏడు పురస్కారాలు దక్కించుకుని, వచ్చే నెలలో జరిగే ఆస్కార్ రేసులో 13 విభాగాల్లో పోటీలో ఉంది. ఇక 'బాఫ్టా'లో 'ఒప్పెన్ హైమర్' తర్వాత 'పూర్ థింగ్స్' మూవీ అధికంగా ఐదు (కాస్ట్యూమ్, మేకప్, హెయిర్–స్టైలింగ్, ప్రొడక్షన్, స్పెషల్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో) అవార్డులను పొందింది. ఆ తర్వాత 'ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్' సినిమాకి మూడు పురస్కారాలు దక్కాయి.

భారతీయత ఉట్టిపడేలా... 'బాఫ్టా' అవార్డుల ప్రదానోత్సవంలో ప్రజెంటర్‌గా వ్యవహరించిన దీపికా పదుకోన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తొలి భారతీయ నటి దీపికా కావడం విశేషం. ఈ వేదికపై భారతీయత ఉట్టిపడేలా చీరలో మెరిశారు దీపికా పదుకోన్. 'చూపు తిప్పుకోలేనంత అందంగా ఉంది' అనే ప్రశంసలు ఈ బ్యూటీ సొంతమయ్యాయి. ఈ వేడుకలో బ్యాక్ స్టేజీలో దీపికా దిగిన ఫొటోలు వైరల్ అయ్యాయి. ఇదిలా ఉంటే అంతర్జాతీయ సినీ వేడుకల్లో దీపికా పదుకోన్ పాల్గొనడం ఇది రెండోసారి. గతేడాది జరిగిన ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో దీపిక ప్రజెంటర్‌గా వ్యవహరించారు. 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు..' పాటను ఆమె ఆస్కార్ వేదికపై పరిచయం చేశారు.

రాజా శివాజీ

● ఛత్రపతి శివాజీ బయోపిక్‌కి శ్రీకారం



● రితేష్ దేశ్‌ముఖ్

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ బయోపిక్‌కి శ్రీకారం జరిగింది. ఈ మహా రాజ్ జయంతి (ఫిబ్రవరి 19) సందర్భంగా 'రాజా శివాజీ' టైటిల్‌తో బయోపిక్ రూపొందించనున్నట్లు రితేష్ దేశ్‌ముఖ్ ప్రకటించారు. ఈ జీవిత చరిత్రలో టైటిల్ రోల్ చేయడంతో పాటు రితేష్ దర్శకత్వం కూడా వహించనున్నారు. ''ఛత్రపతి శివాజీ మహారాజ్ అనేది పేరు మాత్రమే కాదు ఒక భావోద్వేగం. ఈ మట్టిలో పుట్టిన ఈ మాణిక్యానికి నా నివాళులు. ఆయన వారసత్వం రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. మా ఈ నూతన ప్రయాణానికి అందరి ఆశీర్వాదాలు కావాలి.. జై శివరాయ్'' అని పేర్కొన్నారు రితేష్. కాగా, రెండేళ్ల క్రితం దర్శకుడిగా తొలి చిత్రం 'వేద్' (మరాఠీ)ని తెరకెక్కించి విజయం సాధించారు రితేష్. మలి ప్రయత్నంగా ఛత్రపతి శివాజీ వంటి భారీ బయోపిక్‌ను రూపొందించనున్నారు. మరాఠీ, హిందీ భాషల్లో జియో స్టూడియోస్ సమర్పణలో ముంబై ఫిల్మ్ కంపెనీ బ్యానర్ నిర్మించనున్న ఈ చిత్రానికి రితేష్ భార్య, నటి జెనీలియా ఓ నిర్మాత. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుంది.

రీల్స్

కె. విశ్వనాథ్ పేరిట అవార్డు



● ప్రణవ్, లక్ష్మి, కె. నాగేంద్రనాథ్, నాగార్జున, అమల

దివంగత దర్శకులు కళాతపస్వి కాశీనాధుని విశ్వనాథ్ పేరిట ఆయన తనయుడు కె. నాగేంద్రనాథ్ 'కాశీనాధుని విశ్వనాథ్ అవార్డు'ను ప్రకటించారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిలిం అండ్ మీడియాకి చెందిన యంగ్ ఫిల్మ్ మేకర్స్‌కు ఈ అవార్డు అందించనున్నట్లు నాగేంద్రనాథ్ తెలిపారు. ఈ మేరకు అన్నపూర్ణ స్టూడియోలోని అక్కినేని నాగేశ్వరరావు విగ్రహం వద్ద హీరో అక్కినేని నాగార్జున, అమలను నాగేంద్రనాథ్‌తో పాటు ఆయన సతీమణి లక్ష్మి, కొడుకు ప్రణవ్ సోమవారం కలిశారు. ఏయన్నార్‌తో కె. విశ్వనాథ్‌కి ఉన్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకున్నారు. ''అర్థవంతమైన సినిమాని రూపొందించడానికి స్ఫూర్తినిచ్చే లక్ష్యంతో ఉన్న అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు 'కాశీనాధుని విశ్వనాథ్ అవార్డు'ను అందిస్తాం. సౌండ్ డిజైన్, డైరెక్షన్ రంగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న ఇద్దరు విద్యార్థులను సత్కరించి, అవార్డుతో పాటు ఒక్కొక్కరికి రూ. 25,000 చొప్పున యాభై వేలు నగదు అందజేస్తాం'' అన్నారు నాగేంద్రనాథ్.

ఒక పథకం రెడీ



● అషీమా, సాయిరామ్

సాయిరామ్ శంకర్, అషీమా నర్వాల్, శ్రుతీ సోఢీ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఒక పథకం ప్రకారం'. స్వీయ దర్శకత్వంలో వినోద్ విజయన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. గార్లపాటి రమేశ్ ఓ నిర్మాత. ఈ చిత్రం రిలీజ్‌కు రెడీ అయింది. దర్శక–నిర్మాత వినోద్ విజయన్ మాట్లాడుతూ– ''విభిన్నమైన కథాంశంతో రూపొందించిన థ్రిల్లర్ మూవీ ఇది. ఇందులో సాయిరామ్ శంకర్ పవర్‌ఫుల్ అడ్వొకేట్ పాత్రలో కనిపిస్తారు. గోపీసుందర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హైలైట్‌గా నిలుస్తుంది. సంగీత దర్శకుడు రాహుల్ రాజ్ అద్భుతమైన రెండు పాటలు అందించారు. మార్చిలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు.

స్నేహానికి హద్దు లేదురా



● హ్రితిక, ఆశిష్ గాంధీ

ఆశిష్ గాంధీ, అశోక్ హీరోలుగా వర్ష, హ్రితిక హీరోయిన్లుగా రాజశేఖర్ రావి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హద్దు లేదురా'. వీరేష్ గాజుల బళ్లారి నిర్మించారు. ఈ మూవీ టీజర్ విడుదల వేడుకలో ఆశిష్ గాంధీ మాట్లాడుతూ– ''నేను నటించిన 'నాటకం' మంచి హిట్ అయ్యింది. ఈ మూవీ తర్వాత నేను విన్న కథ 'హద్దు లేదురా'. అప్పటి నుంచి దర్శకుడు, నేను స్నేహితుల్లా ఈ సినిమా కోసం ప్రయాణిస్తున్నాం'' అన్నారు. ''నేటి తరంలోని ఇద్దరు స్నేహితులు కృష్ణార్జునులైతే వారికి వచ్చిన సమస్యల్ని ఎలా పరిష్కరిస్తారో ఇప్పటి యూత్‌కి కనెక్ట్ అయ్యేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. సురేశ్ ప్రొడక్షన్‌లాంటి సంస్థకి మా సినిమా నచ్చడం ఆనందాన్నిచ్చింది'' అన్నారు రాజశేఖర్ రావి. ''స్నేహంతో ముడిపడిన చిత్రమిది'' అన్నారు రోహిత్.

కలియుగం పట్టణంలో...



● ఆయూషి, విశ్వ కార్తీక్

విశ్వ కార్తీక్, ఆయూషి పటేల్ జంటగా నూతన దర్శకుడు రమాకాంత్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. నాని మూవీ వర్క్స్, రామా క్రియేషన్స్ ఆధ్వర్యంలో కందుల గ్రూప్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి. మహేశ్వర రెడ్డి, కాటం రమేశ్ నిర్మించారు. ఈ సినిమాని మార్చి 22న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ''సరికొత్త పాయింట్‌తో మంచి సందేశాన్ని ఇస్తూ కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రంగా 'కలియుగం పట్టణంలో' రూపొందింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి'' అన్నారు నిర్మాతలు. చిత్రా శుక్లా ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అజయ్ అరసాడ, కెమెరా: చరణ్ మాధవనేని.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	282	72,708
నిఫ్టీ ▲	82	22,122

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	15,776	▽	131
డోజోన్స్	38,628	▽	145
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,729	▲	17
డాక్స్	17,029	▽	25
షాంఘై	2,911	▲	45
నికాయ్	38,470	▽	17

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	62,017
బంగారం (99.5 స్వచ్ఛత)	61,769
వెండి (కిలో)	71,210

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధారావాహిక	81.19	84.67
£	బ్రిటన్ పౌండ్	ధారావాహిక	102.34	107.34
€	యూరో	ధారావాహిక	87.28	91.79
¥	జపాన్ ఎన్ (100)	ధారావాహిక	43.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ధారావాహిక	51.91	56.74
S$	సింగపూర్ డాలర్	ధారావాహిక	59.37	64.06
SAR	సౌదీ రియాల్	ధారావాహిక	21.22	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	ధారావాహిక	21.70	23.50
¥	చైనా యువాన్	ధారావాహిక	10.41	12.48

జీపీటీ హెల్త్‌కేర్ @ రూ.177-186

ఈ నెల 22-26 మధ్య ఐపీవో



న్యూఢిల్లీ: ఆరోగ్య పరిరక్షణ రంగ కంపెనీ జీపీటీ హెల్త్‌కేర్ పబ్లిక్ ఈ నెల 22న మొదలు కానుంది. 26న ముగియనున్న ఇష్యూకి తాజాగా రూ. 177–186 ధరల శ్రేణిని ప్రకటించింది. తద్వారా రూ. 525 కోట్లకుపైగా సమీకరించే యోచనలో ఉంది. బుధవారం(21న) యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్లను కేటాయించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 40 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 2.6 కోట్ల ఈక్విటీ షేర్లను పీఈ దిగ్గజం బన్యన్‌ట్రీ గ్రోత్ క్యాపిటల్–2 విక్రయానికి ఉంచనుంది. బన్యన్‌ట్రీ కి ప్రస్తుతం కంపెనీలో 32.64% వాటా (2.6 కోట్ల షేర్లు) ఉంది. వెరసి జీపీటీలో పూర్తి వాటాను విక్రయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 80 షేర్లకు (ఒక లాట్) దరఖాస్తు చేసుకోవాలి. ఐఎల్‌ఎస్ హాస్పిటల్స్ బ్రాండుతో జీపీటీ హెల్త్‌కేర్ ఆరోగ్య పరిరక్షణ సేవలను అందిస్తోంది.

సరికొత్త శిఖరంపై నిఫ్టీ

- అయిదో రోజూ లాభాల పరుగు
- సెన్సెక్స్ లాభం 282 పాయింట్లు
- ఫైనాన్షియల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు డిమాండ్
- ఆల్‌టైం హైకి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: స్టాక్ మార్కెట్లో వరుసగా అయిదో రోజూ లాభాలు కొనసాగడంతో నిఫ్టీ సూచీ సోమవారం సరికొత్త రికార్డు సృష్టించింది. ఫైనాన్స్, ఇంధన, ఆటో, ఎఫ్‌ఎంసీజీ షేర్లు రాణించడంతో ఇంట్రాడేలో 146 పాయింట్లు ఎగసి 22,187 స్థాయి వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 82 పాయింట్ల లాభంతో రికార్డు ముగింపు 22,122 వద్ద స్థిరపడింది. ఆసియా ఈక్విటీ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న స్టాక్ సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో కొంత అమ్మకాల ఒత్తిడికి లోనై సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. అయితే దేశీయంగా నెలకొన్న సానుకూల సంకేతాల ప్రభావంతో వెంటనే తేరుకోని లాభాల బాటపట్టాయి. నిఫ్టీ ఆల్‌టైం హై(22,187)ని నమోదు చేయగా.. సెన్సెక్స్ 455 పాయింట్లు పెరిగి 72,882 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివర్లో ప్రభుత్వరంగ బ్యాంకులు, ఐటీ, రియల్టీ షేర్లలో స్వల్ప లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా సెన్సెక్స్ 282 పాయింట్లు లాభపడి 72,708 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం సరికొత్త శిఖరం(22,122) వద్ద స్థిరపడింది. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.52 %, 1.29% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.755 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.453 కోట్ల షేర్లు కొన్నారు. ఆసియాలో హాంగ్‌కాంగ్, జపాన్, ఇండోనేసియా స్టాక్ సూచీలు మాత్రమే నష్టపోయాయి. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ ఎక్సే్ంజీలు లాభాల్లో ట్రేడవుతున్నాయి. కాగా ప్రెసిడెంట్స్ హాలిడే కావడంతో అమెరికా మార్కెట్లు సోమవారం పని చేయలేదు.

ఇన్వెస్టర్ల సంపద.. ఆల్‌టైమ్ గరిష్టం

మార్కెట్ జోరుతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.20 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్టం రూ.391.69 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది.

మార్కెట్లు మరిన్ని సంగతులు

- తమ నోడల్ ఖాతాను పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ నుంచి యాక్సిస్ బ్యాంకుకు మార్చడంతో పేటీఎం షేరు 5% లాభపడి రూ.359 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.
- క్యూ3లో నికర లాభం 33% వృద్ధి నమోదుతో క్రిసిల్ షేరు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈలో 9.50% ర్యాలీ చేసి రూ.5,039 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 13% ర్యాలీ చేసి రూ.5196 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- తన అనుబంధ సంస్థ పాలసీబజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ ప్రైవేట్ లిమిటెడ్ లైసెన్స్‌ను ఐఆర్‌డీఏఐ 'డైరెక్ట్ ఇన్సూరెన్స్ బ్రోకర్' నుంచి 'కాంపోసైట్ ఇన్సూరెన్స్ బ్రోకర్'గా అప్‌గ్రేడ్ చేయడంతో పీబీ ఫిన్‌టెక్ షేరు 8% ఎగబాకి రూ.1,004 వద్ద నిలిచింది.

ట్యాక్స్ డిమాండ్ ఉపసంహరణకు రూ. లక్ష పరిమితి: సీబీడీటీ



న్యూఢిల్లీ: ఒక్కో పన్ను చెల్లింపుదారునకు సంబంధించి పన్ను డిమాండ్ రూ.లక్ష వరకు ఉంటే, వాటిని ఆదాయపన్ను శాఖ ఉపసంహరించుకోనుంది. ఇటీవల కేంద్ర బడ్జెట్లో ఇందుకు సంబంధించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పథకాన్ని ప్రకటించడం తెలిసిందే. దీనికి సంబంధించి ఆదాయపన్ను శాఖ అత్యున్నత నిర్ణయాల మండలి సీబీడీటీ ఆదేశాలు జారీ చేసింది. 2015–16 అసెస్‌మెంట్ సంవత్సరం వరకు పన్ను చెల్లింపుదారులకు సంబంధించి మొత్తం పన్ను బకాయి రూ.లక్ష వరకు ఉంటే వారికి వెసులుబాటు లభించినట్టయింది. అసెస్‌మెంట్ సంవత్సరం 2010–11కు సంబంధించి పన్ను డిమాండ్ రూ.25,000, అసెస్‌మెంట్ సంవత్సరం 2011–12 నుంచి 2015–16 వరకు రూ.10,000 చొప్పున ఉంటే వాటిని ఉపసంహరించుకోనున్నట్టు సీబీడీటీ తెలిపింది. ఈ ప్రకటనతో మొత్తం రూ.3,500 కోట్ల విలువ చేసే పన్ను డిమాండ్‌లను కేంద్రం వెనక్కి తీసుకోనుంది. అసలు చెల్లించాల్సిన పన్ను, దానిపై వడ్డీ, పెనాల్టీ, సెస్, సర్‌చార్జీ అన్నీ కలిపిన తర్వాతే రూ.లక్ష పరిమితి అమలు కానున్నట్టు సీబీడీటీ స్పష్టం చేసింది.

టాప్ బ్రాండ్లుగా మలబార్ గోల్డ్, టైటాన్

జాబితాలో కల్యాణ్ జ్యుయలర్స్, జాయ్ అలుక్కాస్

ముంబై: అంతర్జాతీయంగా టాప్–100 లగ్జరీ బ్రాండ్లలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, టైటాన్, కల్యాణ్ జ్యుయలర్స్, జాయ్ అలుక్కాస్, సెంకో గోల్డ్, తంగమాయిల్ జ్యుయలరీ స్థానం సంపాదించాయి. ఫ్రాన్స్‌కు చెందిన ఎల్‌వీఎంహెచ్ ఈ జాబితాలో మొదటి స్థానంలో నిలిచింది. భారత్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ జ్యుయలరీ బ్రాండ్‌గా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ముందుంది. జాబితాలో 19వ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. ఆ తర్వాత టాటా గ్రూప్‌నకు చెందిన టైటాన్‌కు 24వ ర్యాంక్ దక్కింది. కల్యాణ్ జ్యుయలర్స్ 46వ స్థాన, జాయ్ అలుక్కాస్ 47వ స్థానంలో ఉన్నాయి. ఇక సెంకో గోల్డ్ అండ్ డైమండ్స్‌కు 78, తంగమాయిల్ జ్యుయలరీకి 98వ స్థానం దక్కాయి. ఈ వివరాలతో డెలాయిట్ గ్లోబల్ లగ్జరీ గూడ్స్ జాబితా 2023 విడుదలైంది. 2023 సంవత్సరంలో మలబార్ గోల్డ్ ఆదాయం 4 బిలియన్ డాలర్లుగా ఉంటే, టైటాన్ టర్నోవర్ 3.67 బిలియన్ డాలర్లుగా ఉంది. 2023 సంవత్సరానికి టాప్–100 అంతర్జాతీయ లగ్జరీ బ్రాండ్ల విక్రయాల విలువ 347 బిలియన్ డాలర్లు. 2022తో పోల్చి చూస్తే 13.4% పెరిగింది.

మలబార్ గోల్డ్ సేవలకు గుర్తింపు

'ప్రపంచ వేదికపై డెలాయిట్ ద్వారా గుర్తింపు పొందడం మాకు ఎంతో గౌరవంగా ఉంది. నాణ్యత, పారదర్శకత, కస్టమర్ల సంతృప్తి పట్ల మా అచంచలమైన నిబద్ధతకు ఇది నిదర్శనం. ఆభరణాల పరిశ్రమలో సరికొత్త ప్రమాణాలను ఏర్పాటు చేయడానికి అంకిత భావంతో పనిచేస్తాం' అని మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహ్మద్ ప్రకటించారు.

నిధుల సమీకరణలో ప్యూర్ ఈవీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ టూ వీలర్ల సంస్థ ప్యూర్ ఈవీ 8 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది. బెన్నెట్ కోల్‌మ్యాన్ అండ్ కంపెనీ, హిందుస్తాన్ టైమ్స్ మీడియా వెంచర్స్ తదితర సంస్థలు ఇన్వెస్ట్ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. సిరీస్ ఏ1 కింద మరో 25 మిలియన్ డాలర్ల నిధుల సమీకరణ తుది దశలో ఉన్నట్లు వివరించింది. అలాగే సిరీస్ ఏ2 ఫండింగ్ కింద 15 మిలియన్ డాలర్ల కోసం దుబాయ్, హాంకాంగ్, సింగపూర్ తదితర దేశాల్లోని ఇన్వెస్టర్లతో చర్చలు జరుపుతున్నట్లు కంపెనీ పేర్కొంది. వచ్చే 6 నెలల్లో దేశవ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను 140 నుంచి 300 డీలర్ల స్థాయికి పెంచుకోనున్నట్లు ప్యూర్ ఈవీ సహ వ్యవస్థాపకుడు రోహిత్ వదేరా తెలిపారు.

ఆతిథ్య రంగం జోరు..

- 2024–25లో 13 శాతం వరకు ఆదాయ వృద్ధి
- దేశీ టూరిజంతో పాటు విదేశీ పర్యాటకుల దన్ను
- క్రిసిల్ రేటింగ్స్ అంచనాలు



ముంబై: ఆతిథ్య రంగం ఆదాయం వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2024–25) 11–13 శాతం మేర వృద్ధి చెందనుంది. దేశీయంగా పర్యాటకానికి డిమాండ్ స్థిరంగా కొనసాగనుండటంతో పాటు విదేశీ పర్యాటకుల సంఖ్య కూడా పెరగనుండటం ఇందుకు తోడ్పడనుంది. క్రిసిల్ రేటింగ్స్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ ఆదాయ వృద్ధి 15–17 శాతం స్థాయిలో ఉండగలదని పేర్కొంది. డిమాండ్ పటిష్టంగా ఉండటం, కొత్తగా హోటల్స్ లభ్యత ఒక మోస్తరుగానే పెరుగుతుండటంతో సమీపకాలంలో పరిశ్రమ లాభదాయకత ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో మెరుగ్గా ఉండనుందని నివేదిక వివరించింది. గదుల అద్దె రేట్లు (ఏఆర్ఆర్) సగటున ఈ ఆర్థిక సంవత్సరం 10–12 శాతం మేర, వచ్చే ఆర్థిక సంవత్సరం 5–7 శాతం మేర పెరగవచ్చని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ ఆనంద్ కులకర్ణి తెలిపారు. ఆక్యుపెన్సీ ఆరోగ్యకరంగా 73–74 శాతం స్థాయిలో కొనసాగవచ్చని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, విదేశీ టూరిస్టుల రాక ఈ ఆర్థిక సంవత్సరమూ పెరగనున్నప్పటికీ కోవిడ్ పూర్వ స్థాయితో పోలిస్తే 10 శాతం తక్కువగానే నమోదు కావచ్చని చెప్పారు. అయితే, వచ్చే ఏడాది ఇది పుంజుకోగలదన్నారు.

ఆచితూచి పెట్టుబడులు..

డిమాండ్ పుంజుకోవడం పరిశ్రమ సెంటిమెంటు మెరుగుపడేందుకు ఊతమిస్తున్నప్పటికీ కొత్తగా పెట్టుబడులు పెట్టేటప్పుడు పరిశ్రమ ఆచితూచి వ్యవహరిస్తోందని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ నితిన్ కన్సల్ తెలిపారు. 'స్థల సేకరణ వ్యయాలు అధికంగా ఉండటం, నిర్మాణ వ్యయాలు పెరిగిపోవడం, పరిశ్రమ సైక్లికల్ స్వభావం కారణంగా లాభాలకు మళ్లాలంటే సుదీర్ఘ సమయం పట్టనుండటం వంటి అంశాల వల్ల కొత్తగా పెట్టుబడి వ్యయాలు చేయాలంటే ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. కాబట్టి బ్రాండ్లు తమ ముందస్తు పెట్టుబడి వ్యయాలను తగ్గించుకునేందుకు మేనేజ్‌మెంట్ కాంట్రాక్టుల ద్వారా గదులను పెంచుకోవడాన్ని కొనసాగించే అవకాశం ఉంది' అని కన్సల్ పేర్కొన్నారు. ఏఆర్ఆర్‌పరమైన ఆదాయ వృద్ధితో సమానంగా నిర్వహణ వ్యయాలు పెరగకపోవడం వల్ల లాభదాయకత మెరుగుపడగలదని ఆయన చెప్పారు. హోటళ్లు ఖర్చులను తగ్గించుకునే క్రమంలో గత రెండేళ్లుగా సిబ్బందిని, ఫుడ్.. బెవరేజీల వ్యయాలను క్రమబద్ధీకరించుకుంటూ పలు చర్యలు తీసుకోవడం కూడా పరిశ్రమకు సానుకూలాంశమని కన్సల్ వివరించారు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

జర్నలిజం కోర్సుల్లో అడ్మిషన్లు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం.. ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిజం కోర్సుల్లో 2024–25 సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు జరుగుతున్నాయి.

కోర్సుల వివరాలు

- » **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం (పిజిడిజె):** ఈ కోర్సు కాల వ్యవధి 12 నెలలు. ఇందులో ప్రవేశం పొందేందుకు కనీస విద్యార్హత డిగ్రీ.
- » **డిప్లొమా ఇన్ జర్నలిజం (డిజె):** ఈ కోర్సు కాల వ్యవధి ఆరు నెలలు. ఇందులో ప్రవేశం పొందేందుకు కనీస విద్యార్హత డిగ్రీ.
- » **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం (డిటివిజె):** ఈ కోర్సు కాల వ్యవధి ఆరు నెలలు. ఇందులో ప్రవేశం పొందేందుకు కనీస విద్యార్హత డిగ్రీ.
- » **సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం(సిజె):**ఈ కోర్సు కాల వ్యవధి 3 నెలలు. ఇందులో ప్రవేశం పొందేందుకు కనీస విద్యార్హత పదో తరగతి.
- » ఈ కోర్సులను రెగ్యులర్‌గాను, దూర విద్య విధానంలోనూ చేయొచ్చు. ఆన్‌లైన్ తరగతుల సౌకర్యం ఉంది. ఇంటి దగ్గర నుంచే పాఠ్యాంశాలను లైవ్‌లో వినవచ్చు.తెలుగు లేదా ఇంగ్లిష్‌ను బోధనా మాధ్యమంగా ఎంపిక చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- » ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందటానికి చివరి తేది: 2024 ఫిబ్రవరి 29
- » అడ్మిషన్లు పొందటానికి చివరి తేది: 2024 మార్చి 5
- » పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.apcj.in

వైఎస్సార్ జిల్లా రోడ్లు, భవనాల శాఖలో 24 పోస్టులు

వైఎస్సార్ జిల్లా కడప రోడ్లు, భవనాల శాఖలో.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 24
- » పోస్టుల వివరాలు: వాచ్‌మెన్–06, శానిటరీ వర్కర్–08, అటెండర్–10.
- » అర్హత:పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.వయసు: 42ఏళ్లు మించకూడదు
- » వేతనం: నెలకు రూ.15,000.
- » దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సూపరింటెండెంట్ ఇంజనీర్(ఆర్ అండ్ బి) కార్యాలయం, సర్కిల్ ఆఫీస్, మారుతి నగర్, కడప చిరునామకు పంపించాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 22.02.2024.
- » దరఖాస్తు పరిశీలన తేదీలు: 23.02.2024 నుంచి 26.02.2024 వరకు
- » వెబ్‌సైట్: https://kadapa.ap.gov.in

టార్గెట్.. ఐఏఎస్

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ వంటి 21 ఉన్నత సర్వీసుల్లో..నియామకాల కోసం జాతీయ స్థాయిలో ప్రతి ఏటా నిర్వహించే పరీక్ష! యూపీఎస్సీ తాజాగా 1056 పోస్టుల భర్తీకి సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024కు నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఏదైనా డిగ్రీతో పోటీపడొచ్చు. ఈ నేపథ్యంలో సివిల్స్-2024 నోటిఫికేషన్ సమాచారం, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

- » సివిల్స్-2024 నోటిఫికేషన్ విడుదల
- » 21 సర్వీసుల్లో 1,056 పోస్టులతో నోటిఫికేషన్
- » మే 26న తొలి దశ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్



సివిల్స్-2024

21 సర్వీసులు.. 1,056 పోస్టులు

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2024 ద్వారా... ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ సహా మొత్తం 21 ఉన్నత స్థాయి సర్వీసుల్లో 1,056 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

అర్హత

గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత ఉండాలి. 2024లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వారు మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే సమయానికి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

వయసు

ఆగస్ట్ 1, 2024 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్యలో ఉండాలి. గరిష్ట వయోపరిమితిలో ఎస్సీ/ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ వర్గాలకు మూడేళ్ల వరకు సడలింపు లభిస్తుంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్టంగా ఆరుసార్లు మాత్రమే పరీక్షకు హాజరయ్యేందుకు అవకాశం ఉంటుంది. ఓబీసీలు తొమ్మిదిసార్లు, ఎస్సీ/ఎస్టీలు గరిష్ట వయోపరిమితికి లోబడి ఎన్నిసార్లయినా పరీక్షకు హాజరుకావచ్చు.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

సివిల్ సర్వీసెస్ పోస్టుల భర్తీకి మూడంచెల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్ (పర్సనల్ ఇంటర్వ్యూ).

ప్రిలిమినరీ పరీక్ష

సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలోని మొదటి దశ ప్రిలిమినరీ పరీక్ష. ఈ పరీక్ష రెండు పేపర్లుగా 400 మార్కులకు ఉంటుంది. పేపర్–1 జనరల్ స్టడీస్ 200 మార్కులు, పేపర్–2 జనరల్ స్టడీస్ 200 మార్కులకు ఉంటాయి. ప్రిలిమినరీ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వంతు మార్కులను తగ్గిస్తారు. పేపర్–2లో 33 శాతం మార్కులను కనీస అర్హత మార్కులుగా పేర్కొన్నారు.

రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్

సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారిని ఒక్కో పోస్ట్‌కు 12 లేదా 13 మందిని చొప్పున మెయిన్‌కు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామ్.. ఇలా

- సివిల్స్ రెండో దశ పరీక్ష మెయిన్ ఎగ్జామినేషన్.. రెండు లాంగ్వేజ్ పేపర్లు, ఒక జనరల్ ఎస్సే పేపర్, నాలుగు జనరల్ స్టడీస్ పేపర్లు, రెండు ఆప్షనల్ పేపర్లతో నిర్వహిస్తారు. మెయిన్స్ పరీక్షలోని రెండు లాంగ్వేజ్ పేపర్లు 300 మార్కులకు చొప్పున ఉంటాయి. అవి..పేపర్–ఎ ఇండియన్ లాంగ్వేజ్–300 మార్కులు, పేపర్–బి ఇంగ్లిష్ -300 మార్కులు. ఈ రెండు పేపర్లలో కనీస మార్కులు పొందితేనే మిగతా పేపర్ల మూల్యాంకన చేసి.. మెరిట్ జాబితా రూపొందిస్తారు.
- పేపర్–1 జనరల్ ఎస్సే–250 మార్కులకు; పేపర్–2 జనరల్ స్టడీస్–1 (ఇండియన్ హెరిటేజ్, కల్చర్, హిస్టరీ అండ్ జాగ్రఫీ, సొసైటీ) 250 మార్కులకు; పేపర్–3 జనరల్ స్టడీస్–2 (గవర్నెన్స్, కాన్‌స్టిట్యూషన్, పాలిటీ, సోషల్ జస్టిస్, అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్) 250 మార్కులకు; పేపర్–4 జనరల్ స్టడీస్–3 (టెక్నాలజీ, ఎకనామిక్ డెవలప్‌మెంట్, బయో డైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్, సెక్యూరిటీ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) 250 మార్కులకు; పేపర్–5 జనరల్ స్టడీస్–4 (ఎథిక్స్, ఇంటెగ్రిటీ, ఆప్టిట్యూడ్) 250 మార్కులకు; పేపర్–6 ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్–1, 250 మార్కులకు; పేపర్–7 ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్–2, 250 మార్కులకు ఉంటాయి. ఇలా మెయిన్ ఎగ్జామినేషన్‌ను ఏడు పేపర్లలో మొత్తం 1,750 మార్కులకు పూర్తి డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు.

చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ

సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో చివరి దశ పర్సనాలిటీ టెస్ట్. దీనినే ఇంటర్వ్యూ అని కూడా పిలుస్తారు. మెయిన్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ఇద్దరిని చొప్పున ఎంపిక చేసి పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. దీనికి కేటాయించిన మార్కులు 275. మెయిన్స్+ పర్సనాలిటీ టెస్ట్‌లోనూ చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతలను ప్రకటిస్తారు.

ప్రిలిమ్స్‌లో.. విజయం సాధించేలా

తొలి దశ ప్రిలిమినరీ పరీక్షలో.. జనరల్ స్టడీస్ పేపర్–1లో హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ ఈవెంట్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. పేపర్ 2లో.. రీడింగ్ కాంప్రహెన్షన్, న్యూమరికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

సిలబస్‌పై అవగాహన

సివిల్స్ అభ్యర్థులు ముందుగా.. సిలబస్‌ను ఆసాంతం పరిశీలించాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలు, సదరు అంశాల్లో తమ వ్యక్తిగత సామర్థ్య స్థాయి తెలుసుకోవాలి. ఫలితంగా ప్రిపరేషన్‌లో తాము ఎక్కువగా దృష్టి సారించాల్సిన అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. దీని ద్వారా ఏ అంశాలకు ఎంత సమయం కేటాయించాలి.. ఏ పుస్తకాలు చదవాలో స్పష్టత వస్తుంది. దీంతోపాటు గత ప్రశ్న పత్రాల పరిశీలన, విశ్లేషణ ద్వారా ప్రశ్నలు అడుగుతున్న శైలి.. ఏఏ అంశాలకు ఎంత ప్రాధాన్యం ఉంటుంది? వంటి వాటిపై అవగాహన కలుగుతుంది.

ప్రామాణిక పుస్తకాలు

సిలబస్‌పై అవగాహన పొందాక.. వాటికి సంబంధించిన ప్రామాణిక పుస్తకాలను సేకరించుకోవాలి. సిలబస్‌లో పేర్కొన్న అన్ని అంశాలు పొందుపర్చిన పుస్తకాల్ని ఎంపిక చేసుకోవాలి. ఆయా సబ్జెక్టులకు ప్రామాణికంగా భావించే ఒకట్రెండు పుస్తకాలకు పరిమితమవడం మేలు. సిలబస్, మెటీరియల్ సేకరణలో స్పష్టత లభించిన అభ్యర్థులు.. పూర్తి స్థాయి ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి.

సమకాలీనంపై పట్టు

అభ్యర్థులు ప్రిపరేషన్‌లో కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం ఇవ్వడం ఉపయుక్తంగా ఉంటుంది. కారణం.. గత మూడు, నాలుగేళ్లుగా కరెంట్ అఫైర్స్‌కు సంబంధించిన ప్రశ్నల సంఖ్య పెరుగుతోంది. కాబట్టి కరెంట్ అఫైర్స్ టాపిక్స్‌ను కోర్ అంశాలతో అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. దీంతోపాటు అభ్యర్థులు ఒక సబ్జెక్ట్‌ను మరో సబ్జెక్ట్‌తో అనుసంధానం చేసుకుంటూ అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. ఉదాహరణకు.. జాగ్రఫీని చదివేటప్పుడు అందులో ఉండే జనాభా, పంటలు, సహజ వనరులు–ఉత్పాదకత తదితర అంశాలను ఎకనామిక్స్‌తో సమన్వయం చేసుకుంటూ చదవాలి. ఫలితంగా ఒకే సమయంలో రెండు అంశాలపైనా పట్టు లభిస్తుంది. ఇదే తరహాలో పాలిటీ–ఎకానమీ ప్రిపరేషన్ సాగించొచ్చు.

డిస్క్రిప్టివ్ అప్రోచ్

ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. కాని అభ్యర్థులు డిస్క్రిప్టివ్ పద్ధతిలో ప్రిపరేషన్ సాగించడం మేలు చేస్తుంది. దీనివల్ల ఆయా అంశాలపై అన్ని కోణాల్లో అవగాహన లభిస్తుంది. ఇది మెయిన్స్ ప్రిపరేషన్‌ను సులభం చేస్తుంది.

ఇవెంతో ముఖ్యం

ప్రిలిమ్స్ ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అంశాలు.. జాగ్రఫీ, ఎకాలజీ–ఎన్విరాన్‌మెంట్, సైన్స్ అండ్ టెక్నాలజీ! ఎందుకంటే.. ఇటీవల కాలంలో చర్చనీయాంశంగా మారిన పర్యావరణ కాలుష్యం, అందుకు సంబంధించి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో చేపడుతున్న చర్యలు వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి తాజాగా మన దేశం ప్రయోగించిన ఉపగ్రహాలు, వాటి లక్ష్యాలు వంటి అంశాలు తెలుసుకోవాలి.

పేపర్-2కు ఇలా

అర్హత పేపర్‌గానే పేర్కొంటున్నప్పటికీ.. పేపర్-2 పైనా అభ్యర్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎందుకంటే..ఈ పేపర్‌లో కనీసం 33 శాతం మార్కులు సాధిస్తేనే పేపర్–1ను మూల్యాంకన చేస్తారు. దాని ఆధారంగా మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. పేపర్ 2 కోసం బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. ఇంగ్లిష్ దినపత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలి. న్యూమరికల్ ఎబిలిటీకి సంబంధించి పదో తరగతి స్థాయిలో మ్యాథమెటిక్స్, ప్రధానంగా అర్థమెటిక్‌కు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి.

మెయిన్స్‌తో అనుసంధానం

ప్రిలిమ్స్ ప్రిపరేషన్ సమయంలోనే.. మెయిన్స్‌తో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. మెయిన్స్‌లో ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్లు, ఎథిక్స్ పేపర్ మినహా.. మిగతా అన్ని పేపర్లు ప్రిలిమ్స్ జనరల్ స్టడీస్‌లో నిర్దేశించిన విభాగాలకు సంబంధించినవే. ఆయా సబ్జెక్ట్‌లను డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో చదివితే మెయిన్స్‌కు కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఆయా సిలబస్ అంశం నేపథ్యంతోపాటు సమకాలీన పరిణామాలతో అనుసంధానం చేసుకుంటూ చదివితే..ప్రిలిమ్స్‌లో అడుగుతున్న విభిన్న శైలి ప్రశ్నలకు సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

టైమ్ మేనేజ్‌మెంట్-రివిజన్

అభ్యర్థులు సమయ పాలన పాటించాలి. ప్రతి రోజు కనీసం ఎనిమిది గంటలు ప్రిపరేషన్ సాగించే విధంగా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి. ప్రతి రోజు అన్ని సబ్జెక్ట్‌లను చదివే విధంగా వ్యవహరించాలి. దీంతోపాటు ప్రిపరేషన్‌లో భాగంగా రివిజన్‌ను అత్యంత కీలకమని గుర్తించాలి. పరీక్షకు నెల రోజుల ముందు నుంచి పూర్తిగా రివిజన్‌కే సమయం కేటాయించే విధంగా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. రివిజన్‌తోపాటు మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావడం కూడా మేలు చేస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మార్చి 5
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: 2024 మార్చి 6 – 12 వరకు
- ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 2024, మే 26
- మెయిన్ ఎగ్జామ్: సెప్టెంబర్ 20 నుంచి అయిదు రోజులు
- వెబ్‌సైట్: https://www.upsc.gov.in

టర్నింగ్‌లున్నాయ్.. డ్రైవింగ్ జాగ్రత్త

సాక్షిప్రతినిధి, వరంగల్

హైదరాబాద్ నుంచి మేడారం 245 కిలోమీటర్లు. కారులో వెళ్లేవారికి 5.20 గంటల సమయం పడుతుంది. ఎన్‌హెచ్‌–163 రహదారిపై ప్రయాణించే భక్తులు హైదరాబాద్, యాదగిరిగుట్ట, జనగామ, రఘునాథపల్లి, కరుణాపురం, కాజీపేట, ఆత్మకూరు, మల్లంపల్లి, ములుగు, జంగాలపల్లి, చల్వాయి, పస్రా, నార్లపూర్‌ల మీదుగా మేడారం చేరుకోవాలి.


- ఈ రోడ్డుపై పెంబర్తి శివారులో 90–90.5 కి.మీ. లు, వీఓ హోటల్ నుంచి అక్షయ హోటల్ 9.5–94 కి.మీ. లలో తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి.
- జనగామ– నెల్లుట్ల మధ్యలో రోడ్డు దాటేందుకు ఇబ్బందులు తప్పవు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై పలువురు చనిపోయారు. పెంబర్తి, నిడిగొండ, యశ్వంతాపూర్, రాఘవాపూర్, చాగల్లు, పెండ్యాల అండర్‌పాస్‌లు లేకపోవడంతో జాతీయరహదారి దాటేందుకు ఇబ్బందులు తప్పవు.
- నెల్లుట్ల బైపాస్ రోడ్డు ఆర్టీసీ కాలనీ బ్రిడ్జి, నడిగొండ యూటర్న్, రఘునాథపల్లి శివారు, ఛాగల్, స్టేషన్‌ఘన్‌పూర్, కరుణాపురం, ధర్మసాగర్ మండలం రాంపూర్‌క్రాస్‌రోడ్డు, మడికొండ కందాల దాబా, కాజీపేట డీజిల్ కాలనీ, కాజీపేట నుంచి ఫాతిమా ఫ్లైఓవర్, సుబేదారి ఫారెస్టు ఆఫీసు, దామెర మండలం పసరగొండ, ఊరుగొండ శివారు, ఆత్మకూరు మండలం నీరుకుళ్ల క్రాస్‌రోడ్, కటాక్షపూర్‌లను 'బ్లాక్‌స్పాట్'లుగా అధికారులు గుర్తించారు.
- మల్లంపల్లి, ములుగు, జంగాలపల్లి, చల్వాయి, పస్రా, నార్లపూర్‌ల మూలమలుపుల ముప్పును అధిగమించితే మేడారం చేరుకున్నట్టే.



ప్రత్యేక చర్యలు చేపట్టాం

మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరకు వెళ్లే వాహనదారులు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాం. నిబంధనలకు మించి ఎక్కువ మందిని వాహనాల్లో తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటాం.

పుప్పాల శ్రీనివాస్, డీటీసీ, హనుమకొండ



కరీంనగర్ నుంచి మేడారం 153 కి.మీ.

కరీంనగర్ టు మేడారం 153 కి.మీ.లు. కరీంనగర్, కేశవపట్నం, హుజూరాబాద్, కమలాపూర్, రేగొండల మీదుగా ములుగు చేరుకుని వెంకటాపూర్, చల్వాయిల మీదుగా మేడారానికి 3.40 గంటల సమయం పడుతుంది.

- భూపాలపల్లి నుంచి మేడారం 53.8 కిలోమీటర్లు. మల్లంపల్లి, రాంపూర్, దూదేకులపల్లి, బయ్యక్కపేట, తక్కళ్లగూడెం, నార్లపూర్‌ల మీదుగా 1.10 గంటల నుంచి 1.30ల వ్యవధిలో మేడారం చేరుకోవచ్చు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ సమీపంలోని కొత్తపల్లి వద్ద, కాళేశ్వరం– మహదేవపూర్ మధ్య మూలమలుపులు ప్రమాద భరితంగా ఉన్నాయి.
- కాళేశ్వరం నుంచి ఇసుక లారీలు ఎక్కువగా 353 సీ జాతీయ రహదారిపై ప్రయాణిస్తాయి. ఒక్కోసారి వీటిని రోడ్డు పక్కనే నిలుపుతారు. వీటివల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువ.
- భూపాలపల్లి, పరకాల, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ శివారు ప్రాంతాల్లోనూ రహదారి పక్కనే వాహనాలు నిలుపుతున్నారు.

తాడ్వాయి మీదుగా అనుమతి వీరికే...

ఆర్టీసీ బస్సులు, వీవీఐపీ పాస్‌లు ఉన్న వాహనాలు హనుమకొండ, ములుగు రోడ్డు, గుడెప్పాడ్, పస్రా, తాడ్వాయి నుంచి నేరుగా మేడారం వెళతాయి. ప్రైవేట్ వాహనాలు మాత్రం పస్రా నుంచి నార్లాపూర్, మేడారం వెళ్లాలి. తాడ్వాయి మీదుగా అనుమతి లేదు. పొరపాటున వెళ్లినా తాడ్వాయి వద్ద వెనక్కి పంపుతారు.

మహబూబాబాద్ నుంచి మేడారం 134 కి.మీ.

సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి నర్సంపేట ద్వారా మేడారం వెళ్లే భక్తులు సొంత వాహనంలో అయితే 134 కిలోమీటర్లు ప్రయాణించాలి. గమ్యస్థానానికి 3.20 గంటల్లో మహబూబాబాద్, గూడూరు, ఖానాపూర్, నర్సంపేట, నల్లబెల్లి, మల్లంపల్లి, జాకారం, ములుగు, జంగాలపల్లి, చల్వాయి, పస్రా, నార్లపూర్‌ల మీదుగా మేడారం చేరుకోవచ్చు.

- నర్సంపేట నుంచి మేడారం వరకు ఈ దారిలో 30 వరకు మూలమలుపులు ఉన్నట్టు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు గుర్తించారు.

వరంగల్ నుంచి మేడారం 95.5 కిలోమీటర్లు

వరంగల్ నుంచి మేడారం 95.5 కిలోమీటర్లు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుంటే భక్తులు ఎన్‌హెచ్ 163 రహదారి గుండా 2.20 గంటల నుంచి 2.40 గంటల వ్యవధిలో చేరుకోవచ్చు. వరంగల్ నుంచి మేడారం వెళ్లే భక్తులు హనుమకొండ, ఆరెపల్లి, దామెర, ఆత్మకూరు, జవహర్‌నగర్, మచ్చాపూర్, చల్వాయి, గోవిందరావుపేట, రాఘవపట్నం, ఇప్పలగడ్డ, మొట్లగూడెం, వెంగ్లాపూర్, నార్లపూర్ ద్వారా మేడారం చేరుకుంటారు.

- ములుగు గట్టమ్మ సమీపంలో మూడు మలుపులుంటాయి. ఇదివరకు ఇక్కడ పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి.
- హనుమకొండ–ములుగు మధ్య 163 జాతీయ రహదారి ఆరెపల్లి–గుడెప్పాడ్ మధ్య రోడ్డు విస్తరణ పనులు పూర్తయినా, ఎక్కడా సూచిక బోర్డులు లేనందున జాగ్రత్తగా వెళ్లాలి.

హైదరాబాద్ నుంచి మేడారం 245 కిలోమీటర్లు

అమ్మో... ఆ 3 యూటర్న్‌లు

హైదరాబాద్‌–వరంగల్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా చిల్పూరు మండలం చిన్నపెండ్యాల బస్‌స్టేజీ నుంచి వంగాలపల్లి–కరుణాపురం బస్‌స్టేజీల వరకు మూడు యూటర్న్‌లు ఉన్నాయి.

- చిన్నపెండ్యాల నుంచి ఘన్‌పూర్ వెళ్లాల్సిన వాహనాలు గ్రానైట్ సమీపంలో యూటర్న్ తీసుకోవాలి. వాహన చోదకులు తక్కువ దూరంలో దాబా హోటల్ సమీపంలో రాంగ్ రూట్‌లో యూటర్న్ తీసుకుంటున్నారు.
- హనుమకొండ నుంచి చిన్నపెండ్యాల గ్రామంలోకి వెళ్లాల్సిన వాహనాలు దాబా ముందు యూటర్న్ తీసుకోవాలి. వాహన చోదకులు గ్రానైట్ వద్ద రాంగ్ రూట్‌లో యూటర్న్ తీసుకుంటున్నారు. దీంతో ఈఏడాది 10 రోడ్డు ప్రమాదాలు జరగగా ఐదుగురు మృతిచెందారు. జాతర వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలి.



జనగామ జిల్లా చిల్పూరు రాంగ్ రూట్‌లో యూటర్న్ తీసుకుంటున్న ఆటో

'మహా'డేంజర్ మలుపులు!

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం మీదుగా మేడారం మహాజాతరకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల భక్తులు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాల్లో భారీగా తరలివస్తారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి, గొండియా జిల్లాలు, ఛత్తీస్‌గఢ్ నుంచి భూపాలపట్నం, బీజాపూర్ జిల్లాల భక్తులు, తెలంగాణ నుంచి పూర్వపు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, చెన్నూర్‌ల నుంచి ఈ దారిగుండా మేడారం జాతరకు వస్తారు.

కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన నుంచి కాటారం వరకు 32 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి 353(సీ) పైన 18 అతి ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయి. దీంతో త్వరగా గమ్యం చేరాలని వాహన దారులు ఆదమరిచి వాహనం నడిపితే మృత్యుఒడిలోకి చేరినట్టే. ఈ రహదారిపై అంతర్రాష్ట్ర వంతెన నుంచి ఎస్పీకాలనీ వద్ద, అన్నారం మూలమలుపు, అడవి మధ్యలోని డేంజర్ క్రాసింగ్‌ల వద్ద అనేక ప్రమాదాలు జరిగాయి. కనీసం ఇక్కడ ఎన్‌హెచ్ అధికారులు కూడా ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు.



అన్నారం వద్ద ఇలా...

చల్వాయి బస్టాండ్: జర చూసి నడపండి

ములుగు జిల్లా గోవిందరావు పేట మండలం చల్వాయి గ్రామం మొత్తం 4 కిలోమీటర్లు ఉంటుంది. రెండు మాత్రమే యూటర్న్ పాయింట్లు ఉండడం వల్ల వాహనాల్లో ప్రయాణించే వారు, గ్రామస్తులు ఈ పాయింట్స్ నుంచే రోడ్డు క్రాస్ అవుతారు. కాబట్టి ఇక్కడ ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.



- పస్రా, గోవిందరావుపేట గ్రామాల మధ్యలో ఉన్న చర్చి మూలమలుపు ఇప్పటికే చాలా మంది ప్రాణాలను బలి తీసుకుంది. ఎక్కువగా ప్రమాదాలు ఇక్కడే జరుగుతాయి. రోడ్డు పై ఎలాంటి హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడం, ఈ ప్రాంతానికి రాగానే రోడ్డు వెడల్పుగా కనిపిస్తుంది. దగ్గరలో గ్రామాలు లేకపోవడంతో వాహనదారులు అధికవేగంతో రావడం వల్ల వాహనాన్ని కంట్రోల్ చేయలేక, మూలమలుపు తప్పించలేక ప్రమాదాలు జరుగుతుంటాయి. భక్తులు ఇక్కడ చాలా జాగ్రత్తగా వాహనం నడపాలి.

హైదరాబాద్ టు మేడారం : 3 టోల్‌గేట్లు

హైదరాబాద్ నుంచి మేడారం జాతర వచ్చే ప్రయాణికులు మూడు టోల్‌గేట్లు దాటాలి. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ వద్ద, జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమళ్ల వద్ద మరోటి, ములుగు దాటాక జవహర్‌నగర్ వద్ద ఇంకో టోల్‌గేట్ ఉంటుంది. అయితే జాతర జరిగే 4 రోజులపాటు జవహర్‌నగర్ వద్ద టోల్ ఎత్తేస్తారు.

ఇవి తప్పనిసరిగా పాటించండి

- వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. పరిమితికి మించిన వేగం మంచిది కాదు.
- ఓవర్‌టేక్ చేసే క్రమంలోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఓవర్‌టేక్ చేయకపోవడమే బెటర్.
- మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతరకు వెళ్లే వాహన చోదకులు మద్యానికి దూరంగా ఉండాలి.
- మూలమలుపులు, ఇరుకు వంతెనలు, రహదారుల వద్ద వేగం తగ్గించాలి.

నిర్ణీత స్థలాల్లోనే పార్కింగ్ చేయాలి

జాతరకు వచ్చే భక్తులు వాహనాలను జాతరలో కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయాలి. భక్తులకు తెలిసేలా అన్నిచోట్ల సైన్ బోర్డులు ఏర్పాటు చేశాం. జాతర పరిసర ప్రాంతాల్లో 10 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి కరెంట్, నీటి సరఫరా అందుబాటులో ఉంచాం. రోడ్లపై అడ్డంగా నిలిపే వాహనాలను ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోకి టోయింగ్ వాహనాలతో తరలిస్తాం.



అంబర్ కిషోర్ ఝా
మేడారం జాతర ట్రాఫిక్ ఇన్‌చార్జ్, వరంగల్ సీపీ

ముంబై నుంచే గవర్నర్ 'ఎక్స్' ఖాతా హ్యాక్

- అక్కడి ఓ బుటీక్ వైఫై నెట్‌వర్క్ వినియోగించిన దుండగుడు
- సాంకేతిక ఆధారాల ద్వారా గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ తమిళిసై అధికారిక 'ఎక్స్'(ట్విట్టర్) ఖాతా హ్యాకింగ్‌కు సంబంధించి సైబర్ క్రైమ్ పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ముంబై కేంద్రంగానే ఈ హ్యాకింగ్ జరిగినట్లు తేల్చారు. గవర్నర్‌కు చెందిన అధికారిక 'ఎక్స్'ఖాతాను గవర్నర్ మీడియా సెక్రటరీ సహా రాజ్‌భవన్ వర్గాలు పర్యవేక్షిస్తుంటాయి. దీనికి అనుసంధానించి ఉన్న ఈ–మెయిల్ ఐడీకి సైబర్ నేరగాడు ఓ మెయిల్ పంపాడు. ఎక్స్‌కు చెందిన సపోర్ట్ టీమ్ పేరుతో రూపొందించిన ఆ మెయిల్‌లో గవర్నర్‌కు చెందిన ఖాతాలో ఉన్న కొన్ని పోస్టులపై ఫిర్యాదులు అందాయని, వాటికి సమాధానం ఇవ్వడానికి క్లిక్ చేయాలంటూ ఓ లింక్ పంపాడు. రాజ్‌భవన్ వర్గాలు ఆ లింకును క్లిక్ చేయడంతో ఆ ఫోన్‌తో పాటు వాట్సాప్ ఖాతాను తన ఆధీనంలోకి తీసుకున్నాడు. ఎక్స్'ఖాతాను యాక్సస్ చేసిన సైబర్ నేరగాడు డీపీగా ఉండే గవర్నర్ ఫొటోను తొలగించి, పాస్‌వర్డ్ మార్చేశాడు. దీనిపైరాజ్‌భవన్ వర్గాలు గతనెల 16న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

ఐపీ అడ్రస్ ఆధారంగా గుర్తింపు...

'ఎక్స్'సపోర్ట్ టీమ్ మాదిరిగా ఈ–మెయిల్ ఐడీ సృష్టించిన వ్యక్తికి సంబంధించిన ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ (ఐపీ) అడ్రస్‌పై సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. ఈ వివరాలను అందించాల్సిందిగా కోరుతూ 'ఎక్స్'కు అధికారికంగా మెయిల్ పంపారు. దీనిపై స్పందించిన ఈ సంస్థ ఓ అడ్రస్ అందించింది. దాని ఆధారంగా ముందుకు వెళ్లిన సైబర్ క్రైమ్ అధికారులు అది ముంబైలోని ఓ బుటీక్‌కు సంబంధించిన వైఫై రూటర్ ఐడీగా గుర్తించారు. దీంతో అక్కడకు వెళ్లిన ప్రత్యేక బృందం దాని నిర్వాహకురాలిని ప్రశ్నించగా, గత నెల 15 నుంచి మూడు రోజుల పాటు తాము బుటీక్ తెరవలేదని వారు చెప్పారు. అది ఓపెన్ వైఫై కావడంతోసైబర్ నేరగాడు వర్చువల్‌గానే ఈ వైఫైని యాక్సస్ చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆర్టీసీ బస్సులు హౌస్‌ఫుల్

మేడారం జాతరకు 4,479 బస్సుల కేటాయింపు

- ఇప్పటికే కొన్ని బస్సులు నిర్దిష్ట ప్రాంతాలకు తరలింపు
- సోమవారం బస్‌స్టేషన్లు, బస్సులు కిటకిట
- సోమవారం రద్దీకి తోడు బస్సుల తరలింపు ఫలితం
- బుధవారం నుంచి ఆదివారం వరకు 4,479 బస్సులు జాతరకే.. 'మహాలక్ష్మి'రద్దీ కొనసాగితే ప్రయాణికులకు యాతనే

సాక్షి, హైదరాబాద్: మేడారం జాతరకు భారీ సంఖ్యలో ఆర్టీసీ బస్సులు వినియోగించనుండటంతో సాధారణ ప్రయాణికులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈసారి జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీంతో భారీ సంఖ్యలో బస్సులను సమకూర్చింది. 4,479 ఆర్టీసీ బస్సులతో పాటు పాఠశాల, కళాశాల బస్సుల్లాంటి ప్రైవేటు వాహనాలు మరో 1,500 వరకు ఏర్పాటు చేసింది. ఇలా సుమారు 6 వేల బస్సులు ఐదు రోజుల పాటు మేడారం భక్తుల సేవలో ఉండనున్నాయి. ఇప్పటికే కొన్ని బస్సులు నిర్దిష్ట ప్రాంతాలకు తరలిపోవడంతో బస్‌స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. ఇక ఒకేసారి పెద్ద సంఖ్యలో బస్సులు అందుబాటులో లేకపోతే సాధారణ ప్రయాణికుల తిప్పలు మరింత తీవ్రమయ్యే అవకాశం కన్పిస్తోంది. ప్రయాణికులు ప్రత్యామ్నాయం చూసుకోవాలని ప్రభుత్వం సూచించడం గమనార్హం.

'మహాలక్ష్మి'తో పెరిగిన ప్రయాణికుల సంఖ్య

ప్రస్తుతం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ వసతి అందుబాటులో ఉండటంతో ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే మహిళల సంఖ్య భారీగా పెరిగిన విషయం తెలిసిందే. గతంలో ఆటోలు లాంటి ప్రైవేటు వాహనాల్లో వెళ్లేవారిలో 90 శాతం మంది బస్సుల వైపు మళ్లారు. దీంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య రోజుకు 30 లక్షల మేర ఉంటోంది. ఫలితంగా బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఇలాంటి సమయంలో ఒకేసారి ఇన్ని బస్సులు అందుబాటులో లేకుండాపోతే పరిస్థితి గందరగోళంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఇది ఖమ్మం బస్టాండులో మేడారం ప్రత్యేక బస్సులో పరిస్థితి. పది మంది మించి ప్రయాణికులు లేకుండానే ఈ బస్సులు పరుగు పెడుతున్నాయి




ఖమ్మం బస్టాండులోనే గార్ల-ఇల్లెందు బస్సువద్ద రెండు బస్సులకు సరిపడా ప్రయాణికులు చేరటంతో.. లోపలికి చేరేందుకు పోటీపడుతున్న దృశ్యం

తొలిరోజే అవస్థలు

రాష్ట్రంలోని 51 కేంద్రాల నుంచి మేడారం ప్రత్యేక బస్సులు నడవాల్సి ఉంది. దీంతో విడతల వారీగా బస్సులు ఆయా కేంద్రాలకు తరలిపోతున్నాయి. సోమవారం దాదాపు 550 బస్సులు వెళ్లాయి. హైదరాబాద్ నగరం నుంచి కూడా 250 బస్సులు వెళ్లిపోయాయి. సాధారణంగా సోమవారాల్లో బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. స్పేర్ బస్సులు సహా అన్ని బస్సులను తిప్పినా ఆ రోజు రద్దీని తట్టుకోవటం ఇబ్బందిగా ఉంటుంది. గత సోమవారం ఏకంగా 65 లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో తిరిగారు. ఈ సోమవారం కొన్ని బస్సులు మేడారం జాతరకు వెళ్లిపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి. బస్సులు సరిపోక తోపులాటలు చోటు చేసుకున్నాయి. నగరంలో ఫుట్‌బోర్డులపై వేళ్లాడుతూ ప్రయాణించాల్సి వచ్చింది. ఇక బుధవారం నుంచి మిగతా బస్సులు వెళ్లిపోతే పరిస్థితి ఏంటని అధికారుల్లో టెన్షన్ మొదలైంది. సాధారణ రోజుల్లోలాగే బుధవారం తర్వాత కూడా రద్దీ ఉంటే మేడారం డ్యూటీ బస్సుల్లో కొన్నింటిని తిరిగి వాపస్ పంపే యోచనలో ఉన్నారు. కానీ మేడారం ప్రయాణికుల రద్దీ కూడా ఎక్కువగా ఉంటే పరిస్థితి ఏంటన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈసారి రైల్వే అధికారులు 30 ప్రత్యేక రైళ్లను మేడారం కోసం తిప్పుతున్నారు. ఒక రైలులో 1,500 మంది ప్రయాణికులు వస్తారు. మేడారం వరకు రైల్వే లైన్ లేనందున ఎక్కువ మంది కాజీపేట, వరంగల్, మహబూబాబాద్ స్టేషన్లలో దిగుతారు. దీంతో రైలు వచ్చే సమయానికి ఒక్కో స్టేషన్ వద్ద 30కి పైగా బస్సులను అందుబాటులో ఉంచాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం మీద వచ్చే ఆదివారం వరకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పేలా లేవని అంటున్నారు.



పగిడిద్దరాజుతో నడుస్తున్న అర్రెం వంశీయులు



జంపన్నవాగులో చేరిన లక్నవరం నీరు

పగిడిద్దరాజు మేడారం పయనం

గుండాల/ఎస్ఎస్ తాడ్వాయి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం యాపలగడ్డ నుంచి సమ్మక్క భర్త, అర్రెం వంశీయుల ఇలవేల్పు పగిడిద్దరాజు మేడారం పయనమయ్యాడు. ములుగు జిల్లా మేడారంలో రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క–సారలమ్మ జాతరకు పగిడిద్దరాజును అర్రెం వంశీయులు తీసుకెళ్లడం ఆనవాయితీ. సోమవారం పగిడిద్దరాజు గర్భగుడి వద్ద పడగ(జెండా)లు, ఆభరణాలకు వడ్డెలు ప్రత్యేక పూజలు చేశాక గద్దెలపైకి చేర్చారు. మంగళవారం సాయంత్రం వరకు మేడారంలోని జంపన్నవాగు వద్దకు కాలినడకన చేరుకుని అక్కడే బసచేస్తారు. బుధవారం కొండాయిగూడెం నుంచి వచ్చే గోవిందరాజు, కన్నెపల్లి నుంచి వచ్చే సారలమ్మతోపాటు పగిడిద్దరాజును గద్దెల పైకి చేరుస్తారు.

జంపన్నవాగుకు చేరిన లక్నవరం నీళ్లు

మేడారం జాతరకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా లక్నవరం నుంచి నీటిని విడుదల చేయగా సోమవారం జంపన్నవాగుకు చేరుకుంది. శివసత్తులు జంపన్నవాగులో మునిగి పూనకాలతో ఊగిపోయారు. అందులో స్నానం చేస్తే సర్వరోగాలు పోతాయని భక్తుల విశ్వాసం.

'జాతర ఖర్చులు వెల్లడిస్తాం'

ఏటూరునాగారం/ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జాతరకు చేసిన ఖర్చుల వివరాలను వెల్లడిస్తామని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్త్రీ,శిశు సంక్షేమశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క చెప్పారు. ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం వనదేవతలను సోమవారం దర్శించుకున్న అనంతరం మంత్రులు విలేకరులతో మాట్లాడారు. జాతరకు డబ్బు లేదనకుండా ఖర్చు చేసి ఏర్పాట్లు చేశామన్నారు. గత ప్రభుత్వం జాతరకు మూడు వేల బస్సులను నడిపితే.. ఈ ప్రభుత్వం ఆరువేల బస్సులు నడుపుతోందన్నారు. ఇప్పటివరకు వనదేవతలను 17 లక్షల మంది మహిళలు దర్శించుకున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ రానంతమంది ఈసారి జాతరకు వచ్చిపోతున్నారని, వారికి ఎక్కడా ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించామన్నారు. క్రమశిక్షణ, స్వీయ రక్షణతో జాతరకు వచ్చివెళ్లాలని, వాహనాలను ఓవర్‌టేక్ చేసి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు.



బంగారం ఎత్తుకుని గద్దెల వద్ద గంటలు కొడుతున్న మంత్రులు పొంగులేటి, సీతక్క తదితరులు

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.